


ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


8-3-50

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

వెల 4 అణాలు

విషయానుక్రమణిక

8 మార్చి 1950



కొచ్చిన్ నౌకాశిక్షణ కేంద్రానికి రక్షణశాఖామంత్రి సర్దార్ బలదేవసింగ్ ఫిబ్రవరి 25-వ తేదీన శంకుస్థాపనచేశారు.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతిబుధవారము ప్రకటింపబడును.

ఒరులేయవియొనరించిన నరవర యప్రియము తనమనంబున కగు, దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథముల కెల్లన్.
(మహాభారతము)

Founder : K. NAGESWARA RAO.

సంపుటము **42**
సంచిక **27**

విరోధి సంవత్సర ఫాల్గున బహుళ పంచమి బుధవారము



ఢిల్లీలోని ఇంద్రప్రస్థ మహిళాకళాశాల విద్యార్థినులు, కళాశాల వార్షికోత్సవంలో నాట్యప్రదర్శనం జరుపుతున్న దృశ్యం. నటీబృందం : శ్యామకోయల్, ఉషాభాటియా, శకుంతలాచందస్, యామినీ దేశాయ్‌గార్లు.



ఆంధ్రపత్రిక

1950-వ సం॥ మార్చినెల 8-వ తేది బుధవారము

రిపబ్లిక్ పభుత్వ ప్రథమ బడ్జెట్

“భారతదేశమును ఎదుర్కొనుచున్న విషమ సమస్య ద్రవ్యోల్బణము. ఆ సమస్యాపరిష్కారమునకు కీలకము అధికోత్పత్తి. కాబట్టి ప్రభుత్వము, ప్రజలు, శ్రమికులు, పారిశ్రామికులు వస్తూత్పత్తిని అధికము చేయుటకే తమ యావచ్ఛక్తిని వినియోగించవలెను.” భారతరిపబ్లిక్ ఆర్థికమంత్రి డాక్టర్ జాన్ మత్తాయ్ మంగళవారము పార్లమెంట్‌లో 1950-51 సంవత్సరమునకు ఆయవ్యయఅంచనాలను ప్రతిపాదించుచు చేసిన దీర్ఘప్రసంగసారాంశ మిది. ఆర్థికమంత్రే గాక రిపబ్లిక్ మంత్రులందరు చేయుచుండిన విజ్ఞాపనల సారాంశము ఇదే. కనుక 1950-51ఆయవ్యయఅంచనాలు ఈదృష్టితో తయారుచేయబడుట సహజము. ఆవిధముగ బడ్జెట్‌ను తయారుచేసినఅనంతరము ఆర్థికమంత్రి వస్తూత్పత్తి వృద్ధి కాగలదని “పెట్టుబడిమార్కెట్”లో ఏర్పడియున్న ప్రతిష్టంభనము తొలగగలదని, గత మూడు నాలుగు సంవత్సరములలోకంటె 1950-51 ఆర్థికసంవత్సరములో క్రొత్త పరిశ్రమల స్థాపనకు, స్థాపితమైయున్న పరిశ్రమల అభివృద్ధికి ఎక్కువగ, ధారాళముగ ద్రవ్యము లభింపగలదని ఆశించుటలో అబ్బురమేమియు లేదు. అయితే వారి ఆశలు ఎంతవరకు ఫలింపగలవు? తమ చర్యల ఫలితములను వారెంత సవ్యముగ ఊహించకల్గిరి ? అన్న ప్రశ్నలకు కాలమే సమాధానమీయవలసియుండును. దాదాపు 17 కోట్ల రూపాయల పర్యంతము పన్నుభారమును తగ్గించియు 1950-51 సంవత్సరము ఆయవ్యయఅంచనాలలో 131 లక్షల రూపాయల మిగులు చూపింపకల్గినందుకు ఆర్థికమంత్రి అభినందనీయుడు.

అధికోత్పత్తిని సాధించుటకు ప్రస్తుత పన్ను విధానమునం దెట్టి మార్పులు జరుగవలసియుండును అన్న ఒక్క విషయమునుమాత్రమే బడ్జెట్‌ను తయారుచేయు సందర్భమున డాక్టర్ మత్తాయ్ విచారించి, సామాన్యప్రజలకు ఇందువలన ప్రాప్తించగల ప్రయోజనము లేమి అను విషయమును ఆలోచింపకపోవుట శోచనీయము. 1950-51 అంచనాలవలన సామాన్యప్రజలకు ఆవగింజంత లాభమైనను ప్రత్యక్షముగ కలుగదు. జాతీయాభివృద్ధిపథకములపై రాబోవు సంవత్సరములో కేంద్రప్రభుత్వము ఖర్చుచేయదలచిన 28 కోట్లరూపాయలవలన ఇంతలో ప్రజలకు కలుగగల లాభములు శూన్యము. అట్లే వస్తూత్పత్తి అధికమగుటవలన, క్రమముగ ధరలు తగ్గి, జీవనమూల్యము తగ్గి ప్రజలకు ప్రచ్ఛన్నముగ హెచ్చులాభము కలుగునని ఆర్థికమంత్రి వాదింపవచ్చును. కాని అది ఎన్నటికి సంభవమో ఎవ్వరు చెప్పజాలరు.

ఇతరములు ఏమి చేయలేకపోయినను అధమము తపాలాచార్జీల విషయములో పట్టణవాసులకు కల్గించినట్టి కొద్ది సౌకర్యములను గ్రామస్థులకు వర్తింపచేయవలసియుండెను. వెనుకటివలెనే విమానటపాచార్జీలను తిరిగి ఏర్పరచినను, కార్డు, కవరు ధరలను అర్ధణా, అణాకు తగ్గించిన, కొద్ది మేలైనను గ్రామస్థులకు కల్గియుండెడిది. అట్లే అగ్గిపెట్టెలు, వక్కలు, ముడిపుగాకు, కిరసనాయిలు మొదలైన ప్రజావసరవస్తువులపై ప్రస్తుత మున్న ఎక్సైజుడ్యూటీలను తగ్గించియుండవలసినది.

పారిశ్రామికులు, పట్టణవాసులు, వ్యాపారస్థులు మాత్రమే ఆర్థికమంత్రి క్రొత్తప్రతిపాదనలవలన కొంతవరకు లాభింతురు. పది, పదిహేను వేల మధ్య గల ఆదాయముపై పన్నురేటును తగ్గించినందువలన మధ్యతరగతివారికి మహోపకారము చేసితిమని ఆర్థిక

మంత్రి తృప్తిచెందుట కేవలము ఆత్మవంచనే కాగలదు. ఈ పన్ను రేటును మూడున్నరణాలనుండి మూడుఅణాలకు తగ్గించుటవలన ప్రభుత్వాదాయములో ఒక కోటి రూపాయలుమాత్రము తగ్గునని తెలిసిన ఈ మార్పు ఎందరికి, ఎంతమాత్రము సహాయకరముగ నుండునో బోధపడగలదు. అట్లే అవిభక్త హిందూకుటుంబ పన్నువిధింపు ఆదాయపరిమితిని ఆరువేలరూపాయలకు హెచ్చించుటవలన బహుకొద్దిమంది మాత్రమే, అత్యల్పముగ లాభింతురు.

ఆర్థికమంత్రి తన నూత్నప్రతిపాదనలను ఎట్లు సమర్థించుకొనినను, ఇందువలన మధ్యతరగతివారికిగాని, సామాన్యప్రజలకుగాని ఎట్టి ప్రయోజనము కలుగలేదని నిస్సందేహముగ చెప్పవచ్చును.

పారిశ్రామికులకు, వ్యాపారస్థులకుమాత్రము ఆర్థికమంత్రి హెచ్చుసౌకర్యములను కల్గించెను. 8 కోట్ల రూపాయల ఆదాయము నిచ్చు వ్యాపారలాభముల పన్నును పూర్తిగ రద్దుచేసెను. ఇదేవిధముగ ఆదాయపు పన్నువిషయములోను కంపెనీలకు పదిన్నర కోట్లవరకు పన్నుభారమును తగ్గించెను. పారిశ్రామికులు వ్యాపారస్థులు ఆర్థికమంత్రి ప్రదర్శించిన ఔదార్యమున కెట్టి ప్రతిఫలము నిత్తురో చూడవలసియున్నది. 1950-51 ఆర్థికసంవత్సరములో ప్రభుత్వము 75 కోట్ల రూపాయల ఋణము చేయ సంకల్పించెను. ఈ ఋణము గత సంవత్సరములోవలెనే అలభ్యమగునో లేక ఆశించిన మొత్తముకంటె ఎక్కువ లభించునో చూడవలసియున్నది. అట్లే కంపెనీ డివిడెండ్లను పరిమితము చేయు శాసనమునకును 1950 మార్చి తరువాత తిరిగి ప్రాణప్రతిష్ఠ చేయుట లేదని ఆర్థికమంత్రి స్పష్టముచేసినతరువాత పరిశ్రమల పెట్టుబడుల మొత్తము ఏవిధముగ హెచ్చునో గమనింపవలసియుండును. వస్తూత్పత్తిని అధికము చేసి, పరిశ్రమల అభివృద్ధికి హెచ్చు ప్రోత్సాహ మిచ్చి దేశఆర్థికస్థితి సుస్థిరము చేయుటకు ఆర్థికమంత్రి చేసిన ప్రయత్నము స్తవనీయమే. ఆ ప్రయత్నము ఎంతవరకు ఫలించునన్నదిమాత్రం సందేహాస్పదమే.

భాషారాష్ట్రాలు, రిపబ్లిక్‌ప్రభుత్వవైఖరి

“ప్రభుత్వమువారు ఇప్పటికి భాషారాష్ట్రముల స్థాపించుటకు బద్ధులై యున్నారా?” అని కామత్ గారడిగిన ప్రశ్నకు “ప్రభుత్వమువారు దేనికీ బద్ధులై లేరు” అను సమాధానమును ఒక్క సర్దార్ వల్లభాయ్‌పటేల్ మాత్రమే ఇవ్వగలరు. ప్రభుత్వము తరఫున అధికారరీత్యా ఇతఃపూర్వము వెలువడిన ప్రకటనలు గాని, ఇకముందు వెలువడగల ప్రకటనలు గాని ఉపప్రధాన మంత్రిని ఏవిధముగను బాధింపవు, బంధింపవు. వ్యక్తిగతముగ వారు ఏఅభిప్రాయమునకు వచ్చినా ఇంతవరకు అదే ప్రభుత్వాభిప్రాయముగ చెలామణి యగుచున్నది. కాదని నెగ్గగలవారు లేనంతవరకు ఈ పరిస్థితిలో మార్పేమియు వుండదు.

కనుకనే వాగ్దానభంగము జరుగుచున్నదని తెలిసియు అధిష్ఠానమంత్రివర్గమువారు ఆంధ్రరాష్ట్రసమస్యను పాతరవేయకలిగిరి. అందుకు ఆంధ్రులలో ఆంధ్రులకు, తమిళులతో ఆంధ్రులకు ఏకాభిప్రాయము కుదరకపోవుట కారణమని విమర్శలనణచివేయ ప్రయత్నించిరి. ఆ ప్రయత్నమున చాలవరకు కృతకృత్యులైరి. నిర్భయముగ, నిస్సందేహముగ లోగడ బ్రిటిషుప్రభుత్వము అనుసరించిన విధానమునే అనుసరింపకల్గుచుండిరి.

భాషారాష్ట్రనిర్మాణమువిషయములో ప్రభుత్వము జయపూర్ కాంగ్రెస్ నియమించిన నాయకత్రయనివేదికను అంగీకరించినట్లు ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ అనేకపర్యాయములు ఎట్టి అనుమానములకు, అపోహాలకు ఆస్కారము లేనివిధముగ స్పష్టము చేసియుండెను. థార్ కమిషన్ ఏర్పాటై వారు ఒక విపరీతనివేదికను సమర్పించి కాంగ్రెస్‌నాయకులు భాషా రాష్ట్రముల విషయములో వెనుకటి భావములను మార్చుకొనవలసియుండునని, వాగ్దానభంగమైనను భాషారాష్ట్రనిర్మాణసూత్రానికి స్వస్తిచెప్పవలెనని సుద్దులు చెప్పువరకు కూడ భారతప్రభుత్వము భాషారాష్ట్రనిర్మాణమునకు ఉన్ముఖముగనే గాక, కట్టుబడి

యుండెను. 1947 నవంబరులో అధినివేశశాసనసభయందు ఆచార్య రంగాగారి ప్రశ్నకు సమాధానముగ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ చేసిన దీర్ఘప్రకటన ఈ విషయమును ధ్రువపరచెను. సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడ భాషాధారమైన దురభిమానములను నిరసించినను భాషారాష్ట్రసిద్ధాంతము వర్జితమనిగాని, భాషాప్రయుక్తరాష్ట్రవిభజన కార్యక్రమమునకు స్వస్తి చెప్పబడినట్లుగాని వారు ప్రకటించలేదు. వారిని కలుసుకొనిన ఆంధ్ర, కేరళ, కర్నాటక రాయబారవర్గములకు "భాషారాష్ట్రనిర్మాణమునకు వర్తమానము అదనుగా"దని, అట్టి నిర్మాణముతో ప్రమేయముగలవారిమధ్య సమాధానము కుదిరిన ప్రభుత్వము ఆ సమాధానమును అమలుచేయగలదని హామీ ఇచ్చియుండిరి.

ఇంత జరిగినఅనంతరము సర్దార్ పటేల్ మొన్న పార్లమెంటులో "ప్రభుత్వమువారు దేనికీ బద్ధులై లే"రని చెప్పుట విపరీతముగ నున్నది. ఆంధ్ర రాష్ట్రనిర్మాణమునకు అవసరమైన చర్యలు ఎందుకు తీసుకొనలేదో కారణములను వివరించుతూ చేసిన ప్రకటనకూడ ఇదే ధోరణిలో నున్నది. ఆంధ్రులలో ఆంధ్రులకు, తమిళులతో ఆంధ్రులకు సమాధానము కుదరలేదు గనుక విభజనసంఘుసిఫార్సులను తాము అంగీకరించి వాటిని అమలుజరుపుటకు చర్య తీసుకొనలేదని చెప్పుట సులభమే. కాని అందువల్ల వారు తమ బాధ్యతలను నిర్వహించినవారు కారు. తమ కర్తవ్యమును నిర్వహించినవారు కారు.

సర్దార్ పటేల్ శాఖకార్యదర్శి నవంబరు-26 న రాష్ట్రప్రభుత్వమునకు వ్రాసిన లేఖలో "సమాధానము కుదరని అంశములను కేంద్రప్రభుత్వమునకు నివేదింపవలెను," అని సూచించియుండిరి. వివాదగ్రస్తవిషయములను కేంద్రప్రభుత్వము పరిష్కరించదలచకపోయిన హోంశాఖాకార్యదర్శి చేసిన ఈ సూచనకు అర్థము లేదు, అవసరము లేదు. 1949 నవంబరు 26 న హోంశాఖాకార్యదర్శి సూచనచేసినప్పటికిని గతమాసం భారతప్రభుత్వం మధ్యవర్తిపరిష్కారము లేదని తీర్మానము చేసినప్పటికిని మధ్య ఈ మార్పు వచ్చుటకు ఏమి జరిగెనో తెలియదు. ఆంధ్రరాష్ట్రస్థాపనకు స్వస్తిచెప్పవలె నని భారతప్రభుత్వము తీర్మానించుకొని అందుకు వీలుగ ఈ సాకును పేర్కొనుట జరిగినదని భావింపవలసియున్నది. కేంద్రప్రభుత్వము మాటతప్పినదని సర్దార్ పటేల్ వివరణ స్పష్టము చేయుచున్నది. ఇంతలో ఆంధ్రరాష్ట్రమును వారు ఐచ్ఛికముగ ఏర్పాటుచేయరని స్పష్టమైనది. సర్దార్ పటేల్ సూచించినప్రకారం అన్ని పక్షములమధ్య అంగీకారము కుదిరినను తిరిగి వాయిదా వేయుటకు ప్రభుత్వమున కేదో సాకు ఉండగలదు. కనుక ఆంధ్రరాష్ట్రము పూర్ణానుస్వారమైనట్లే భావించి ఆంధ్రులు భవిష్యత్కర్తవ్యమును కార్యక్రమమును నిర్ణయించుకొనవలసియుండును.

శరత్ చంద్రబోస్

శ్రీ జి. యస్. భార్గవ

"క్విట్ ఇండియా" – ఉద్యమానంతరం, 1945 సెప్టెంబరులో మళ్ళీ ప్రప్రథమంగా అఖిలభారత కాంగ్రెస్ సమావేశము బొంబాయిలో జరిగింది. దానికి శరత్ బాబుకూడా హాజరయ్యాడు. శరత్ బాబును పరిచయపరుస్తూ, రాయిటర్ విలేఖరి, మిస్టర్ కోల్, "సుభాస్ చంద్ర బోసు పెద్ద అన్నగారని" ఉల్లేఖించాడు. ఆమరణాంతము "సుభాస్" బాబు అన్నయ్యగానే మిగిలిపోయాడు శరత్ బాబు. నిజానికి అంతకన్నా చాలా ఉద్ధృతమూ ఉజ్జ్వలమూ అయిన జీవితం గడిపిన మనిషి కేవలం "సుభాస్ పెద్దఅన్న"గా మాత్రమే గణనకు రావడం చాలా శోచనీయం. ఒక ఉన్నతమూర్తి స్వతంత్రనాయకుడుగా ప్రఖ్యాతివహించకపూర్వమే, కేవలం సుభాస్ అన్న" అని అనుకోబడే రోజులలోనే, తన సంపూర్ణస్థాయిని అందుకోకుండా మృతుడై, మనమధ్యను విడనాడిచన్నందుకు దుఃఖిస్తాము. సుభాస్, కీర్తి ప్రతిష్టలను, అతని ఉజ్జ్వలత్వాన్ని, తరించి, పెద్దవాడుగా పైన నిలవటం తేలికపని గాదు. కాని మరోదశాబ్దం, అతిశీఘ్రగతిని మారిపోతున్న ఈదశాబ్దం – మరోదశాబ్దం గనక శరత్ బాబు జీవించిఉన్నట్లయితే, నిస్సందేహంగా తనకొక ప్రజాహృదయంలో స్వతంత్రస్థానాన్ని స్థిరంగా నిలుపుకోగలిగేటివాడు.

కటకంలో, 1889 లో జన్మించాడు. జానకినాధ్ బోసు అన్నే లాయరుగారి మూడవకుమారు డీయన(నాల్గవవాడు సుభాస్ చంద్రబోస్) వీరు అన్నదమ్ములు ఆర్గురు. సుభిక్షమైన, మధ్యతరగతి సంసారాలలో పైశ్రేణిలోని కుటుంబం. కటకం, కలకత్తా, లండన్ లలో శరత్ విద్యాభ్యాసం ఉజ్జ్వలంగా సాగింది. యం ఏ, డిగ్రీ న్యాయశాస్త్ర పట్టం కలకత్తా విశ్వవిద్యాలయంలోనే తీసుకొన్నాడు. కటకంలోనే ఒక ఏడాది న్యాయవాదవృత్తి అవలంబించాడు. తర్వాత బారిస్టరు అయేందుకు ఇంగ్లాండుకు తరలివెళ్లాడు. 24 ఏట వృత్తిలో ప్రవేశించి, అతిశీఘ్రకాలంలో కలకత్తా న్యాయవాదులలో అగ్రశ్రేణికి చేరుకొని రెండుచేతులా సంపాదించ సాగాడు.

సుభాస్ కేంబ్రిడ్జినుంచి వచ్చిరావటంతోనే రాజకీయాలలోకి ఒక్క ఉరుకు ఉరికాడు. శరత్ రాజకీయాలలో జోక్యం కల్గించుకోనేముందు ప్రజాజీవితంలో చాలా అనుభవాలు గడించాడు.

ఈ నెమ్మది మొదటిలో ఉండటం



శరత్ చంద్రబోస్

మూలానే, రాజకీయ సమస్యాపరిష్కారాలలో అతని దృష్టి కొంత సంస్కృతి చెంది నిదానానికే ఆస్కారం ఇచ్చేది. 1924 లో సి. ఆర్. దాస్ కలకత్తా మేయరుగా ఎన్నిక అయినప్పుడు, శరత్ బాబు ఆల్డర్ మన్ గా ఎన్నుకోబడ్డాడు. ఆతర్వాత ఎనిమిది ఏళ్లు మధ్యమధ్య జైలు చూస్తూన్నప్పటికీ ఆ పదవిలోనే అట్టే నిలచాడు. 1928లో కలకత్తాలో కాంగ్రెసు సమావేశం జరిగినప్పుడు, శరత్ బాబు కాంగ్రెస్ కోశాధికారి. అప్పుడు సుభాస్ యువకుడు, కాంగ్రెస్ స్వయంసేవాదళానికి సర్వాధిపత్యం వహిస్తూన్నాడు.

స్వరాజ్ పక్షంవారి ప్రణాళికకు అనుగుణ్యంగా, అప్పుడు ఆ పక్షంలో ఉంటూన్న శరత్ 1927 లో రాష్ట్రశాసనసభకు నిలబడి, పెద్దమెజారిటీతో సభ్యుడుగా ఎన్నిక అయాడు. 1930 శాసనోల్లంఘనోద్యమం శరత్ ను తనలోకి లాక్కోలేకపోయింది. సుభాస్ జైలులో పడ్డాడు గాని శరత్ మాత్రం ఉద్యమానికి దూరంగా ఉన్నట్టే బైటికి కనబడ్డాడు. కాని బ్రిటిష్ అధికారులు ఏదో మిషపెట్టి శరత్ నుకూడా జైలులో పెట్టేందుకు కాచుకొని ఉండిరి. శరత్ చాలా తెలివైన న్యాయవాది అని రాష్ట్రప్రభుత్వానికి తెలుసు. అందుకని సందుదొరకాలని వేచిఉన్నారు. 1932 లో అకస్మాత్తుగా 1818 రెగ్యులేషన్ చట్టం ఆధారంచేసుకొని "డిటిన్యూ"గా ఖైదు చేశారు. అంతకు తక్కువ చట్టాలు ప్రభుత్వానికి ఉపయోగపడలేదు. అతని మీద తెచ్చిన అభియోగం, "టెర్రరిస్టు చర్యలలో చాలా తీవ్రంగా ఈయన కూడా నిమగ్నుడై ఉన్నా"డని. కాని అసలైన కారణం అధికారుల కన్నెఱ్ఱ. ఆరోజుల్లో శరత్, సి.ఆర్. దాస్ స్థాపించిన "ఫార్వర్డు" పత్రికకు మేనేజింగ్ డైరక్టరుగా ఉండేవాడు. సుభాస్ మేనేజరు. 1930 లో ఈస్టిండియన్ రైల్వేలో ఘోరప్రమాదం సంభవించింది. శరత్ బాబు ఫార్వర్డుపత్రికలో ఈ రైలు "ప్రమాదం" విషయం, అంతరంగిక కథ అంతా ప్రచురించబడింది. దానితో ఈస్టిండియా రైల్వే దొరలకు మంట ఎత్తింది. ఫార్వర్డు పత్రికపై 2 లక్షలరూపాయలకు మాననష్టం దావావేసి చివరకు నెగ్గారు. కాని ఒక్కరాత్రిలో ఫార్వర్డు కార్యాలయం, దాని విదేశకార్యాలయాలు కూడా "న్యూఫార్వర్డు" పేరిట మారిపోయి వెలిశాయి. రైల్వేకంపెనీవారు పేరుమారింది తప్ప పత్రిక పాతదేనని తమ డిక్రీ మొత్తం న్యూఫార్వర్డు చెల్లించక తప్పదని న్యూఫార్వర్డుమీద కూడా మళ్ళీ డిక్రీ తెచ్చుకొన్నారు. కాని శరత్ అంత తేలికగా లొంగిపోయే రకం కాదు. న్యూఫార్వర్డు మళ్ళీ పేరుమారి "లిబర్టీ" అయింది. రైల్వే కంపెనీ మరి చేసేది లేక అసహాయ

స్థితిలో పడిపోయింది. అంతతో 1818 రిగ్యులేషన్ చట్టం ఆధారంగా శరత్‌బాబు డిటెన్షన్‌లోకి పోవలసి వచ్చింది. మూడున్నరసంవత్సరాలు కారాగారంలో ఉండి 1935 లో శరత్‌బాబు మళ్లీ బైటికి వచ్చాడు.

1933 లో, కాంగ్రెసు, శాసనసభా ప్రవేశ విధానానికి సమ్మతించింది. కలకత్తా జనరల్ కాన్‌స్టిట్యూయెన్సీనించి కేంద్రశాసన సభాసభ్యత్వానికి శరత్‌బాబు పేరిచ్చాడు. డిటిన్షన్‌లో జైలులో ఉన్నప్పటికీ అపారమైన మెజారిటీతో అసెంబ్లీ సభ్యుడుగా శరత్‌బాబు ఎన్నిక అయాడు. కాని అధికారులు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు అతన్ని విడుదల చెయ్యలేదు. ఆ రోజుల్లో అసెంబ్లిలోని ముస్లిం లీగ్ పార్టీ నాయకుడైన జిన్నాకూడా అసెంబ్లీకి ఎన్నికయిన సభ్యుని, సభాసమావేశానికి హాజరుకాకుండా ఆటంకపరచిన ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా విమర్శించాడు.

1935 ఇండియా అక్టు ప్రకారం జరిగే ఎన్నికలలో పాల్గొనేందుకు అనువుగా తరుణానికి, 1935 లో శరత్‌బాబు జైలు విముక్తి పొందాడు. రాష్ట్రశాసనసభలో ప్రతిపక్షనాయకుడుగా ఉంటూ, ఫజల్‌హక్ మంత్రివర్గానికి ఊపిరాడకుండా చేశాడు శరత్‌బోస్. 1939 లో త్రిపురికాంగ్రెస్ సమావేశానంతరం, కాంగ్రెస్ హైకమాండుతో బోస్ సోదరులకు విభేదం వచ్చింది. సుభాస్‌తోపాటు, శరత్, మరికొందరూ, కాంగ్రెస్‌ను వదిలారు. "ఫార్వర్డుబ్లాక్" ఏర్పడ్డాక శరత్ కూడా అందులో చేరాడు. కాని 1941లో వంగరాష్ట్రప్రధాని ఆవగలడనుకొంటూన్న తరుణంలో, అతన్ని డిటైన్ చెయ్యటం, శరత్‌బాబు రాజకీయ జీవితంలో చాలా ప్రముఖఘట్టంగా తయారయింది. బెంగాల్ అసెంబ్లీలోని కాంగ్రెస్‌నుంచి చీలిన చీలికకు నాయకుడుగా ఉంటూ, ముస్లింలీగ్, హిందూ మహాసభ, మొదలైన శాసనసభాపక్షాలన్నిటిని ఏకనాయకత్వం క్రిందికి కూడగట్టుకొనివచ్చి. సెక్షన్ 93 పరిపాలనను అంతమొందించటానికి శరత్ ప్రయత్నించాడు. కాని ప్రభుత్వం, అకస్మాత్తుగా, జపాన్ వారితో కలవచూస్తూన్నాడన్న భయంమీద వేరే కారణాలుకూడా వెతుక్కోక్కర లేకుండా ఖైదుచేసి, దక్షిణభారతదేశంలో ఉంచింది. 1932, 1941 లలో రెండు మాట్లూకూడా శరత్‌ను డిటెన్యూగా పట్టుకొనేందుకు 1818 రెగ్యులేషన్ చట్టమే అనుసరించటం గమనించదగ్గ విషయం. అందులో మోపబడ్డ నేరాలకు ఏ న్యాయస్థానంలోనూ నిరూపణ జరగనేలేదు.

1945 లో శరత్‌బాబుకీ కాంగ్రెస్ హైకమాండుకీ మళ్లీ కాస్త మాటామంతీ కుదిరాయి. 1945 బొంబాయి కాంగ్రెస్ సమావేశంలో వేదికపైన సర్దార్ పటేల్, శరత్‌బాబులు చిరవియోగం అనుభవించి కలుసుకొన్న సోదరులలాగా ఒకరినొకరు బిగ్గ కౌగలించుకొన్నారు. గతఐదుసంవత్సరాలో శరత్ జీవితంలో చాలా తీవ్రమైనమార్పులున్న ఘట్టాలు వచ్చాయి. ఈ మార్పులనన్నిటినీ ఒక టాకీమీద సూత్రీకరించటం కష్టమౌతుంది. 1946 లో నెహ్రూ కొంతకాలం కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు, కార్యవర్గంలోకి శరత్‌ను తీసుకొన్నాడు. ఆ రోజుల్లో, శరత్ నెహ్రూను తీవ్రంగా ఖండిస్తూ, పటేల్‌ను బలీయంగా సమర్థిస్తూం జేవాడు. కాంగ్రెస్‌నుంచి విడిపడ్డాక కూడా అతని దృక్పథం అల్లాగే ఉండిపోయింది. వామపక్షానికి చెందిన మనిషిలో ఈ దృష్టి నిజంగా వైపరీత్యమే ననిపిస్తుంది,

ఆ సంవత్సరపు తాత్కాలిక కేంద్ర ప్రభుత్వవర్గంలో శరత్ కూడా ఉన్నాడు. కాని లీగ్‌వారు వచ్చేటప్పటికి శరత్ తన సీటు వాళ్లకు వదలవలసివచ్చింది. ఆనాటి నుంచే శరత్ కాంగ్రెస్‌తో సంబంధాలు తెంపేసుకొన్నాడు.

రాజకీయ సామర్థ్యం ఎంతఉన్నా, చనిపోయేటప్పటిదాకా కూడా, శరత్ ఒక సంపూర్ణతత్వాన్ని దేన్నీ అమర్చుకొలేని వ్యక్తిగానే నిలిచిపోయాడు. అతని జీవితమంతలోనూ కూడా, బలీయమైన, ఒక వేదాంతమూ సిద్ధాంతమూ, కాక కేవలం వ్యక్తిత్వబలంమీదే రాజకీయాల నిరంతరపోరాటంలో బలంగానిలబడగలుగుతూ వచ్చాడు. ఇతరులలో ఒక్కొక్కప్పుడు తన మాటకు ఒప్పుకోలు తెచ్చుకోగలిగినా నిత్యం వాళ్లను లోబరుచుకోగల శక్తి ఉన్నట్లుం జేదికాదు. ఈనాడు ఈ బలీయమైన వ్యక్తి అంతర్హితుడౌటంతో, పార్టీకి ఆస్థానం ఆక్రమించగల వ్యక్తిత్వం గలవారు తేలికగా లభించకపోవటంవల్ల ఖాళీగానే ఉండిపోవలసిరావచ్చును.

(కాపీరైటు యస్. పి. యస్)

మన రాష్ట్రం, మన దేశం:

భారత రిపబ్లిక్ బడ్జెట్; మద్రాస్ బడ్జెట్

పెట్టుబడిదారులకు తుది అవకాశం

ఈ వారంలో సోమవారం నాడు మద్రాసు శాసనసభలో చెన్నరాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్, మంగళవారం నాడు భారత రిపబ్లిక్ పార్లమెంటులో రిపబ్లిక్ మొదటి బడ్జెట్ ప్రతిపాదించబడినాయి.

ఇటీవల బొంబాయిలో సర్దార్ పటేల్ చేసిన ప్రసంగాన్ని బట్టి వ్యాపారులపైన పన్నుల భారం కొంత తగ్గవచ్చునని అందరూ ఆశించినదే. ఆ ప్రకారమే భారత రిపబ్లిక్ బడ్జెట్‌లో వ్యాపారపు పన్ను రద్దుపరచబడింది. ఇతరత్రా కూడా పెట్టుబడిదారులు వ్యాపారుల పన్ను భారం తగ్గించబడింది. రూపాయి మారకం విలువ తగ్గింపుతో పారిశ్రామికులకు వ్యాపారులకు ప్రోత్సాహమిస్తేగాని దేశ ఆర్థిక పరిస్థితి చక్కబడదనే అభిప్రాయం ప్రబలమయింది. పన్నుల భారం అధికంగా ఉన్నందువల్లనే దేశంలో వస్తూత్పత్తి వృద్ధి కావడంలేదని ప్రభుత్వం అభిప్రాయపడుతున్నట్లు భారత ఆర్థికమంత్రి డా॥ జాన్ మత్తయ్ పార్లమెంటులో అన్నారు. అయితే మధ్యతరగతి వారికీ పేదవారికీ నానాటికీ భారతరమౌతున్న ప్రచ్ఛన్న సుంకాలు తగ్గించబడలేదు. వస్తూత్పత్తి వృద్ధి అయితే అవసరవస్తువుల ధరలు తగ్గి వీరి జీవనవ్యయం తక్కువౌతుందని డా॥ మత్తయ్ చెప్పారు. ప్రభుత్వవ్యయం తగ్గించుకోడానికిగాను ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలలో కొన్నిటిని నిలిపివేయవలసి వచ్చింది. ముఖ్యమైన కార్యక్రమాల్ని మాత్రం మానడంలేదన్నారు.

చెన్నరాష్ట్ర ప్రభుత్వపు బడ్జెట్‌లో మాత్రం పన్నుల భారం ఏతరగతి ప్రజలకీ తగ్గకపోగా, ప్రభుత్వపు ఖర్చు మాత్రం తగ్గించబడుతోంది. కాని అమ్మకపు పన్నుల విధింపువల్ల ఏటేటా ప్రభుత్వాదాయానికి ఆదాయం పెరుగుతుంది. అవసరవస్తువులపైన ఈ పన్ను విధిస్తున్నందువల్లనూ, గడిచిన సంవత్సరం అమ్మకపు పన్ను రేట్లు హెచ్చించి, కొత్తగా మరి కొన్ని వస్తువులపైన కూడా ఈ పన్ను విధించినందువల్లను, సామాన్యంగా జీవనవ్యయం పెరిగి, ఆహారవస్తువుల ధరలు పెరుగుతున్నాయి. మిరప మొదలైనవానిపైన అమ్మకపు పన్ను విధించకపోయినప్పటికీ, రాష్ట్రంలో ఇప్పటికి పప్పులు, నూనె, నెయ్యి, మిరప, వస్తువుల ధరలు క్రమక్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరల పెరుగుదలకి ఎక్కడా అంతు కనిపించడంలేదు.

దేశంలో వస్తూత్పత్తి పెరిగితే దేశ ఆర్థిక సమస్య పరిష్కారం కాగలదని రిపబ్లిక్ ఆర్థికమంత్రి డా॥ మత్తయ్ అన్నారు. కాని గతసంవత్సరం పంచదార పరిశ్రమ స్థితినీ, వస్త్రపరిశ్రమ పరిస్థితినీ గమనిస్తే ఈ విధంగా చెప్పడానికి వీల్లేదు. ఉత్పత్తి అయిన వస్త్రాన్ని పంపకం చేసే విధానం లోపభూయిష్టంగా ఉన్నందువల్లనూ, రైల్వే రవాణాలో చిక్కులు సంభవించినందువల్లనూ వస్త్రం ఎక్కడి కక్కడ అమ్ముడు కాకుండ నిలువ లుండిపోతూ యున్నారు. దేశంలో వస్త్రం నిలవుండిపోయినప్పటికీ ధరల్లో చెప్పుకోదగిన తగ్గుదల లేకపోయింది. పంచదార పరిశ్రమ పరిస్థితి మరీ వింతగా ఉంది. చెరుకు ఉత్పత్తిదారుల్ని ప్రోత్సహించడానికీ, వారికి న్యాయమైన ధరలు లభింపచెయ్యడానికీ, కొన్ని రాష్ట్రాలలో శాసనాలు ప్రవేశపెట్టనున్న సమయంలో, ముందుగానే పంచదార సిండికేట్ వారు పంచదార కరువు సృష్టించగలిగారు. బీహారు, ఉత్తరప్రదేశాలలో చెరుకు కంట్రోల్ శాసనాల వల్ల దుస్థితి ఏర్పడిందన్నారు. పంచదార మిల్లుల వారు, రవాణా చిక్కులు కూడా కరువుకు ముఖ్యకారణమన్నారు.

దీనినిబట్టి చూస్తే వ్యాపారులకు పారిశ్రామిక యజమానులకు పెట్టుబడిదారులకు పన్నుల భారం తగ్గించడంతో ఈ సమస్య తీరిపోదని అనుమానం కలుగుతుంది. పన్నుల భారం తగ్గించడంతోబాటు, ధరలపైన కంట్రోల్స్‌ను సక్రమంగా నిర్వహించవలసిన అవసరం కూడా ఉంది. నిజంగా ఈనాడు ఆహార సమస్యగాని, అవసరవస్తువుల కొరత తీర్చడానికిగాని ధరల కంట్రోల్స్ కూడా ముఖ్యమైన సమస్య.

రిపబ్లిక్ బడ్జెట్ వివరాలు

మంగళవారంనాడు రిపబ్లిక్ పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి డా॥ జాన్ మత్తయ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముఖ్యాంశాలు :

ప్రభుత్వానికి ఆదాయం మొత్తం రు 347 కోట్ల 50 లక్షలు. ఖర్చు రు 337 కోట్ల 88 లక్షలు. మిగులు. రు 9 కోట్ల 62 లక్షలు. వ్యాపారలాభాల పన్ను రద్దుపరచడంవల్లనూ, ఇతరత్రా పన్నుల తగ్గింపువల్లనూ, ఆదాయం రు 3 కోట్ల 31 లక్షలు తగ్గిపోతుంది. అంటే ఇంక మిగిలేది కోటీ 31 లక్షల రూపాయలు.

కొత్తపన్నులేవీ విధించబడవు.

వ్యాపారలాభాల పన్ను రద్దుపరచబడుతుంది.

కంపెనీలు చెల్లించే రాబడి పన్ను రేటు అయిదణాలనుంచీ నాలుగణాలకు తగ్గించబడుతుంది. వారి సూపర్‌టాక్సు రేటు మాత్రం అర్థణా హెచ్చించబడుతుంది. పదివేలు పదిహేను వేల రూపాయల మధ్యగా

రాబడిగలవారు చెల్లించవలసిన రాబడి పన్ను రేటు మూడున్నర అణాల నుంచీ మూడణాలకు తగ్గించబడుతుంది. పదిహేను వేలరూపాయలకు పైన రాబడిగలవారు చెల్లించవలసిన రాబడిపన్ను రేటు అయిదణాలనుంచి పావలాకు తగ్గించబడుతుంది.

సూపర్‌టాక్సు విధింపువిషయంలో సామాన్యలాభార్జనలకీ, (ఎర్న్‌డ్ ఇన్‌కమ్స్), అనర్గత్య లాభాలకీ (అనెర్న్‌డ్ ఇన్‌కమ్స్) మధ్య వ్యత్యాసాల్ని తొలగించి రేట్లు తగ్గిస్తారు. మొదటిరకంపై తొమ్మిదణాల రేటు రెండోరకంపై పదణాలరేటుకూడా ఎనిమిదణాలకు తగ్గిస్తారు.

హిందూ అవిభక్తకుటుంబాలు చెల్లించవలసిన రాబడిపన్నుల నిమిత్తం అయిదు వేల రూపాయిల లోపు రాబడిగలవారే కాక ఆరు వేల రూపాయల లోపు రాబడిగలవారు కూడా రాబడిపన్ను చెల్లించవలసిన అవసరం ఉండదు.

టెలిగ్రాం ఛార్జీల రేటు లో అణా తగ్గించబడుతుంది. ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఛార్జీల రేటు రెండణాల చొ॥ తగ్గించబడుతుంది. ఊరుదాటి పంపనక్కరలేని తపాలా రేట్లు కవరువెల రెండణాలనుంచి ఒకణాకు, కార్డు వెల మూడు కాన్లనుంచి రెండు కాన్లకు తగ్గించబడతాయి. (ఇవి చెన్నపట్నంవంటి పెద్దపట్నాలలో ఏ కొద్దిమందికోతప్ప ఈ తగ్గింపు ఉపయోగం ఉండదు.) ట్రంక్ టెలిఫోన్ ఛార్జీలు రు 16 నుంచి రు 12 కు తగ్గించబడతాయి.

కార్పొరేషన్ టాక్స్ రేట్లు రెండణాల నుంచి రెండున్నరణాలకు హెచ్చించబడతాయి.

డివిడెండ్లు ఫలాని పరిమితికి హెచ్చుగా ఉండరాదనే నియమం (మార్చి 31 నుంచి) రద్దుపరచబడుతుంది

1950 మార్చివరకూ కట్టే ఇళ్ల వల్ల వచ్చే ఆదాయంపైన పన్ను కట్టనవసరం లేదనీ, వ్యాపార భవనాల డిప్రీసియేషన్ ఎలవెన్స్ పరిమితిని హెచ్చించుకోవచ్చుననీ ప్రభుత్వం అనుమతించిన నియమాలను ఇంకా రెండేళ్లు అమలులో ఉంచగలరు.

పంచదారపరిశ్రమను ప్రోత్సహించి అన్యదేశాలతో పోటీకి తట్టుకోగలగడానికిగాను ఇంతవరకూ విధిస్తున్న రక్షణపన్నును రద్దుపరచి, ఇకనుంచి రెవిన్యూశిస్తు విధించగలరు. అలాగే పొటాసియం పెర్మాంగనేట్ పైకూడా రక్షణసుంకాన్ని రద్దుపరిచి రెవిన్యూపన్ను విధించగలరు.

ఈ మార్పులన్నిటినీ అమలు జరపడానికిగాను ఆర్థికమంత్రిగారు పార్లమెంటులో ఒక బిల్లు ప్రవేశపెట్టగలరు. బిల్లుకు పార్లమెంటు ఆమోదించినట్లయితే ఈ మార్పులు 1950 ఏప్రిల్ 1 నుంచి అమలుజరుగుతాయి.

రిపబ్లిక్ ప్రభుత్వపు ఆయవ్యయాల్లో ముఖ్యాంశాలు :

మొత్తం ప్రభుత్వపు ఖర్చులో దాదాపు సగంవరకు దేశరక్షణనిమిత్తమే ఏర్పాటయింది. గతసంవత్సరం (1949-50) రు 170 కోట్ల ఆరులక్షలు దేశరక్షణ నిమిత్తం ఖర్చుపెట్టబడింది.

ఈసంవత్సరం (1950-51) రు 168 కోట్ల ఒక లక్ష ఏర్పాటవుతున్నది. దేశరక్షణ శాఖావసరాలనిమిత్తం వస్తూత్పత్తికి పెట్టుబడిఖర్చు ఈ సంవత్సరం రు 8 కోట్ల 15 లక్షలు ప్రత్యేకించబడుతున్నది. (గత సంవత్సరం రు 12 కోట్లు)

ఆహారాన్ని దిగుమతిచేసీ సేకరణచేసీ తక్కువ ధరలకు అమ్మించడంవల్ల రు 21 కోట్లు లోటు భరించవలసివస్తూంది. (గతసంవత్సరం రు 29 కోట్ల 67 లక్షలు)

సంస్థానాల ఆర్థికవ్యవస్థని రిపబ్లిక్‌లో విలీనంచేసినందువల్ల ఖర్చు రు $9\frac{1}{2}$ కోట్లు అధికం కాగలదు.


1950-51 లో ప్రజలవద్దనుంచి రు 75 కోట్లు మాత్రమే ఋణం తీసుకోవడానికి నిర్ణయించబడింది.

దేశఆర్థికపరిస్థితి :

దేశంలో వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగానూ, ఎగుమతులు అభివృద్ధిపరచడానికిగాను రూపాయిమారకం విలువ తగ్గించినందువల్లనూ దేశఆర్థికపరిస్థితి ఇంక బాగుపడగలదనే ఆశలు స్థిరపడినవని ఆర్థిక మంత్రి మత్తయ్ పార్లమెంటులో చెప్పారు. ధరల పెరుగుదల నిలిచిపోయిందని చెప్పారు. విదేశాలకు వస్తువుల ఎగుమతి 1949 నవంబరు డిసెంబరు మాసాల్లో చాలా పెరిగిందన్నారు. పారిశ్రామికవస్తువుల ఉత్పత్తి వృద్ధి అయిందన్నారు. అయితే నూలు, వస్త్రం, నారపరిశ్రమల పరిస్థితి మాత్రం చిక్కుల్లో పడిపోయింది. దీనికి ముఖ్యహేతువు పాకిస్తాన్ వైరం.

దేశరక్షణశాఖకు ప్రత్యేకించబడినది ఇప్పుడు రు 168 కోట్ల ఒక లక్షే అయినప్పటికీ, ప్రమాదపరిస్థితి ఏర్పడినట్లయితే,

(38 వ-పేజీ చూడుడు)



ఢిల్లీ ఆర్థికపాఠశాల స్థాపనదినోత్సవసందర్భమున జరిగిన సభకు అధ్యక్షతవహించిన భారతప్రధాని నెహ్రూ ప్రసంగిస్తున్నప్పుడు తీసిన చిత్రం.

★ మద్యపాన నిషేధం ★

శ్రీ సహజానందం

కాంగ్రెసు ప్రభుత్వాలమలుజరుపుతున్న మద్యనిషేధాన్ని పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వ్యక్తిస్వాతంత్ర్యానికిందువల్ల దెబ్బతగులుతోందని వాదిస్తారు కొందరు. కాని ఈవాదన నిలవలేదు. శాంతిభద్రతలు భగ్నంచేయనీయకుండా ప్రభుత్వం శాసనాలను అమలుజరిపినప్పుడూ, తమ వ్యక్తిస్వాతంత్ర్యం దెబ్బతింటోందని వాదిస్తారు—అరాచకవాదులు. కాబట్టి వ్యక్తిస్వాతంత్ర్యం ఎప్పటికీ విచ్చలవిడిగా, అరాచకజీవితాన్ని ప్రబోధించే తత్త్వంగా ఎవరూ పరిగణించరు.

ఇదొక నైతికచాదస్తం అని కొంత మంది అంటారు. రిజర్వుబ్యాంకుడైరక్టర్లలో ఒకరైన శ్రీనివాసన్, శాసనాలద్వారా ప్రజలకు నీతిబోధ చెయ్యటం ఏమిటి అని విమర్శించాడు. దొంగతనం, దోపిడీ, హత్య, వగైరా చర్యలను అరికట్టటంకూడా నైతిక చాదస్తంకిందకే వస్తయ్. అలా అని వాటి నరికట్టేందుకై తగిన శాసనాలను ప్రభుత్వం అమలుజరుపకుండా, ఆ బెడదను సంఘానికే వదలివేస్తే, అప్పుడు ఈ విమర్శకు లేమంటారు? నీతిరహితమైన శాసనం ఏముంది? ఏదో ఒక అవినీతిని అరికట్టేందుకే శాసనాలు. 'నీతి' అనేప్పటికి కొంత మందికి చాలా చౌకవిషయంగా తట్టుతుంది. సంఘంలో నైతికస్థిరత్వవిషయంగురించి ప్రభుత్వాలు బాధ్యతవహించకుండాఉంటే, తాగుడు, జూదం, దొంగతనం ఇవే కాదు సంఘంమూలంలోనే వేరుతెగి కృశిస్తుంది. 'నీతి'ని గర్హించటం ఒక నాగరికలక్షణమని అనుకుంటున్నారు. ఇటువంటి సంప్రదాయమే దేశాల్లో సాంఘిక అరాచకానికి చాలావరకు కారణం. ఒకపక్కన 'విడాకుల' శాసనాలను ('డైవోర్స') అమలు జరపాలని, ఇప్పుడా విధానం సంఘానికి శ్రేయస్కరమని, అంటున్నారు. మరి 'నీతి'లో శాసనాలకు సంబంధం లేదంటే?

ప్రభుత్వాదాయం ఇందుమూలంగా తగ్గుతోందని ఆర్థికపండితుల్లో కొంతమంది విమర్శ. ఇది నిజమే. కాని ఈ నిజం యొక్క నిజాన్ని కూడా మనం గ్రహించాలి. ప్రభుత్వాల ఆదాయాల్లో మూడోవంతును తాగుబోతులు ఇళ్ళూ వళ్ళూ గుల్లచేసుకొని, సమర్పిస్తున్నారు. ఈ తాగుబోతుల సాంఘిక, ఆర్థికస్థితి ఎటువంటిది?

సంఘంలో తక్కువకులాలవారిలో ఎక్కువమంది; గర్భదరిద్రులు...వీరే తాగుబోతుల్లో అధికసంఖ్యాకులు. ఈ తక్కువకులాలవారు, ఈనిరుపేదలు......వీరి దైన్య, దారిద్ర్యాల్లోంచే మంత్రుల విలాసాలు, ప్రభుత్వభవంతులు, ప్రజలసౌకర్యాలు... నిర్మిస్తున్నారు!

కొందరు అంటారు: పాశ్చాత్యదేశాల్లో సగటున వ్యక్తికి తాగుడుకింద అయ్యే ఖర్చుకంటే, మనదేశంలో అయేఖర్చు తక్కువ అని. రోజుకు ఇంగ్లండులో ఒకరూపాయి సగటున వ్యక్తి ఖర్చుపెట్టితే, మనదేశంలో రోజుకు సుమారు బేడమాత్రమే అవుతోందంటారు. మద్రాసురాష్ట్రపు జనాభా సుమారు $5\frac{1}{2}$కోట్లు. మొత్తం తాగుడుకింద అయేఖర్చు 70 లేక 80 కోట్లు. అంటే రోజుకు 7 పైసలు. బొంబాయి రాష్ట్రజనాభా సుమారు 2 కోట్లు. తాగుడు ఖర్చు రు 40 కోట్లు. రోజుకు సుమారు 0-0-11 లు. కాబట్టి తాగుడుగురించి విచారించనక్కర్లేదంటారు.

కాని ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుంచుకోవాలి. పాశ్చాత్యదేశాల్లో ఎక్కువమంది—స్త్రీలు, పురుషులు—తాగుడు అలవరుచుకున్నారు. మనదేశంలో తక్కువమందికే ఈ అలవాటు ఉంది. కాబట్టి తాగుబోతుల్లోనే వ్యక్తికి సగటున ఎంత అవుతోందీ అని లెక్కవేస్తే, మనదేశంలోనే ఎక్కువ ఖర్చు అవుతోందని తెలుస్తుంది.

1937 లో మొదటిసారిగా మద్యపాన నిషేధాన్ని సేలంజిల్లాలో అమలు జరిపినప్పుడు, సేలంనగరజనాభాలో 100 కి 10 మందికే తాగుడు అలవాటు ఉంది. ఆ జిల్లాపల్లెల్లో 100 కి 7 గురు లేక 8 మంది మత్రమే తాగుడుకు అలవాటుపడ్డారు. నగరకార్మికులు తమ సంపాదనలో 27.3% ను తాగుడుకై ఖర్చు పెట్టారు. పల్లెవారు 50% ను ఖర్చుపెట్టారు. ఇంగ్లండులో కార్మికులు 15% మాత్రమే ఖర్చుపెట్టారు. కాబట్టి ఇతరదేశాల్లోకంటే మనదేశంలో తాగుడుకింద అయే ఖర్చు తక్కువ అనుకోటం భ్రాంతి.

ఇలా ఈ తాగుబోతుల ఆదాయంలో 8% నుంచి 27% తాగుడుకు ఖర్చు కాగా, అందులోంచి ప్రభుత్వానికి భూమిశిస్తుకంటే రెట్టింపుఆదాయం వస్తోంది. 1945-46 లో మనరాష్ట్రంలో భూమిరివెన్యూకంటే 'ఎక్సైజు' రెట్టింపు వచ్చింది.

ప్రభుత్వఆదాయంలో 34.3% ను సమకూరుస్తున్న ఈ తాగుబోతులు జనాభాలో 100 కి 16 గురు మాత్రమే. ఈ 16 గురు తక్కువకులాలకు చెందినవారూ, గర్భదరిద్రులూను. వీరి ఉద్ధరణే సంఘలక్ష్యమని అంటూ, వీరిని పీల్చి, పిప్పిచేస్తున్న కల్లుసారాలను రద్దుచేస్తుంటే, మళ్లీ తీవ్రంగా విమర్శిస్తారు. చేసే ఉద్ధరణసంగతి ఏమైనా, ఇప్పుడున్న అధమస్థితిని నిర్మూలించటం మొదటిపని కాదూ?

మద్యపాననిషేధంవల్ల ప్రభుత్వానికి సుమారు రు. 17 కోట్లు నష్టం. కాని తాగుడు అలవాటైన జనానికి రు. 70 కోట్ల నుంచి రు. 80 కోట్లదాకా లాభం. ప్రజలకు ఇవ్వాళ కలిగే లాభంవల్ల మళ్లీ ప్రభుత్వానికి లాభం చేకూరుతుంది. ఇప్పుడీ రు. 70 కోట్లు జీవితావసరాలకింద ఖర్చు అవుతోంది. మద్యపాననిషేధంవలన తాగు

బోతుల ఆర్థికపరిస్థితిలో కలిగిన మార్పులు చూద్దాం:—

(ఈ వివరాలను, సేలంలో నిషేధాన్ని గురించి మద్రాసుయూనివర్సిటీవారు పరిశీలనచేసి ప్రకటించిన రిపోర్టు ఆధారం.)

	నిషేధానికి పూర్వం, మొత్తం ఖర్చులో%	తర్వాత మొత్తంఖర్చులో%
తాగుడు	24 8	– –
ఆహారం	42.9	55.8
పొగాకు, తమలపాకులు	5.3	4.2
బట్టలు	6.1	8.7
వినోదాలు	1.4	3.2

(1937 లో సేలంలో రాజేంద్రమిల్లులో కార్మికుల ఖర్చుగురించి చేసిన పరిశీలన దీనికాధారం.)

అంటే ఆహారంమీద 32%, బట్టలమీద 43.9%, వినోదాలకింద 128.2% ఎక్కువ ఖర్చు పెట్టుకోగలిగారు.

అలాగే సేలం మ్యునిసిపల్ పనివారు నిషేధంతర్వాత ఆహారంకింద 10.5%, బట్టలకింద 41.2%, గృహవసతి కింద 50%, వినోదాల కింద 600% ఖర్చు పెట్టుకోగలిగారు. అప్పులుకూడ కొంతవరకు తీర్చుకోగలిగారు.

నిషేధంతర్వాత వారు తినే తిండిలో వచ్చిన వృద్ధి:—

ఆహారం.	మిల్లుకార్మికులు. %	పాకీపనివారు. %
అన్నం	13	39-బియ్యం 9-రాగి
పప్పు	25	50
పోపు	26	33
ఉప్పు	35	6
కూరగాయలు	63	75
పంచదార	47	—
నూనె	20	131
నెయ్యి	166	—
పాలు	85	—
పెరుగు	213	—
మాంసం,చేపలు	10	35
కాఫీ,టీ,చిరుతిండి	316	135

ఆహారపదార్థాల వినియోగం బాగా ఎక్కువైంది. అయితే ఇది దుబారాఖర్చు అనుకోకూడదు. అసలే ఈశ్రమజీవుల జీవనస్థాయి చాలా హీనస్థితిలో ఉంది. నిషేధం మూలంగా జీవనవసతి కొంచెం బాగుపడ్డది. పిల్లలకు పాలు లభించినయ్. చాలా కుటుంబాలు పాలు, పెరుగు కొనటం ఆరంభించారు.

పాకీపనివారు గొడ్డుమాంసం తినటం మానారు. వంటసామానుకు పాతమట్టికుండల స్థానే ఇత్తడిసామాను కొనుక్కోగలిగారు. చాలాకుటుంబాలు, గుడిసెలు మరమ్మతు చేసుకున్నారు. మంచాలుకొనుక్కున్నారు. ఆడవాళ్లు కొద్దిగా నగలుకూడా ధరించారు.

ఇప్పుడుకూడా ప్రభుత్వం మద్యపాననిషేధంమూలంగా ఆర్థిక పరిస్థితుల్లో వచ్చినమార్పులను పరిశీలించే ఏర్పాటు చేస్తున్నారు. పరిశీలన ప్రకటింపబడినాక, ప్రజ ఎలా బాగుపడ్డదీ సువ్యక్తమవుతుంది.

ముఖ్యంగా స్త్రీలు, పిల్లలు నిషేధంవల్ల బాగా బాగుపడ్డారు. నిషేధం స్త్రీలకు పండగగా ఉంది. అంతవరకు దుఃఖభూయిష్ఠంగా వున్నవారి జీవితంలో కొత్త సామరస్యం, గృహశాంతి ఏర్పడ్డయ్.

అన్ని జిల్లాలోనూ నిషేధం అమలు జరపాక, 'హుండీ' పెట్టెలద్వారా మొత్తం రు 5, 39, 498 లు దాచుకున్నారు.

నిషేధచట్టంకింద నెలకు సుమారు సగటున 2580 నేరాలు ఉంటున్నయ్. 5½ కోట్ల జనాభాకు ఇదొక పెద్దవిషయం కాదు. విమర్శకులు దొంగసారావ్యాపారంగురించి చేసే వర్ణనలతోపాటు, ఆ దొంగవ్యాపారనిర్మూలనకుకూడా పాటుపడితే ప్రభుత్వానికి పని తేలిక అవుతుంది. 88,00,000 మంది తాగుబోతుల్లో నేరాలు చేస్తున్నవారి సంఖ్య చాలా తక్కువ.


కాబట్టి ఎవరికోసం నిషేధం ఉద్దేశింపబడిందో, వారు నైతికంగా, ఆర్థికంగా వికాసం పొందగలుగుతున్నారు.

ప్రభుత్వానికి రు 17 కోట్ల ఆదాయం తగ్గుతోంది. మరి ఎలా అంటారు ఆ 17 కోట్ల భారం సంఘమే నిర్వహించాలి. ఎందుకంటే నిషేధంవలన వెంటనే తాగుబోతులు బాగుపడినా, క్రమేపీ యావత్తు సంఘమూ ఆర్థికంగా కూడా బాగుపడుతుంది. ఇప్పుడు తాగుడుకింద ప్రజలు ఖర్చు పెట్టుతున్న రు 80 కోట్లు క్రమేపీ ఆహారంమీద,బట్టలమీద ఇళ్లమీద, జీవితావసరమైన సరకులమీద ఖర్చుఅవుతుంది. ఇప్పుడే కొద్దిమంది తాగుడువ్యాపారుల చేతుల్లోకి వెళ్లే కోట్లు అప్పుడు పరిశ్రమలు, వ్యాపారవృద్ధి, విస్తరణలకు తోడ్పడుతుంది. ప్రజల కొనుగోలుశక్తి హెచ్చినకొద్దీ, దేశం అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలు, వ్యాపారం వృద్ధిచెందుతాయ్. ప్రభుత్వాదాయం పెరుగుతుంది.

కాబట్టి నిషేధం నైతికంగానే కాక, ఆర్థికంగా కూడా తాగుడు అలవాటయినవారికీ, సంఘానికీ, ప్రభుత్వానికీ ఉపయోగిస్తుంది. మద్యవ్యాపారంలో ఖర్చుఅవుతున్న డబ్బుకు ఇతర వ్యాపారాలద్వారా ఇంకెక్కువ ప్రయోజనం లాభాలు లభిస్తయ్.

శ్రమజీవుల, దరిద్రుల ఆదాయాలను పెంచటం సాధ్యంకాకపోయినా, కనీసం వారి హీనఆదాయంలో మూడోవంతు సగం ఎందుకూ కొరగాకుండా ఖర్చవకుండా చేయగలిగితే, అదే చాలు. నిషేధంవల్ల వారి శరీరశక్తి వృద్ధిచెందుతుంది. పని ఎగకొట్టటం మానుతారు. పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తి హెచ్చుతుంది. కాబట్టి నిషేధం దేశశ్రేయస్సుకు దోహదపడుతుంది.

———



బ్రిటిష్ టాంక్ దళాలకు చెందిన క్రొత్త సూపర్ టాంక్

నవల:



శ్రీ నోరి నరసింహశాస్త్రి

౨౧

'ణమో అరిహంతాణం ణమో సిద్ధాణం ణమో ఆయరియాణం
ణమో ఉవజ్ఝాయాణం ణమో లోప సవ్వసాహూణం1'
పంచనమస్కారమంత్రము.

కార్తికమాసము వచ్చినది. ఈ మాసము స్మార్తులును శైవులును వైష్ణవులును పరమపవిత్రముగా భావింతురు. జైనులకు గూడ దీపావళి మహాపర్వపమయము. అది వారి సంవత్సరాది. ఆనాడు మహావైభవముతో వారు లక్ష్మీపూజ గావించి తదాది కార్తికమాసమున లక్ష్మీమహోత్సవములు వైభవముగా జేయుదురు. అందుచే వారికిని కార్తికమాసము మహాపర్వమే!

ఏకశిలానగరమున ఆగ్నేయదిశను మట్టికోటసమీపమున నొక చిన్నగుట్టవంటి గండశైలము కలదు కదా! రాజులు క్రీడాశైలముగా చేసికొన్న గండశిలకంటె నిది మిక్కిలి చిన్నది. అందుచే నిది చేరువకు బోయిన గాని ఉన్నట్లే కనిపింపదు. ఈ గండశిల నంటి జైనసిద్ధుల వసతి యొకటి పెద్దది గలదు. ఆ శిల నానుకొని దానిచుట్టును ఎన్నియో చిన్న చిన్న గదులు గల మందిరములు నిర్మింపబడినవి. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క జైనశ్రావకుడు వాసము చేయుచు నందు తపస్సు చేసికొనుచుండును.

అర్హత్వసిద్ధి నధిగమించుట జైనులలో నుత్తమోత్తమసిద్ధి. వారును రెండువిధములు. అందు మొదటివారు తీర్థంకరులు. అట్టివారింతవరకు ఇరువదినలుగురు మాత్రమే అవతరించిరి. జైనధర్మము క్షీణప్రాయమైనప్పుడెల్ల అట్టివారు దాని నుద్ధరించి చతుర్విధ మగు జైనసంఘమును స్థాపింతురు. ఆ తీర్థంకరులలో ప్రథముడు ఋషభనాథుడు. వారిని నాథశబ్దాంతముగా స్మరించుటయు కలదు. ఆ ప్రథమతీర్థంకరుని నందుచే ఆదినాథు డని వ్యవహరించుటయు జైనసంప్రదాయము. ఇరువదినాల్గవ తీర్థంకరుడు వర్ధమానమహావీరుడు. రెండవవిధమగువారిని కేవలు లందురు. వీరును తీర్థంకరులవలెనే ఆత్మకు గల నాలుగు కషాయములను నిర్జించి కర్మబంధమును త్రెంచి వేసికొని ఆత్మను స్వస్వరూపమును బొందించుట యను మోక్షమును పొందినవారే. దగ్ధమైన బీజమునుండి ఎన్నడైన మొలక యంకురించునా? వారు కర్మబీజము దగ్ధము చేసినవారు. అందుచే వారికి భవాంకురము పుట్టదు.

ఇట్లు కర్మక్షయము చేయుటచేతనే అట్టివా డీశ్వరు డగును. అంతియే కాని నిత్యముక్తుడును సనాతనుడును నగు వేరొక యీశ్వరు డున్నా డని వా రంగీకరింపరు.

'కేవలు' డగుటకు రెండుమార్గము లున్నవి. అందులో నొకటి దగ్గర దారియే కాని బహుకష్టసాధ్య మైనది. ఇది జైనసన్యాసు లవలంబించు సాధుచరిత్రము. రెండవమార్గము సులభమైనదే కాని దానివలన బహుకాలమునకు గాని సిద్ధి లభింపదు. ఇది సామాన్యు లనుష్ఠించు గృహస్థధర్మము.

ఇప్పటికి సంవత్సరమునుండియు ఆ జైనవసతిలో నొక మూల నున్న గదిలో ఒక సాధువు వాసము చేయుచుండెనట. అతడిన్ని నాళ్లును తలుపులు తీయకుండు డని నియమము చేసి ఆ గదిలోనే ఉండెనట. ఇన్నినాళ్లును అతడు బయటికి వచ్చియుండుట గాని లోపలి కేగుచుండుట గాని ఆ వసతిలో నెవ్వరును ఎరిగియుండలేదట. ఈ సంవత్సరకాలమునుండియు ఆ గదిద్వారము ఎల్లప్పుడు లోపలను బయటను బంధింపబడియే యుండును. ఒకొక్కమారు అందులోనుండి ఘంటానాదము వినవచ్చును. మరి యొకతర దివ్యగాంధర్వము వినిపించును. ఇక కొన్ని సమయములలో అంతర్గర్భిత మైన ప్రణవనాదమె యందుండి వెలువడుచుండును. ఆ సాధువును సేవించుటకై ఇంద్రాదులును యక్షగంధర్వులును వచ్చుచుందు రని చెప్పుకొందురు. ఆ వసతిలోని పరిచారకులు తామా గదిలోనుండి వింత సంభాషణలు పలుమారు వింటిమని చెప్పుదురు. జైనశ్రావకులు పలువురు అర్ధరాత్రపూజ కావింతురు. అట్టి పూజ తాము చేయుచుండగా కొన్ని చీకటిరాత్రులందు ఆ గది దేదీప్యమానమగు నక్షత్రరూపము పొంది యాకాశవీధిలోని కెగిరిపోయి కనరాకుండుట కన్నులార తాము చూచితి మని యక్కడి శ్రమణులు చెప్పుచుందురు. అట్లు చెప్పుచు వారే తాము ప్రత్యక్షముగా చూచిన యీ యమానుషవిశేషము ఎట్లు సాధ్య మయ్యె నని పరస్పరము తర్కించుకొందురు. దీర్ఘముగా వారు సమస్తవిషయములు సమన్వయించి యీ గదిలో నున్న సాధువు పంచభూతములను తన వశము చేసికొని వాని కతీతుడైన యొక మహాసిద్ధపురుషు డని నిశ్చయము చేసిరి.

ఈ మహామహుని మహత్త్వవిశేషములు దినమున కొక క్రొత్తరీతిగా ఆశ్వయుజమాసకృష్ణపక్షమునుండి ఏకశిలానగరము నెల్లెడల

---

1. అర్హతులకు నమస్కారము. సిద్ధులకు నమస్కారము. ఆచార్యులకు నమస్కారము. ఉపాధ్యాయులకు నమస్కారము. లోకమునందు సర్వసాధువులకు నమస్కారము!

వ్యాపించుచుండెను. జనసమూహమున నా సిద్ధుని దర్శింపవలెనను నుత్కంఠ విపరీత మయ్యెను. సిద్ధుని దర్శించి ఏమిచేయుదురో వారాలోచింపరు. అదియొక వెర్రి. వర్ణమతవివక్షత లేకుండ పౌరులు ఆ సిద్ధుని దర్శనమునకై ఆ వసతికి మూగసాగిరి. కాని ఎప్పుడును ఆ సిద్ధు డుండు గదితలుపులు వేసియేయుండును. దాని సమీపమునకైనను ఎవ్వరిని రానీయరు. కాని ఎట్టి సాధనము లేకుండ మహాత్ముల దర్శనము చేసినంతమాత్రముననే కృతార్థత నొందనుంకించు జనసమూహములను ధన్యులు కాకుండ ఎవ రడ్డగలరు? ఆ సిద్ధుని చూడకపోయినను ఆ సిద్ధుని గదిసమీపమునకైన బోయియున్నను దూరమునుండియే వా రాత డుండు గది దర్శించియే లోపలనున్న మహాసిద్ధునికి నమస్కరించి చెంపలు వేసికొని కృతార్థులై వెడలి పోవుచుందురు. మరికొందరికి ఆ గదిలోనుండి ప్రణవనాదము వినిపించును. కొందరి కా గోడలలోపల దివ్యతేజస్సు స్పష్టముగా భాసించును. అట్టివారు ప్రక్కనున్నవారితో 'అదుగో, దివ్యకాంతి కనబడుట లేదా, ఎంత బాగున్నది!' యందురు. ఆ ప్రక్కనున్న వారికి అట్టి కాంతి యేమియు గోచరింపదు. వారికి వట్టి గోడలే కనిపించును. అందుచే వారు తమ పాపిష్ఠజన్మములకు తమ్ము నిందించుకొందురు. అట్లు తలంచుచుండగనే వారిలో నొకడు 'ఆ గదిలో గాజుగుప్పెలోని దీపమువలెనే ఒకానొక హిమావృతకాంతి కనిపించుచున్న'దనును. మరి యొకడు కన్నులు మూసికొనుచు, 'మంచు కప్పిన కాంతి యేమి, కోటిసూర్యుల కాంతి యదిగో, చూడలేకున్నాను. కనులు మిరుమిట్లుగొలుపుచున్నవి!' అని పలుకును. వేరొకని కందులో మహాగ్నియే మండుచున్నట్లు కనిపించును. ఇంకొకరి కన్నులకంటె చెవులు సూక్ష్మమైనవి. అందుచే వానికి సంగీతము వినిపించును. ఒకరికి దివ్యధూపముల వాసన ఘ్రాణముల ప్రవేశించును. మరియొకరు, 'ఏమి యీ యామోదము! ఈ లోకములో ఏ పూవు కిట్టి సుగంధము కలదు?' అని ప్రశ్నింతురు. ఇంకొకడు 'అయ్యో, అదిగో పులి!' అని పెద్దగా నార్చి మూర్ఛిల్లును. 'పాపమీతని కెట్టి పాపిష్ఠియూహ వచ్చినదో, శిక్ష పొందినాడు!' అని ప్రక్కవా రందురు. ఆ పాపిష్ఠిమనుష్యుని జూచినందున తమ పుణ్యపురుషత్వము వారి కతిశయించును. వా రా మూర్ఛితునిపై జాలి నొంది యతని చెవులలో 'ణమో అరిహంతాణం...' ఇత్యాది పంచనమస్కార ముచ్చరించి యతనిని తేర్చి నెమ్మదిగా నావలకు తీసికొనిపోవుదురు. ఇట్లు భయమును భక్తియు జనసమూహములో నా సిద్ధునియెడ దినదినప్రవర్ధమానము కాజొచ్చెను.

సిద్ధుని జూచు నవకాశము చిక్కనందున భక్తుల కా గదిపై గౌరవము ప్రారంభించెను. ముందు కొందరు ఆ గదిముందు దానికి శీతాతపములు తగులకుండ వెదురుతడకలతో ఆచ్ఛాదనము నిర్మింపజేసిరి. ఆ పిమ్మట రెండుమూడుదినములలో నచ్చటికి చూడవచ్చిన ధనవంతు డది చూచి వెంటనే శిల్పుల నియమించి దృఢ మగు శిలాప్రాకారమును మండపమును నిర్మింపజేసెను. మరియొకడు దాని ప్రక్కనే యారామ మొకటి వేయించెను. భక్తుల భక్తి యతిశయించినకొలదియు నా గదిలో నున్న సిద్ధమూర్తిని దర్శించు నవకాశము దూరదూరముగుచుండెను.

ఇట్లుండ జైనసంవత్సరాదిప్రాంతమున ఆ సిద్ధమూర్తి భక్తులకు దర్శన మీయనున్నా డని యొక వార్త నగరమంతట వ్యాపించెను. దీపావళిఅమావాస్యనాడు వసతిలో మహోత్సవము జరుగును. పద్మాక్షీయాలయమున హనుమకొండలో గొప్ప పూజలు జరుగును. ఆనాడు ఈ వసతినుండి యావల రెండు క్రోశముల దూరమున నున్న పద్మాక్షీయాలయమువరకు జైనభక్తులు బారులు తీరి పోవుచుండిరి. జైనులకు ఉష్ణీషబంధము ఒక పవిత్ర మగు సంస్కారమువంటిది. ఉష్ణీషబంధము చేసినపిమ్మట కుమారునికి గూడ నింటిలో పూర్వము లేని స్థాన మేర్పడును. నలుగురిలో నట్టివానికి గౌరవమును ఉండును. అందుచే వారికి ఉష్ణీషధారణము నియతము. వారును రంగురంగుల వస్త్రములు పట్టువి, నూలువి, జరీవి, అద్దకములవి తలల మనోహరాకారముల ధరించి బారులు బారులుగా రాకపోకలు చేయుచుండ ఓరుగల్లునుండి హనుమకొండవరకు ఒక్కసారిగా ఊర్ధ్వలోకముల నుండి సాధుపురుషులు పద్మాక్షీదేవిని సేవించుటకును సిద్ధుని దర్శించుటకును దిగివచ్చిరా యనిపించుచుండెను.

ఆనాడు సిద్ధదర్శన మగు నని పౌరజానపదులలో నొక సంచలన ముదయించెను. ఆత డుండు గదిసమీపమున గల శిలాతలమున ధ్యానమగ్నుడై దర్శన మిచ్చు ననియు వార్త ప్రాకెను. జన మానాడు విశేషముగా వసతిముందు కూడిరి. కాని యానాడు వారి కాతనిదర్శనము కాలేదు. కాని వారి కాశ పోలేదు. పాడ్యమి, విదియ, తదియ, చవితి—నాళ్ల నర్ధరాత్రమువరకు భక్తు లాభాగ్యమునకు వేచియుండిరి. కాని ఆ మహామహుని దర్శనము వారికి ప్రాప్తింపలేదు.

అట్లు దినదినము నిరాశాహతులై వెనుదిరిగి భక్తులు వెడలుచుండిరి. వారి యుత్సాహ మెన్నాళ్లు నిలువగలదు? పంచమినాడు సాయంత్రము వచ్చినవారి జనసంఖ్య తగ్గిపోయినది. ఆ వచ్చినవారును తలలు పైకెత్తి ఆ గండశిలాతలమును చూచి చూచి హతాశులై అందులో పలువురు తమ యిండ్లకు వెళ్లిపోయిరి. దూరమున ఉడువీథిని శిఖరావలంబి యగు అంధ్రరాజు మోసాలపై గడియారమున నుండి పన్నెండుమారులు ఘంటానాదము మ్రోగి అస్పష్టముగా విననయ్యెను.

అప్పు డాకస్మికముగా నా గండశిలాతలముపై ఒకమూర్తి కనపడినట్లయ్యెను. ఏదో యొక మూర్తి యేమి? యోగసమాధినిష్ఠుడగు నా మహాయోగిమూర్తియే ప్రత్యక్ష మయ్యెను. ఎన్నాళ్లకు భక్తుల కోరిక సిద్ధించినది. ఆ దర్శనభాగ్యమునకు నోచుకొన్న యా కొలదిమందిలోనుండియే హర్షనాదము లుప్పతిల్లెను. కొందరు ఆ సిద్ధునికి మ్రొక్కవారైరి. కొందరు 'రక్షించు తండ్రీ, రక్షించు' అనువారును, 'ధన్యులము ధన్యులము!' అనుకొనువారును—ఇట్లు వివిధ భాష లాడుచు కోలాహలము చేయసాగిరి. కొందరు ధూపము లర్పించిరి. దీపదర్శనము జైనాచారము కాకపోయినను ఆ వచ్చినవారిలో కొందరు దీపములను సమర్పించిరి. కొందరు పుష్పాంజలు లర్పించిరి కొందరు టెంకాయలు కొట్టిరి. కొందరు పచ్చకర్పూరముతో మంగళారార్తికము లిచ్చిరి. కొందరు పాటలు పాడిరి. కొందరు భజనలు సాగించిరి. కొందరు జయజయధ్వానము లొనర్చిరి. కొందరు బహుపరాకులు ప్రారంభించిరి.

అంతలో నా సిద్ధుడు వారి నందర నాశీర్వదించుచున్నట్లు తన దక్షిణహస్తము నెత్తెను. దానితో నక్కడ నున్న కొలదిజనమును పొంగిపోయి పరవశులైరి.

వా రట్లు చూచుచునే యుండిరి. వారు చూచుచుండగనే అంతలో నా సిద్ధు డంతర్హితు డయ్యెను!

ఇత డెట్లు శిలపైకి వచ్చెను? మరల ఎట్లు పోయెను? ఎక్కడ

(29-వ పేజీ చూడుడు)

నాటిక :

గొడుగు

ఒకడు-ఏంవర్షం అబ్బ- ఛ! ఛ!- కావలసినప్పుడు చూడు చినుకుపడదు.

రెండోవాడు:—కావలసినప్పుడు ఒస్తే యింకేం-(శేషయ్యతో)యీ వానలు పంటలకి చెడ్డదా, మంచిదా?

శేషయ్య:—(చుట్ట నోట్లోంచి తీసి కొంచెం జరిగి ఉమ్మేశాడు) ఏమ్మంచి, నెలరోజులకింద గనక ఒచ్చిఉండును అబ్బే లాభం లేదు పురుగుపట్టుద్ది.

మొదటివాడు- యిట్టాఒచ్చిందేం ఉన్నట్టుండి- అబ్బో ఆరున్నరయిందే. బెజవాడ బండి ఎన్నింటికి?

రెండోవాడు:—యిప్పుడెక్కడ బెజవాడ బండి- తొమ్మిదింటికి గాని లేదు.

(రోడ్డు మీద ఎవరో జారిపడ్డారు. సూరమ్మ పకాపకా నవ్వుతుంది. చాలా మంది ముఖం చిట్లించారు. శేషయ్య మాత్రం 'పాపం' అంటాడు. అందరూ అటే చూస్తున్నారు. పడ్డవాడు సిగ్గుపడి తొందరగా నడవటం మొదలుపెట్టాడు. సూరమ్మకి నవ్వాగటంలేదు).

శేషయ్య:—ఏయ్ పిల్లోవ్! ఏందది? కాస్త తమాయించు.

(సూరమ్మ 'చటు'న ఆగి శేషయ్యవంక ఆశ్చర్యంగా చూసి పెదవులు బిగించి ఒక వికృతమైన కుటుకుతో మొహం తిప్పుకుంది)

శేషయ్య:—తిండికి లేకపోయినాపావలా జెట్టి సినిమా చూసేది. ఈ తిప్పళ్లు నేర్చుకునేది.

(మొదటివాడూ రెండవవాడూ నవ్వుతారు. ఈ నవ్వును విని నలుగురైదుగురు వెనక్కి తిరుగుతారు. సూరమ్మ వానవంక చూస్తోంది)

రెండో:—గొడుగు తెచ్చుకోవటంకూడ మర్చిపోయినాను, అవసర మొచ్చినపుడు ఏదీ జ్ఞాపకం ఉండదు.

శేషయ్య:—ఏంగొడుగులు? కొంటే రెండురోజులుండవు. కొనబోతే పదులు, పదిహేన్లు. ఏంకాలం!

(ఒకాయన రోడ్డుమీద పోతున్న గొడుగున్న ఆయన్ని పిలచాడు. ఆయన ఒచ్చాడు. యిద్దరూ కలసి వెళ్లిపోయినారు. వరాండాలో ముందు చికాగ్గా నిల్చున్న రామలింగం చికాగ్గా వెనక్కి వచ్చాడు. వీళ్లదగ్గర నిల్చుని మొహం రోడ్డువైపు తిప్పి మాటలు వింటున్నాడు. అతనిచేతులో గొడుగు ఉంది. కూచున్నవాళ్లందరూ అతని గొడుగువంకే చూస్తున్నారు)

రెండో:—మీది బెజవాడేనా?

మొదటి:—కాదు తెనాలిదగ్గర. యిప్పటికే ఆలస్యమైంది. యిప్పటికి వారంరోజులకింద కొంప చేరుకోవాల్సింది.

(యిద్దరు-ఒకాయన చేతులూ, యింకో ఆయన తుండుగుడ్డా తలకడ్డం పెట్టుకుని వానలోకి పలుదిత్తారు)

మొదటి:—[రోడ్డు వంక చూస్తూ సగం లేచి] ఏయ్! రిక్షా.

(రిక్షావాడు చూసికూడా పలక్కుండా పోతున్నాడు.)

****

శ్రీ అహోబలరావు

****

శేషయ్య:—యిప్పుడేనా రిక్షావాళ్లు పలికేది? యిప్పుడాబండి కాళీగా ఉంటంటావా? ఉన్నాగాని అర్ధరూపాయికి తక్కువ తీసుకోడు.

రెండో:—దాని దుంపతెగిన అర్ధరూపాయి.

(శేషయ్య రెండోవాడివంక నిదానించి చూస్తున్నాడు. రోడ్డుమీదనుంచి ఒకామె పరిగెత్తుకుంటూ లోపలికి ఒచ్చింది. వయస్సు చెప్పటం కష్టం. పాతిక్కి పద్దెనిమిదికీ మధ్య ఉండొచ్చు. రాకటం రావటం మొహం తుడుచుకోడం మొదలుపెట్టింది)

కొత్తామె:—అబ్బ-ఏం వర్షం! అసలు బయలుదేరేటప్పుడే అనుకున్నాను,

రెండో—మాస్తుంటే యిప్పుడల్లా తగ్గేట్టులేదు.

(కొత్తామె తేలుకుట్టినట్లు ఉలిక్కిపడి వెనక్కి చూసింది. రెండోవాడు యికిలిస్తున్నాడు. ఆమె నిస్పృహగా మొహం తిప్పుకుంది. మూలన ఉన్న సూరమ్మఒచ్చి కొత్తామెపక్కన నిల్చుంది. కొత్తామె వానవంక చూస్తోంది)

సూరమ్మ:—మన యిల్లు ఎక్కడ అమ్మగారు?

కొత్తా:—(వర్షంవంకే చూస్తో) కొత్తపేట.

సూరమ్మ-అబ్బో, చాలాదూరం పోవాలే.

కొత్తామె- (రెండునిమిషాలు మాట్లాడకుండా ఊరుకుంటుంది) బండి దొరికితే బాగుండు. గొడుగ్గూడా మర్చిపోయాను. (మొహం చిట్లిస్తుంది)

రెండో:—యీవూళ్లో సినిమా ఏమిటి?

మొదటి:—ఏలూర్లో డ్రామాటగా?

రెండో: —ఏమో! ఏం డ్రామా? సక్కుబాయేనా?

సూ:—కొత్తపేటలో ఎక్కడమ్మగారు మనయిల్లు?

(కొత్తామే మాట్లాడదు)

యింకా నలుగురైదుగురు అట్లాగే వర్షంలో, పడిపోయినారు. రామలింగం వరండా ముందుభాగానికి వచ్చి సూరమ్మకు కొంచెం దూరంలో నిలబడి రోడ్డు వంక చూస్తున్నాడు. వరండా దాదాపు కాళీ అయింది)

సూ:—మన యిల్లు ఎక్కడ బాబయ్యా?

రామలింగం--యిక్కడే శివాలయందగ్గర.

(కొత్తామె రామలింగంవంక తేరిపార చూస్తుంది)

సూరమ్మ:—మాబాబు యింటిదగ్గర చూస్తుంటాడు. మీదగ్గర గొడుగుందికదా పోరేం బాబయ్యా?

రామలింగం:—యిదా-యిది నాదికాదు.

(సూరమ్మా, కొత్తామే ఉత్తరీయం పూర్తిగా కప్పుకుని, మూల కూచున్న శేషయ్యవంక చూస్తారు అతనిదేమో అని)

కొ:—శివాలయందగ్గర ఎక్కడండీ మీ యిల్లు?

(రామలింగం ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తాడు)

రా:—నాగభూషణంగారని అక్కడున్నారండి, వాళ్లింట్లో.

(85 వ పేజీ చూడుడు)

[కథానిక]

కార్యకారణాలు

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

ఇదివరకు ఏడెనిమిది యేళ్ళాయి ఈ ఫోటోగ్రాఫరువృత్తిలో ఉన్నా, నాలో చిన్నపిల్లల ఫోటో లంటే అపరిమితమయిన ఉత్సాహం కలగడానికి ఆ రోజే మొదలు.

ఆనాడయినా, సరోజను మొట్టమొదట చూడ్డంతో నాకంత మంచి అభిప్రాయం ఏర్పడలేదు. వాళ్ళ నాన్నగారి చెయ్యిపట్టుకొని నదురూ బెదురూ లేకుండా వచ్చి నువ్వేనా నా ఫోటో తీసేది అన్నట్టుగా నా మొగంలోకి చూడ్డంలో కొంత ప్రత్యేకత కనబడినమాట వాస్తవమే. కాని, నాలో చాలా కొత్తదనాన్ని తీసుకొని వచ్చిన పరిస్థితి వేరు. అంతా సర్దుబాటుచేసి, స్టూలుమీద కూర్చోబెట్టి, 'మరేం భయం లేదమ్మా, మీ నాన్నగారుకూడా ఇక్కడే ఉంటారు' అన్నాను, సామాన్యంగా చిన్నపిల్లలకి కలిగే బెదురును పోగొట్టడానికి నా వృత్తిధర్మంప్రకారం అన్నట్లుగా. 'బయం లేదే. ఫోటో తీయించుకొందికి ఏం భయం?' అంది. కేవలం ఆ మాటను పట్టుకొని అందులో ఏమయినా ప్రత్యేకత ఉందా అని చర్చిస్తే నేను నిలబడలేకపోవచ్చును. కాని, ఆ చిన్నిమాటలే నాలో అదివరకెన్నడూ కనబడని నూత్నభవనాలకు ద్వారాలు తెరిచేయి. అని అనడంలో ఏమీ విశేషంలేదు. నా అతిఉత్సాహంతో ఫోటోను గాని చెడగొట్టను కదా అన్న అనుమానం కూడా కలిగింది ఆ సమయంలో. "ఏదమ్మా, నావంక చూడు, నిజమే, నీకేం భయం లేదు. ఒక్కక్షణమే, ఏదీ చిన్ననవ్వు"— అన్నాను. కేవలం ఆ నవ్వును వర్ణించడంకోసమయినా నేను కవిత్వం నేర్చుకొని ఉండవలసింది. శరత్కాలంలో ప్రశాంతంగా స్వచ్ఛంగా ప్రవహించే స్రవంతిలో ప్రతిబింబించే చంద్రబింబపు కలకలకంటె మనోజ్ఞంగా స్పృహణీయంగాఉంది ఆనవ్వు. మాటల్లో చెప్పడం ఆరంభించేసరికల్లా ఒక్కొక్కమాటతో నా మనస్సులోని చిత్రానికి ఒక్కొక్క మైలు దూరంగా వెళ్ళిపోతున్నట్టనిపిస్తుంది. అదివరకు సౌందర్యమీమాంసతో చాలా తపనపడిన మనిషినే నేను. అందులోనూ నా వృత్తిధర్మంకూడా అటువంటిదే కదా—ప్రకృతిలో మామూలుగా కంటికి రమ్యంగా కనబడే దృశ్యాలనూ, ఛాయాచిత్రాలలో నిస్సమానంగా కనబడే దృశ్యాలనూ, అన్ని కాలాలలోను ప్రఖ్యాతులయిన చిత్రకారుల కల్పనాశక్తినీ, విభిన్నభంగిమములలో మానవశరీరంలో ద్యోతమానమయే సౌందర్యప్రభనూ అత్యంతమూ ఆరాధించినవాడినే. అయితే అందుకు నా ఒంటరి బ్రహ్మచారిజీవితము కూడా కొంత తోడుపడిందనుకోండి. వచ్చిన డబ్బులో, నా కొద్దిపాటి అవసరాలకూ సరిబడగా మిగిలినది యావత్తూ సౌందర్యాన్వేషణకే వినియోగం చేసేననడం అతిశయోక్తి కాదు.

ఈ గొడవలో పడి అసలుసూత్రం విడిచిపెట్టేను. ఆ అమ్మాయిఫోటోతీయడం అయిపోయింది. కాని నాకు ఏమిటో ఎన్నాళ్ళనుండో కలిసిఉన్న వ్యక్తికి దూరంగా వెళ్ళిపోతున్నట్టనిపించింది. నా మటుకు నాకే ఇందులో సబబు కనిపించదు. 'ఇంకొక్క రెండునిమిషాలు ఆగగలరా, మరొక ఫోటో తీసుకొంటాను'- అన్నాను వాళ్ళ నాన్నగారితో. ఆయన 'అలాగే, ఉంటాముగాని, ఏం, ఇది చెడినట్టు మీ కనుమానంగా ఉందా?' అన్నారు.—"లేదండి, నాకే సరదాగా ఉంది, మా ఆల్బమేలో మంచి ఫోటో లుండడం మాకు లాభమేగాని, నష్టం లేదండి. అయితే ఈమారు అమ్మాయిఅలంకరణం కొంచెం మార్పుచేస్తాను. మీ కేం అభ్యంతరం లేదుకదా?' అన్నాను.

వీలయినంతగా ఫోటోకి అని చేసిన ప్రయత్నం కనబడకుండా చేసి నేను ఫోటో తియ్యడం పూర్తిచేసేసరికల్లా వచ్చేడు మా నౌకరు కుట్టివాడు, నేను చెప్పిన చాక్లెట్ల పేకెట్టు పట్టుకొని. నేను తీసుకో అమ్మా అంటే వద్దనకుండా, తీసుకోకుండా వాళ్ళ నాన్నగారి మొగంవంక చూసి ఊరుకొంది. ఆయన "ఎందుకండీ—అనవసరంగా తెప్పించేరు. నేను డబ్బిచ్చేస్తాను" అని నాతో అని వెంటనే వాళ్ళమ్మాయితో "తీసుకోఅమ్మా, ఇస్తూ ఉంటే వద్దనకూడదు" అన్నారు.

సరోజ మాట్లాడకుండా తీసుకొని నా కళ్ళలోకి పరీక్షగా చూసింది. ఆ చూపులో వెనకటి మందహాసస్ఫురణ లేదు. కాని, ఆ ఒక్కచూపులోనే, ఏదో నన్ను పూర్తిగా అర్థంచేసుకోవాలన్న ప్రయత్నం నిండినిబిడీకృతమయి ఉన్నట్టు కనిపించింది. ఆనాడూ అమర్నాడూ తక్కిన ఏపని చెయ్యడానికీ మనస్కరించలేదు.

అమర్నాడుసాయంత్రం వాళ్ళింకా ఎప్పటికీ రారేమా అని నేనే తొందరపడ్డాను. చివరికి ఎల్లా అయితే నేం వచ్చేడు. నేను అనుమానించినట్లుగా ఆయన ఒక్కడే కాకుండా సరోజనుకూడా తీసుకొనివచ్చేరు వాళ్ళనాన్నగారు. ఆయన ఫోటోలు చూసి, 'నిజమే మీరు రెండవఫోటో తియ్యడం మంచి పనే అయింది. దానికంటె ఇదే చాలా బాగుంది' అన్నారు.

"మొదటిది మాత్రం బాగులేదాండి?" అన్నాను నేను.

"బాగులేదని కాదులెండి, గాని, అంతకంటె కూడా ఏదయినా చూడండి, మీరు ఆర్టిస్టులు, అంచేత మీకు ఏవిధంగా ఫోటో తీయించుకొంటే బాగుంటుందో తెలుస్తుంది' అని కొంచెం ఆగి, మరి రెండు మూడు నెలలు పోయేక మీరు మా కుటుంబం అంతటికీ ఫోటో తియ్యాలి సుమండీ' అన్నారు.



'అలాగే, తప్పకుండాను. అంతకంటె కావలసిందేముంది అన్నాను నేను. ఆయన రెండవ ఫోటోకి కూడా డబ్బిస్తూ ఉంటే నేను పుచ్చుకోలేకపోయేను.

'రెండవది మీరు తియ్యమనలేదే, అది కేవలం నేను నా సరదా కోసం తీసుకొన్నది; మీ అమ్మాయి ఫోటో గనక మీకు రెండు కాపీలు ఇస్తున్నాను. అంతే. దానికి మీరు డబ్బివ్వనక్కర్లేదు. మొదటిదానికిస్తే చాల్నన్నాను. ఆయన కాదన్నారుగాని చివరికి నామాటే నెగ్గిందిలెండి.


అప్పటినుండి నాకూ ఆ అమ్మాయికీ నేస్తం ఆరంభం అయింది. మా స్టూడియోకి దగ్గర్లోనే వాళ్ళ యిల్లు ఉండడంవల్ల రోజూ ఉదయం సాయంత్రం చాలా భాగం మా స్టూడియోలోనే ఉంటూ ఉండేది. ఒక్కరోజు ఏ కారణంచేత నయినా, ఆ అమ్మాయి రావడం ఆలస్యం అయితే, నాకు ఏ పనీ తోచేది కాదు. ఇక సరోజ సంగతీ అంతే. ఎప్పుడయినా నేను ఏవో గ్రూఫ్ ఫోటోలూ అవీ తియ్యడానికి వెళ్లినప్పుడు 'మళ్ళా వేగం వస్తావుకదూ' అనేది. రెండుమూడుమార్లు నాతో కూడా తీసుకొని వెళ్లేను అటువంటి సందర్భాలలో.

కేవలం ఆ అమ్మాయికోసమే నేను ఎన్నెన్నో చిన్నపిల్లలకి యిష్టపడే కథలూ ఆటలూ నేర్చుకొన్నాను. అదివరకు నా చిన్నతనంలో కూడా అట్టే ఇష్టపడని పిప్పర్‌మెంట్లూ చాకులెట్లూ ఆ అమ్మాయితో స్నేహం కలిసిన తరవాత ఎంతో రుచిగా ఉండేవి. ఆ మూడు నాలుగు నెలల్లోను ఒక యాభైకి పైగా ఆ అమ్మాయి ఫోటోలు తీసి ఉంటాను. మా స్టూడియో అలంకరణానికి అదివరకు ఉపయోగపడిన చాలా ఫోటోల స్థానంలో ఆ అమ్మాయి ఫోటోలు నెలకొన్నాయి. స్టూడియోకి వచ్చేవాళ్లందరూ సరోజను మా అమ్మాయనే అనుకొనేవారు. నిజం చెప్పినా ఒకంతట నమ్మే వారు కారు.

మా స్నేహం క్రమంగా చిన్న చిన్న హాస్యాలు చేసుకొనే అంతటి స్థితికి వచ్చింది. ఉఁహుఁ రోజూ నీ ఫోటోయేనా? ఇవాళ నా ఫోటో నువ్వు తీస్తేనేగాని వీల్లేదనేవాణ్ణి. 'మరయితే కదలకుండా కూర్చో' అని కెమేరా వెనకాతల కుర్చీ వేయించుకొని, నిలబడి, దిగివచ్చి, నన్ను సరిగా ఫోటో తీయించుకొందికన్నట్లుగా సర్ది కూర్చోబెట్టి, ఉఁహుఁ కొంచెం పక్కకి తిరగండి, సరిగా కెమేరా వంక చూడండి, నేను రడీ అంటాను. అని వెళ్ళి గుడ్డ కప్పుకొని చూసి, మళ్లీ తిరిగివచ్చి సర్ది, చివ్వరికి రడీ అని వైరు రిలీజు నొక్కేది. అక్కడితో ఆ ఆట సరి-నిజంగా ఫోటో తియ్యడానికి ప్లేటుండాలనీ, తరవాత కూడా చాలా తంతుందనీ సరోజకి తెలియదా అంటే తెలియక కాదు, మరి రోజూ చూస్తున్నదే కదూ. అయినా ఆటకేమిటి, ఎక్కడికక్కడే నిజమూ కల్పనా కూడాను,

(30-వ పేజీ చూడుడు)

ముమ్మిడివరం బాలయోగి



హరిజన బాలుడు సుబ్బారావు

1946 లో బాలయోగిగా మొదటిరూపం.

ముమ్మిడివరంలో యోగనిష్ఠలో ఉన్న బాలయోగి శివరాత్రిపండుగనాడు సూర్యోదయాత్పూర్వమూ, సూర్యాస్తమయానంతరమూ ప్రజలకు దర్శన మిచ్చారు.

సర్వవిధాహారాలనూ త్యజించి కేవలం వాయుభక్షకులై వీరు తపస్సు చేస్తున్నారట. వీరు అమలాపురం తాలూకా ముమ్మిడివరం హరిజనవాడలో హరిజనకులంలో పుట్టారు. పన్నెండవయేట యోగనిష్ఠలో నిమగ్నులైనారు. వీరికోసం ముమ్మిడివరంలో ఒక కుటీరం నిర్మించబడింది. బాలయోగి ఈ కుటీరంలో ఏకాంతంగా నిష్ఠ నిర్వహించుకుంటున్నారు. ఎవరినీ చూడరు. దర్శనమివ్వరు. ఆశ్రమద్వారాలు నిత్యం బంధితాలై ఉంటవి. వారి అభీష్టం లేనిదే ఎంత గొప్ప ప్రయత్నించినా ద్వారకవాటాలు తెరుచుకోవట. వీరి నిష్ఠాక్రమాన్ని, మహాత్మ్యసంపదను తూర్పుగోదావరిజిల్లా కలెక్టరు మొదలైన ప్రభుత్వోద్యోగులు స్వయంగా చూచి ఆశ్చర్యంగా వీరిలో ఏదో మహాత్మ్యం ఉన్నదని భావిస్తున్నారు.


నిత్యమూ బాలయోగిదర్శనంకోసం ముమ్మిడివరానికి ప్రజలు వేలాదిగా వస్తున్నారు. అయితే శ్రీవారి నిరాహారాది కార్యాల ద్వారా వీరు తమ మహాత్మ్యాన్ని నిరూపించినట్లు ఇప్పటివరకు వినలేదు. వీరి దర్శన భాగ్యమే అలభ్యంగా ఉన్నదట.

శివరాత్రినాడు దర్శనమిస్తారని తెలిసి ఆంధ్రదేశంలో అనేకప్రాంతాలనుంచి జనులు సుమారు అయిదులక్షలమంది వచ్చారు. 15 వ తేదీ రాత్రి, అనగా శివరాత్రిపండుగకు ముందురాత్రి సరిగా 12 గంటలకు ఆశ్రమద్వారం వద్ద [illegible] అయిందట.


తూర్పుగోదావరిజిల్లా కలెక్టరు డి. బాలసుందరంగారు ఆశ్రమ తలుపు వెలుపలి తాళము తీశారు. కాని తలుపులు తెరుచుకోలేదు. రాత్రి 2 గంటలకు బాలయోగి తండ్రి వచ్చి కలెక్టరుగారిని ఆహ్వానించి తలుపులు తెరచుకొన్నవని విన్నవించారు. కలెక్టరుగారు లోనికి వెళ్లారు. బాలయోగి మాట్లాడలేదు. కాని అన్ని సంగతులు సంజ్ఞాపూర్వకముగ తెలియజేశారు. జనపల్లి [illegible], ఆశ్రమమందు ప్రవేశించినను కట్టించిన [illegible] గారిని [illegible] వలసి వచ్చిన యోగిగారు [illegible] వారిని తీసికొనివచ్చారు. [illegible] ఆఫీసరు గారు [illegible] కూడా అక్కడ ఉన్నారు.

సర్వశాస్త్రములందైన, ప్రత్యేకముగ ఒకటై [illegible] నిర్మించిన మంటపము సూర్యోదయ, సూర్యాస్తమయముల సమయకాలమున నిలుచుటకు అనుకూలముగా లేనికారణమున దర్శనమివ్వడానికి మొదట యోగిగారు నిరాకరించారు. కాని పైముమ్మూర్తుల కోర్కె పైన సూర్యోదయాత్పూర్వము, సూర్యాస్తమయానంతరము దర్శనమివ్వడానికి అంగీకరించారు. పగటివేళ ఆశ్రమంనుంచి దర్శనమివ్వడానికి అభ్యంతరము లేదన్నారు. కాని లక్షలాది ప్రజలను అటువంటి సంకుచితప్రదేశమునకు రానిచ్చుట ప్రమాదకరమని అధికారులు అంగీకరించలేదు.


16-వ తేదీ ఉదయం 4-30 గంటలకు బాలయోగి మంటపముపైకి వెలుపలికి వచ్చి కేవలం ప్రత్యేకముగ తయారు చేయబడిన ఆసనమును అలంకరించారు. 6-30 గంటలకు తిరిగివెళ్లే సమయంలో కూడ



కాలువవద్దనున్న యోగిఆశ్రమానికి, కాలువవడ్డున తండోపతండాలుగా వెళ్తున్న ప్రజలు.



బాలయోగి దర్శనానికై కట్టిన ఎత్తైన మంటపము,



దర్శనార్థమై వేచియున్న ప్రజలు.

[illegible] వస్తున్నారు. విద్యుద్దీపముల ఏర్పాట్లు జరిగాయి.

సాయంకాలం సరిగ్గ 6-50 గంటలకు వేదిక మీదికి వచ్చి దర్శనమిచ్చారు. అంతకు ముందు [illegible] గంటల కాలం నుండి ఒక్కొక్క నిముషము గడచినకొద్దీ మంటపములోపలను [illegible] అభిప్రాయము వెలిబుచ్చినందున కట్టుదిట్టంగా గట్టి ఏర్పాటు గావించారు. [illegible] చూస్తున్న ఒక గంట తర్వాత ఒక నిముషము తలుపులు మూసి తెరిచినంతనే బాలయోగి పద్మాసనంలో కనిపించారు. రెండవ సారి [illegible] ఆసనంలో కన్పించారు. మళ్ళీ రాత్రి 12-30 గంటలవరకు అక్కడ కూర్చుండి దర్శనమిచ్చి తిరిగి ఆశ్రమం గది లోనికి వెళ్లారు.

మొదట వారు వేదిక పైకి వచ్చునప్పుడు ఒక క్రొత్త ధోవతి క్షత్రియునివలెనే [illegible] బిగించి కట్టుకొని వచ్చారు. సాధారణముగ ఒక అంగవస్త్రమును చుట్టుకొని కూర్చున్నారు. తిరిగి వీరు ఆశ్రమం గదిలోకి వెళ్లి వచ్చునప్పుడు ఆ ధోవతి కనపడలేదు. మామూలు అంగవస్త్రధారులయ్యే కనపడ్డారు. ఆ ధోవతి ఎట్లు వచ్చినదీ, ఎట్లు అదృశ్యమయినదీ ఊహాతీతంగా ఉంది. బాలయోగి ట్రస్టువారు తీయించిన ఫోటోలో కూడ ధోవతి అదృశ్యమయి అంగవస్త్రం మాత్రము కనబడుతున్నది. ఇది చాల ఆశ్చర్యం కలిగించింది.

వచ్చిన లక్షలాదిజనుల సౌకర్యముంకు కావలసిన ఏర్పాట్లను [illegible] స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలు చాల [illegible] నిలుచున్నారు. [illegible] వచ్చునప్పుడు [illegible] పైనారు.

శివరాత్రినాడు దర్శనమిచ్చినప్పటి బాలయోగి.



(ఈ ఛాయాచిత్రములు పంపినవారు, శ్రీ [illegible] వీరభద్రరావుగారు, కాకినాడ.)

లోటు బడ్జట్

శ్రీమతి
వేదుల
మీనాక్షీదేవి

ఆఫీసునుండి వచ్చి అరకప్పు కాఫీ త్రాగి పత్రికచేత్తో పట్టుకుని పడక కుర్చీలో వాలాడు గోపాలరావు. పెద్ద అక్షరాలతో మద్రాసు ప్రభుత్వపు 'లోటు బడ్జట్' అని చదివాడు. "ఏమిటీ! స్టేటు ప్రభుత్వానికి కూడా లోటు బడ్జట్టేనా?" అనుకుంటూ చదువుతున్నాడు.

"నాన్నగారూ నాకూ తమ్ముడికీ జీతం కట్టాలి. పుస్తకాలు కొనాలి. 'పూర్ ఫండ్' యివ్వాలిట. మొత్తం లెక్కచూసి యిచ్చెయ్యండి" అన్నాడు మాధవుడు.

గోపాలం వులిక్కిపడ్డాడు. ఎంతసేపటినుండో సీరియస్‌గా పేపరు చదువుతున్నవాడు మళ్లీ ప్రపంచంలో పడ్డాడు.

"ఊఁ? జీతమా? యెప్పుడు కట్టాలి?" అని అడిగాడు.

"ఇవ్వాళ ఆఖరిరోజు. ఇవ్వాళ కట్టకపోతే ఫైనిచ్చుకోవాలి కూడాను" అన్నాడు మాధవుడు.

"సరే" అంటూ గోపాలం వంటింట్లోకి వెళ్ళాడు. పోనీ వెళ్ళినవాడు వెళ్లినట్టూరుకున్నాడా? ఆవిడతో "వచ్చే ఆదాయాన్ని బట్టి ఖర్చుచెయ్యాలి. ఆఖర్చు ఆదాయాన్ని మించకుండా సర్దుకోవాలి. అనవసరమైన ఖర్చులు చెయ్యొద్దు. అవసరమైనవి మానవద్దు" అని అబ్జట్ ధోరణిలోనే యేదో చెబుతున్నాడు.

"నాకదంతా తెలియదు. నావి, పిల్లలవి బట్టలు చిరిగిపోయాయి. ఎప్పటికప్పుడే చెబుదామని మళ్ళీ వెనక్కి తగ్గుతూ వచ్చాను మీకు విసుగ్గా వుంటుందని. ఇప్పుడిక చెప్పక తప్పనిసరి అయింది." అంది.

"అందరి బట్టలూ వొకమారే కొనాలా? రెండుమూడు దఫాలుగా కొనకూడదూ?" అన్నాడు. "ససేమిరా" అంది.

ఔను. ఎప్పుడైనా వొకటే ఖర్చు. ఎటొచ్చీ వొక్కమారు చాలా సొమ్ము షావుకారి చేతిలో పొయ్యడానికి ప్రాణం వొప్పదు. ఆ సొమ్మే నాలుగుమార్లు చిన్న చిన్న మొత్తాలుగా చెల్లించితే బాధగా వుండదు. ఖర్చు వొకటేఅయినా ప్రయాస మాత్రం అవుతుంది నాలుగుమార్లు తిరగడానికి.

గోపాలానికి యేం తోచలేదు. అంత బాధపడ్డం యెందుకూ చేతగానితనంగా! తను యింటికి యజమాని. తన యిష్టం వచ్చినట్టు చెయ్యడానికి తనకి అధికారం వుందే. ఆఫీసులోని అధికారికి క్రిందవాళ్లు గడగడలాడినట్టే గృహయజమానియైన తనకీ యింట్లో వాళ్లు గడగడలాడుతూండవలసిందే. అందుకు కొంత కరుకుదనం వుండాలి. ఎవ్వరికీ లొంగకూడదు. ఖర్మం చాలక లొంగాడో అతని తిప్పలు బ్రహ్మకి తెలియాల్సిందే.

గోపాలం అలాంటి కఠినమైనవాడు కాడు. జన్మతః మెత్తనివాడు చాలా. ఒకళ్ల మనస్సు నొప్పించేవాడుకాడు. తనే బాధపడేవాడు.

పేపరు చదవడము పూర్తిచేసి చల్లగాలికి కుర్చీ వాకిట్లో వేసుకుని కూర్చున్నాడు. పావుగంట అయిందో లేనేలేదో చిన్నపిల్లలిద్దరూ యేడుస్తూ చక్కా వచ్చారు తండ్రి దగ్గిరకి.

"యేం యేడుస్తున్నారు? ఎవరు కొట్టారు?" అన్నాడు గోపాలం.

"వీధిలో యెవరో అబ్బాయి మూడు చక్రాల సైకిలుతొక్కుకుంటూ పోతూంటే వీడు కూడా పోతున్నాడు. అల్లా యెంత దూరమని పోతావురా" అని యింట్లోకి లాక్కొచ్చాను. ఆ కోపంచేత వీడు నా కారు, రైలింజను విమానం నేలమీద వేసి కొట్టాడు గట్టిగా. విరిగిపోయాయి" అని మరీ యేడవడం మొదలు పెట్టాడు ఆ యిద్దరిలోనూ పెద్దవాడు.

గోపాలం ఆ యిద్దరినీ దగ్గిరగా పిలిచి "అయితే యిప్పుడు మీకేం కావాలి?" అని అడిగాడు.


ఇంతకన్న తెలివితక్కువ వుంటుందా? అల్లా అడుగుతారా యెక్కడైనా? అడక్కుండానే "అవి కొను, యివి కొను" అని బాధిస్తూంటారే వీళ్లు. ఇక తనే యేం కావాలి?"అంటే హిరణ్యాక్షవరాలూ కోరకుండా విడిచిపెడతారా? వాళ్లేమి అడిగితే అవి యివ్వడానికి సిద్ధంగావున్నట్టు అడిగిన తను అడినమాట తప్పుతాడా? ఆమాట నిలబెట్టుకుం కోసం హరిశ్చంద్రుడిలాగ, దశరథుడిలాగ బాధలు పడతాడా?

అడిగిందే తడవుగా "మాకు సైకిళ్లు, విమానాలు, ట్రాంలు, కొత్తరైలుయింజన్లు కార్లు కావాలి" అన్నారు యేకగ్రీవంగా. అస్తమానం కొట్టుకుంటూ పస్తాష్టకంపోరుగా వుండే వీళ్లు యేదైనా పనికావలసివచ్చినప్పుడుమాత్రం కావలసినంత సౌభ్రాతృత్వం కనబరుస్తారు. వీళ్ల కనీసపుకోర్కెలు వినేటప్పటికి పార్లమెంటులో అసాధ్యపు కోరికలు సభ్యులు కోరగా విన్న ఆర్థికమంత్రిలా అయిపోయాడు. ఏగిలకలో డమడమాల బళ్లో కొనమంటారనుకున్నాడు. తీరా కొంటానన్నాడు. "పాపం ఆశపడ్డారే కొంటాననీ" అనే బాధ వొకవంక బాధిస్తోంది. రెండవ ప్రక్క కుటుంబ ఆర్థికవ్యవస్థ తారుమారవుతుందేమో ననే బాధ. ఈవిధంగా యెంతో సేపు మధనపడ్డాడు. ఇతని వాలకం చూసి వాళ్లు కొనడేమోనని సందేహించి మరీమరీ అడగడం ప్రారంభించారు. చివరికి 'సరే' అనక తప్పింది కాదు. ఆ మాట చెవినిపడగానే 'యిక కొనకేం చేస్తాడు" అనే ధీమాతో పరిగెత్తుకుపోయారు ఆడుకుందుకు.

"గోపాలరావుగారూ" అంటూ కేకవేసి ఓ కవరు చేతికిచ్చి చక్కాపోయాడు పోస్టువాడు. గోపాలం ఆకవరు విప్పి చదువుకుని మళ్లీ మడిచి జేబులో పెట్టేసుకున్నాడు.

అతనికి అందులో విషయమేమీ కొత్తకాదు. దాదాపు రెండు సంవత్సరా

(40వ పేజీ చూడుడు)



ఇంజను వెనుకనే ఉన్న మొదటితరగతిపెట్టె తుత్తునియలై పోయింది. ప్రయాణీకుల సామానులు చెల్లాచెదరుగా పడిఉన్నాయి. పెట్టెమొదలు చివరలు ఫోటోలో గుర్తులవలన తెలుస్తాయి.


సూళూరుపేట వద్ద కలకత్తామెయిలుకు సంభవించిన ప్రమాదం

[ఛాయాచిత్రాలు]

మార్చి 3వ తేదీ శుక్రవారం రాత్రి చెన్నపట్నంనుంచి బయలుదేరిన కలకత్తా మెయిలుకు సూళూరుపేట స్టేషనుకు దాదాపు మూడుమైళ్లుండగా, రాత్రివేళ 11-25 గంటలకు ప్రమాదం సంభవించింది. రైలుబద్దీలను కలిపిఉంచే ఫిష్‌ప్లేటును ఎవరో లాగివేసినందువల్ల, 50 మైళ్ళ వేగంతో వస్తున్న మెయిలు ఇంజను బద్దీలు తప్పి, విపరీతవేగంతో నేలను కర్రపట్టిలా చొచ్చుకుంటూ పరుగు తీసి రైలుబద్దీలప్రక్క 60 అడుగుల దూరంపోయి తలక్రిందై పడిపోయింది. ఇంజను వెనుకనున్న నాలుగుపెట్టెలు కూడా ఫిష్‌ప్లేటు తొలగించిన చోటు దాటిపోయినవి. ఇంజను పొగగొట్టం విరిగిపోయింది. వెనుకనే ఉన్న మొదటితరగతిపెట్టె పూర్తిగా ముక్కచెక్కలైపోయింది. ఒకపెట్టె తలక్రిందయింది. రెండుపెట్టెలు ఒకదానిలో ఒకటి చొచ్చుకొనిపోయినవి. మిగతావానిలో ఆరుపెట్టెలు పట్టాలు తొలగి ప్రక్కకొరిగినవి. వాటిలో కొన్ని విరిగిపోయినవి. ఆఖరుపెట్టె ఒక్కటే పట్టాలపైన నిలిచిఉంది.


ఈ ప్రమాదంలో మృతిచెందినవారు ఆరుగురు. 1. శ్రీమతి డా॥ జయంతిరత్నమ్మ 2. శ్రీ కొమ్మూరు కామేశ్వరరావు మద్రాసు. 3. శ్రీ సంజీవరావు, మద్రాసు. 4. శ్రీ పి. సర్వేశ్వరరావు, విజయవాడ. 5. శ్రీ పసలపోడమయ్య, తాడేపల్లిగూడెం. 6. మిస్. ఎస్టెల్ మద్రాసు.


[illegible] మొత్తం 98 మంది గాయపడినారు.



నాలుగోపెట్టి అయిదోపెట్టె, ఒకటిప్రక్కగా పడిపోయింది.


రైలుకట్ట ప్రక్కపడివున్న కొత్తరకం ఇంజను. గొట్టం విరిగిపోయింది.





తలక్రిందుగా పడివున్న మూడో పెట్టెని క్రేన్ సహాయంతో ఎత్తుతున్నారు.

ఒకదానిలో ఒకటి చొచ్చుకుపోయిన నాలుగు అయిదు పెట్టెలు.




సినీమా:

శ్రీ లక్ష్మమ్మ కథ

ప్రతిభా వారి క్రొత్తఫిలిం 'శ్రీ లక్ష్మమ్మ' కథ ప్రివ్యూ గత ఆదివారం ఉదయం ఇచ్చారు. జి. కృష్ణమూర్తిగారు నిర్మించిన ఈ ఫిల్మును బలరామయ్యగారు డైరక్టు చేశారు. నాగేశ్వరరావు, అంజలి నాయక నాయకీ భూమికలను, శివరావు, బాలసరస్వతి, ప్రభాకరరావు, శేషమాంబ, జి. వరలక్ష్మి, సూర్యప్రభ ఇతర ముఖ్యపాత్రలను నిర్వహించారు. సంగీతదర్శకత్వం సుబ్బరామన్ నిర్వహించారు. పాటలు, మాటలు, బలిజేపల్లి, గోపాలరాయశర్మ గార్లు వ్రాశారు. ఛాయాగ్రహణం పి. శ్రీధర్, శబ్దగ్రహణం వి. శ్రీనివాసరాఘవన్ చేశారు.



సంక్రాంతికి కొంచెం అటూ ఇటూగా విడుదల కానున్న రాగిణీ ఫిలింస్ వారి 'తిరుగుబాటు'లో జలసా జంట నారాయణరావు, కృష్ణవేణి.



జయా వారి 'మాక్షకాను'లో శాంత స్వభావుడూ, ధర్మవర్తనుడూ అయిన రామయ్య పాత్రను అమోఘంగా నిర్వహిస్తున్న శ్రీవత్స జ. కటేశ్వర్లు.

నాట్యాలు వేదాంతం రాఘవయ్యగారు కూర్చారు.

నీతిమంతుల ఇంట పుట్టి, గారాబంగా పెరిగి, వలచినవానిని వివాహమాడి, చెడు దారిని పట్టిన భర్త తనవైపు చూడక వేశ్యాసక్తుడైనా, మాటపట్టుపై అత్తా, ఆడబిడ్డా పెట్టే కోడరికాన్నీ ధీరతతో భరించి, అనుమానసర్పదష్టుడైన భర్త హస్తాల అసువులు బాసిన, పతివ్రతా, ఒక ప్రసిద్ధ కుటుంబానికి ఇలవేలుపూ అయిన ఒక సాధ్వీమణి చరిత్ర ఈ ఫిలిం ఇతివృత్తం.

ఆ సాధ్వీపాత్రను అంజలీదేవి, ఆమె భర్తభూమికను నాగేశ్వరరావు చక్కగా నిర్వహించారు. వీరిద్దరూ కూడా ఇంతవరకూ నటించిన ఫిల్ములన్నిటిలోకంటె ఇందులో ఎక్కువ ప్రజ్ఞ చూపించారనడంలో సందేహం లేదు. ప్రత్యేకించి అంజలీదేవి, శృంగార ఘట్టాలలో ఎంత చాకచక్యం చూపిందో విషాదఘట్టాలలో కూడా అంత నేర్పు చూపింది. విలాసభూమికలు నిర్వహించే ఈమె ఈ పాత్రను ఎలా నిర్వహించుతుందా అనే అనుమానానికి ఆస్కారము లేదని నిరూపించింది. నాయికానాయకుల చెలికత్తె, చెలికాడుగా బాలసరస్వతి, శివరావు హాస్యరసోత్పాదన చేస్తూ జనాకర్షకంగా నటించినారు. నాయిక అత్త, ఆడుబిడ్డ పాత్రలు ధరించిన శేషమాంబ, జి. వరలక్ష్మి భయపెట్టేమాటలు, చేష్టలలో రంజకంగా నటించారు. ముఖ్యంగా వరలక్ష్మి నటనలో మంచి నేర్పు

నేటి ప్రపంచం:

రష్యా అమెరికాల యుద్ధతంత్రాలు

మార్షల్ ప్రణాళిక ప్రకారం 1951-52 లో 295 కోట్ల డాలర్ల ఆర్థికసహాయాన్ని యూరోపియన్ దేశాలకివ్వడానికిగాను అమెరికన్ కాంగ్రెస్‌లో బిల్లు ప్రతిపాదించబడుతుంది. అలా ప్రవేశపెట్టేముందు సెనేట్ విదేశాంగవ్యవహార సమితి ఆమోదించాలి. ఈ సమితిలో బిల్లు అంశాలనుగురించి పాల్ హాఫ్‌మన్, అమెరికన్ విదేశాంగమంత్రి డీన్ ఆఛిసన్ ప్రభృతులు ఉపన్యసించారు. సెనేట్ విదేశాంగ వ్యవహారసమితిచేతనూ, ఉత్తరోత్తరా కాంగ్రెస్ చేతనూ అంగీకరింపచేయడం కోసం ఈ ఆర్థికసహాయం ఆవశ్యకతను నిరూపిస్తూ వివిధ నాయకులు రష్యాతో వైరం విషమించినట్లు చెప్తున్నారు.

అయితే హైడ్రోజన్ బాంబు నిర్మాణానికి ప్రెసిడెంట్ ట్రూమన్ ఆజ్ఞ ఇచ్చినప్పటినుంచీ అమెరికాలో ప్రజలు నాయకుల భీతి మితిమీరిపోయింది. రష్యా కూడా ఏటంబాంబులు తయారుచేస్తున్నదని ఇదివరకే తెలిసివచ్చింది. ట్రూమన్ ఆజ్ఞ ఇవ్వడంవల్ల రష్యా కూడా హైడ్రోజన్ బాంబుల్ని నిర్మించి తీరుతుందని అందరూ అభిప్రాయపడుతున్నారు. అందువల్ల ఎలాగైనా ఏటంశక్తికంట్రోల్ విషయంలో రష్యాతో సఖ్యత చేకూర్చుకోడానికి యత్నించాలని అమెరికాలో ఆత్రుత కలిగింది. అనేకమంది అనేకసూచనలు చేశారు. ఇంకా చేస్తున్నారు. ఇంతవరకూ రష్యాపట్ల మరింత కఠినంగా వ్యవహరించాలని వాదిస్తున్నవారు కూడా ఇప్పుడు ఏదో రీతిని సఖ్యత చేకూర్చుకోవలసిన అగత్యం ఉందని చెప్తున్నారు. అమెరికన్ ఎటామిక్ కమిషన్ అధ్యక్షుడు సెనేటర్ బ్రియన్ మెక్ మహాన్ కూడా ఒక ప్రతిపాదన చేశాడు. అయితే వీరు చేసిన సూచన విపరీతమైనది. ప్రపంచంలో అన్ని దేశాలకూ మార్షల్ ప్రణాళికవలెనే ఆర్థికసహాయప్రణాళికను అమలుపరిచి, అణుశక్తిఉత్పత్తికి యుద్ధపరికరాలకు కాకుండా అవసరవస్తూత్పత్తినిమిత్తమే వినియోగించడానికి ప్రపంచరాజ్యాల ఆమోదం పొందాలని మెక్ మహాన్ సూచించాడు. ఈ సూచనకు రష్యా కాని ఇతరదేశాలు కాని అంగీకరించడం కల్ల. అమెరికా తన ఆర్థికసంపద్బలంతో ప్రపంచంఅంతటా తన అధికారం చలాయించడానికీ, అణుశక్తి ఉత్పత్తినంతనీ తన అధీనంలోకి తెచ్చుకునేటందుకూ యత్నిస్తున్నదని నిందించడానికి తావిస్తున్నది. ఇది కాక అణుశక్తి కంట్రోల్‌పై సర్వదేశాలమధ్యనూ సఖ్యత సాధించడానికిగాను ఐక్యరాజ్యసమితి ప్రత్యేకసమావేశం ఒకటి మాస్కోలో జరపాలనికూడా మెక్‌మహాన్ సూచించాడు. ఈ సూచనచేస్తూ అమెరికాఆశయాల్ని రష్యన్ ప్రజల్లో కూడా ప్రచారం చెయ్యవలసిన అవసరం ఉందన్నాడు. దీన్నిబట్టి కూడా కేవలం రష్యాలో తమ ప్రచారం సాగించుకోడానికి యత్నిస్తున్నట్లు ఆరోపించడానికి అవకాశం కలుగుతున్నది.

ఏటంబాంబులూ హైడ్రోజన్ బాంబులూ ఒకరికంటె ఒకరు ముందుగా అధికంగా ఉత్పత్తి చేయాలనే పోటీవల్ల చివరికి త్వరలోనే యుద్ధప్రమాదం సంభవించవచ్చునని కొందరంటున్నారు. రష్యాలో ఏమి జరుగుతున్నదో తెలియడంలేదుగాని అమెరికాలో ఈ పోటీభావం తీవ్రంగా ఉంది. రష్యా ఇప్పటికే పెద్ద విమానదళాన్నీ అనేక ఏటంబాంబుల్నీ నిర్మించిందనీ, తల్చుకుంటే ఎప్పుడైనాసరే క్షణంలో అమెరికానగరాలపైకి విమానాల్ని పంపి ఏటంబాంబులు వేసి అమెరికాలో ప్రభుత్వాన్ని స్తంభింపచెయ్యగలిగిన బలాన్ని రష్యా ఆర్జించుకున్నదనీ ఒక సెనేటర్ అన్నాడు. అయితే ఈరీతిగా భీతి కలిగించడంలో ఆంతర్యం వేరే ఏదో ఉన్నదని అనుమానం తట్టకమానదు.

యుద్ధతంత్రంలో కొత్త ఘట్టం:

హైడ్రోజన్ బాంబు నిర్మాణం సాధ్యంకావడంతో యుద్ధతంత్రంలో కొత్త ఘట్టం ప్రారంభమైనదని చెప్పవచ్చును. నిజానికి ఇది ఏటంబాంబునిర్మాణంతోనే ప్రారంభమయింది.

యుద్ధంలో హైడ్రోజన్ బాంబు పరిస్థితినిగురించి హాన్సన్ బాల్డ్విన్ న్యూయార్క్ టైమ్స్‌లో వ్రాస్తూ కొన్ని ముఖ్యాంశాలు చర్చించాడు. హైడ్రోజన్ బాంబుతో యుద్ధతంత్రంలో కొత్త ఘట్టం ప్రారంభమైన విషయం నిజమేగాని, దీనితో యుద్ధాలు గెలవడం తథ్యమనుకోవడం పొరబాటు. జపాన్‌లో రెండు నగరాలపైన రెండు ఏటంబాంబులువేసి అమెరికన్లు జపాన్ చేత ఓటమి నంగీకరింపచేశారు. కాని పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. జపాన్‌కి అప్పుడు ఏటంబాంబు ఉన్నం తెలియదు. అందువల్ల యుద్ధంతో నిమిత్త

కనిపించింది. నాయికసోదరుని పాత్ర ధరించిన ప్రభాకరరావు ఉచ్చారణలో, నటనలో మంచిస్ఫూర్తి చూపాడు. శృంగారం, హాస్యరసఘట్టాలు, సృష్టించి నిర్వహించటంలో నిర్మాతలు మంచిప్రతిభ చూపారు. వీటి సంఘర్షణంలో కొంచెం నిగ్రహానికీ, అభిరుచికీ తావు ఇచ్చి, కథ నిజంగా జరిగినది కాబట్టి, ఆ దేశకాలపరిస్థితులు, ఆచార సంప్రదాయాలు సక్రమంగా చిత్రించి, ఆయా కుటుంబాల గౌరవప్రతిష్ఠలకు అనుగుణంగా పాత్రపోషణ చేసి, కథకు సహజ వాతావరణం సమకూర్చినట్లయితే ఫిల్ము ఇంకా రక్తికట్టేది. [శర్మ]

లేని అమాయకులు నిస్సహాయులు అయిన లక్షలాది నగరవాసులపైన అమెరికన్లు ఏటంబాంబులు వేసి విపరీతమైన నష్టం కలిగించారు. ఇప్పుడీ బాంబుల ప్రభావం తెలిసివచ్చినందువల్ల రష్యా ముందే జాగ్రత్త పడింది. ఏ ఒక్క నగరంలో ప్రభుత్వ కార్యాలయాల్ని గాని పరిశ్రమల్ని గాని కేంద్రీకరించకుండా వివిధ ప్రాంతాలకు తరలించారు. ముఖ్యపరిశ్రమల్ని నిర్జన ప్రాంతాల్లో స్థాపించారు. అందువల్ల రష్యాలో సైనిక, పారిశ్రామిక, ప్రభుత్వ కార్యాలయాల్ని ధ్వంసం చెయ్యాలంటే కొన్ని వందలు వేలు ఏటంబాంబులూ హైడ్రోజన్ బాంబులూ అవసరమౌతాయి. కాని అమెరికాలో పరిస్థితి భిన్నంగా ఉంది. పది జనముఖ్యనగరాల్ని ధ్వంసం చేస్తే ప్రభుత్వం స్తంభించిపోవచ్చును.

ఏటంబాంబులు, హైడ్రోజన్ బాంబుల్ని సృష్టించి లక్షలాది ప్రజల్ని క్షణంలో హతమార్చగల ఆయుధాల్ని తయారుచెయ్యగలుగుతున్నారేగాని యుద్ధకాలంలో ప్రజల్ని ఈ మారణహోమం నుంచి కాపాడ్డానికి సాధనాల్ని కనిపెట్టలేకపోయారు. యుద్ధపరికరాలు వృద్ధిఅవుతున్నకొద్దీ నిస్సహాయులైన ప్రజల్ని నాశనం చెయ్యడానికి సాధనమేర్పడుతున్నదే కాని శత్రుపక్షాన సైనికబలాన్నీ, మిలిటరీ పరిశ్రమల బలాన్నీ ధ్వంసం చెయ్యడానికి సాధనం లేదు. యుద్ధాల్లో ఖండితంగా విజయాన్ని సాధించిపెట్టగలవి కావీ సాధనాలు. అందువల్ల అమెరికా రష్యాల మధ్య యుద్ధమే సంభవిస్తే ఏపక్షానికీ జయాపజయాల ప్రసక్తే ఉండదు. ఉభయపక్షాలా జననష్టం లక్షల్లోనూ కోట్లల్లోనూ ఉంటుంది.


వంచన:

హైడ్రోజన్ బాంబువల్ల మానవకోటి అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడుతుందని అమెరికాలో ప్రచారం జరుగుతోంది. కాని నిజంగా ఏటంబాంబుకంటె హైడ్రోజన్ బాంబు ప్రమాదకరమైనది కాదు.

ఏటంబాంబుల తయారీకి ముఖ్యంగా కావలసినది యురేనియం. కాని బాంబుల్లోకి పనికివచ్చే యురేనియం ప్రపంచంలో బహుకొద్దిగానే ఉంది. హైడ్రోజన్ బాంబు ఏటంబాంబుకంటె ఎక్కువ ప్రమాదమైనదే కాని ఏటంబాంబుసహాయం లేనిదే హైడ్రోజన్ బాంబు పేలదు. అందువల్ల హైడ్రోజన్ బాంబుల్ని ఎక్కువగా తయారుచెయ్యవచ్చుననడం అబద్ధం. కాగా ఒక నగరంపైన ఏటంబాంబు వేస్తే చుట్టూ రెండుమైళ్ళ మేర రూపులేకుండా ధ్వంసమైపోతుంది. హైడ్రోజన్ బాంబు వేస్తే అదే ఎనిమిది లేక పదిమైళ్ళ మేర ధ్వంసం చెయ్యవచ్చును. తయారు చెయ్యడంలో గల చిక్కులవల్ల నిజంగా హైడ్రోజన్ బాంబువల్ల అంతమేరకూడా ప్రమాదం కలగచెయ్యలేదని కొందరు సైంటిస్టులు చెప్తున్నారు. ఏటంబాంబులు చిన్నవి. హైడ్రోజన్ బాంబులు ఎంత పెద్దవిగానైనా ఉండవచ్చును. కాని విమానాల్లో తీసుకెళ్లడం కష్టమౌతుంది.

ఏటంబాంబులూ హైడ్రోజన్ బాంబులూ ఎన్ని ఉన్నప్పటికీ, రష్యా యుద్ధం ఆరంభిస్తే, యూరపు అంతటినీ రష్యన్ సైన్యాలు ఆక్రమించుకుంటే ఏ బాంబులూ వారి నడ్డగించలేవు. రష్యన్ సైన్యాలు దాడి చెయ్యకుండా పశ్చిమ యూరప్‌ను కాపాడాలంటే పశ్చిమ

(39-వ పేజీ చూడుడు)



తెనాలిలో జరిగిన జాతీయ సారస్వత కళాపీఠ ప్రథమ సమావేశ సందర్భమున తీయబడిన ఛాయాచిత్రం ఎడమనుండి కుడివైపున నిలుచున్నవారు యడ్లపల్లి దేవయ్యచౌదరి, ఉత్పల సత్యనారాయణాచార్యులు, జాస్తి వెంకట నర్సయ్య, మిక్కిలినేని భగవంతరావు, యడ్లపల్లి కోటయ్య, ప్రత్తిపడుపు రాఘవరాజు. కూర్చున్నవారిలో అధ్యక్షులు అలపాటి వెంకటరామయ్య శతావధాని శ్రీమదిగొండ జ్వాలపతి లింగశాస్త్రి అయ్యవారు.



ఖనా

శ్రీమతి ఇవటూరి మురళీసుందరి

పూర్వము ఒక ఊరిలో ఒక ఇంట బ్రాహ్మణదంపతులకు లేక లేక ఒక కుమార్తె కలిగింది. పాపం ఆమె జన్మించిన కొద్దిరోజులకే తల్లి తండ్రులు మరణించారు. అందుచేత ఆమెను ఒక అనార్యుడు పెంచి పెద్దదానిని చేశాడు. ఆమెపేరు ఖనా. ఆయనే ఆమెకు గురువుగా జ్యోతిశ్శాస్త్రము, సంపూర్ణముగా బోధించాడు. ఆ కాలములో విక్రమాదిత్యుని ఆస్థానములో నవరత్నములని పేరుపొందిన తొమ్మిదిమంది మహావిద్వాంసు లుండేవారు. వారిలో వరాహుడనే పండితుడు జ్యోతిశ్శాస్త్రములలో పేరుపొందిన వాడు. ఆయనకు కుమారుడు పుట్టగానే జాతకచక్రము వేసి లెక్కవేసి చూడగా కుమారుని ఆయుపు 10 సంవత్సరాలని తెలిసింది, అందుకు వరాహుడు చింతించాడు. పదేళ్లు పెంచిన పిమ్మట మరణించినట్లయితే దుఃఖం భరించడంకష్టం. విచారము కలుగును. ఇప్పుడే డెక్కడైనా విడిచిపెట్టినట్లయితే విచారముండ''దని తలిచి అతడు కుమారుని ఒక గంపలోపెట్టి ఒక కాలువలోకి వదలిపెట్టాడు. ఆ గంప ఒక అనార్యునికి దొరికింది. అతడు బాలునికి మిహిరుడని పేరు పెట్టి, పెంచుతున్నాడు. మిహిరుడు కూడా ఖనాపెంపుడుతండ్రియైన అనార్యునివద్దనే ఖనాతోపాటు విద్యనేర్చుకున్నాడు. విద్య పూర్తి అయినపిమ్మట ఖనాకు, మిహిరునకు వివాహము చేశారు. పిదప వారు అక్కడనుండి రాజువద్దకు పయనమైవెళ్ళారు. దోవలో ఒక చోట ఒకఆవు యీనడానికి సిద్ధంగా వుంది. గురువు మిహిరుని పరీక్షించడానికి "మిహిరా! దీని గర్భమునుంచి పుట్టబోయే దూడ ఏ రంగుతో వుంటుందో చెప్పగలవా?'' అని ప్రశ్నించాడు. మిహిరుడు తెల్ల దూడ అని చెప్పాడు. కాని ఎఱ్ఱ దూడ పుట్టింది. అందువల్ల గురువు చాలా చింతించి తనవద్ద నున్న కొన్ని గ్రంథాలను అతని కిచ్చి వాని వలన విద్య బాగా నేర్చుకోవచ్చునని చెప్పాడు. మిహిరుడు చాలా చింతించి, ఆవేశము పట్టలేక ఆ గ్రంథాల నన్నింటిని చించి నదిలో పారవేశాడు. తరువాత వారు విక్రమాదిత్యుని పట్టణమునకు వచ్చి రాజుకు తమ రాక నెరుకపరచారు. రాజు వారిని జ్యోతిషపండితు డగు వరాహునికి ఒప్పగించి పరీక్ష చేయమన్నాడు. వరాహుడు మిహిరుని గుర్తించి, తాను తప్పుగణితము వేసినట్లు గ్రహించి వారిద్దరినీ తన ఇంటికి తీసుకువెళ్ళాడు. ఒక రోజు రాజాస్థానములో రాజు వరాహుని ఆకాశములో ఎన్ని నక్షత్రము లున్నవో చెప్ప మన్నాడు. కాని వరాహునికా విషయము తెలియ

(27 వ పేజీ చూడుడు)

బాలానందం:

ఏజియన్ సముద్రం

శ్రీ నందివాడ పుతలీ

చాలా కాలం క్రిందట మినాస్ అనే రాజు క్రీట్ ద్వీపాన్ని పరిపాలించేవాడు. అతని రాజ్యంలోని ఒక శిల్పి సుందరమైన భవన మొకటి నిర్మించి రాజుగారికి బహూకరించాడు. రాజుగారు ఆ భవనానికి ఒక రాక్షసుని కాపలా పెట్టారు. ఆ రాక్షసుడు సగం మనిషి, సగం దున్నపోతు ఆకారంలో ఉంటాడు.

మినాస్‌కి ఒక కొడుకున్నాడు. అతను మంచి ఆటగాడు. ఏథెన్స్‌లో ఆటల పోటీ జరుగుతుందని విని ఒకసారి అక్కడికి వెళ్ళాడు. ఏథెన్స్ ప్రజలని అన్ని ఆటల్లోనూ జయించాడు. ఏథెన్సు రాజైన ఏజియన్‌కి, తన ప్రజలు ఒక్క పందెంలోనూ గెలవలేకపోవడం సిగ్గనిపించింది. మినాస్ కొడుకుని చూసి ఈర్ష్య పడ్డాడు. రహస్యంగా అతనిని చంపించాడు.

ఈ వార్త మినాస్‌కి తెలిసింది. మినాస్ కోపంతో మండిపోయాడు. ఏథెన్సుని ధ్వంసం చేసి కసి తీర్చుకుంటానని శపథం పట్టాడు. వెంటనే పెద్దసైన్యంతో ఏథెన్స్ నగరాన్ని ముట్టండించాడు. ఆ సైన్యాన్ని చూసి ఏథెన్సు ప్రజలు ఇంక తమ ప్రాణాలు దక్కవని గజగజలాడిపోయారు. సంధికి సమ్మతించవలసిందని మినాస్‌ని అనేక విధాల బతిమాలుకున్నారు. మినాస్ ఒప్పుకున్నాడు. కాని సంధికి కఠినమైన షరతులు విధించాడు. తొమ్మిదేండ్ల కొకసారి ఏడుగురు యువకుల్ని ఏడుగురు యువతుల్ని రాక్ష



సుని కాహారంగా పంపాలన్నాడు. విధిలేక తమ రాజు తెలివి తక్కువకి తిట్టుకుంటూ, ఏథెన్సు ప్రజలు ఒప్పుకున్నారు.

సంధి ప్రకారం రెండుసార్లు పంపారు. అప్పటికి రాజకుమారుడు చదువు పూర్తిచేసి తండ్రిదగ్గరకు వచ్చాడు. ప్రజలు తన తండ్రిని నిందించడం భరించలేక తాను కూడా రాక్షసునికి బలి కావడానికి నిశ్చయించుకున్నాడు. రాజు ఎంత

వద్దన్నా వినక మూడోసారి తానూ బయలుదేరాడు. చిన్నతనంలో విద్యాభ్యాసంకోసం తల్లిదండ్రులను వదలివుండి యిన్నాళ్లకి తిరిగి వచ్చి, యిప్పుడు రాక్షసుని కాహారంగా తానే వెళ్తానంటే తండ్రి దుఃఖించాడు. వద్దని ఎన్నోవిధాల వారించాడు. వెళ్ళక తప్పదని రాజకుమారుడు తన నిశ్చయాన్ని తండ్రికి తెలియ పరిచాడు.

రాజకుమారుడు, మిగిలిన ఆరుగురుయువకులూ ఏడుగురుయువతులతో ప్రయాణమైనారు. విచారసూచకంగా ఓడకి నల్లజెండా కట్టారు. రాజకుమారుడు తండ్రి నూరడించాడు. బ్రతికి వచ్చినట్లయితే ఓడకి తెల్లజెండా కట్టగలనని చెప్పి, క్రీట్ ద్వీపానికి ప్రయాణమయి వెళ్లిపోయారు.

మినాస్ వీరినందరినీ ఖైదులో ఉంచాడు. మినాస్ కూతురు ఏథెన్సు రాకుమారుని చూడగానే సమ్మోహితురాలయింది. ఒక రాత్రివేళ ఎవరికీ తెలియకుండా ఖైదుకి వచ్చి రాజకుమారుని పారిపొమ్మని ప్రోత్సహించింది. మిగిలినవారిని వదలి తానొక్కడూ ప్రాణంకోసం పారిపోనని రాజకుమారుడు చెప్పాడు. ఎలాగైనా అతన్ని రక్షించాలని, ఆమె సంకల్పించింది. రాజకుమారునికి ఒక కత్తి నిచ్చింది. ఆ భవనందారులు తెలిసికోడం చాలా కష్టం అందువల్ల దారంకొస అతని కందిచ్చి ఆమె దారపు ఉండను చేతిలో పట్టుకొని నిలిచింది. దారంసహాయంతో రాజకుమారుడు అతిసులభంగా రాక్షసుడున్న చోటికి వచ్చాడు. ఘోరయుద్ధంలో రాక్షసుని చంపివేశాడు. ఎవరికీ తెలియకుండా రాజకుమారుడు రాజకుమార్తెను తన సహచరుల్ని వెంటబెట్టుకుని ఆక్షణమే ఏథెన్సుకి ప్రయాణమై వెళ్లిపోయాడు. ఒళ్లు తెలియని సంతోషంలో రాజకుమారుడు తండ్రి కిచ్చిన వాగ్దానం మరచిపోయాడు. ఓడకు—తెల్లజెండాకు బదులు నల్లజెండానే కట్టాడు.


ఏథెన్సురాజు, ప్రజలు, ఓడను చూడ్డానికి సముద్రతీరానికి వచ్చారు. ఏజియస్ ఆత్రుతతో ఓడవంక చూశాడు. నల్లజెండా కనిపించింది. తనకొడుకు మరి లేడనుకొని నిరాశ చెందాడు. విచారంతో తన బ్రతుకింక నిరర్థక మనుకొని సముద్రంలో దూకి మరణించాడు.

ఏజియస్ చనిపోయిన సముద్ర మని, ప్రజలు తమ రాజుజ్ఞాపకార్థం దానికి ఏజియన్‌సముద్ర మని పేరు పెట్టారు. (ఒక గ్రీకుకథ కనువాదం)


ఖనా

(25 వ-పేజీ తరువాయి)

లేదు. కుమారునికి గూడా తెలియలేదు. ఖనా పెంపుడుతండ్రివద్ద నేర్చిన విద్యవల్ల సమాధానం చెప్పగలిగింది. వరాహుడు మరునాడు సభలో అవి చెప్పాడు. రాజు వరాహుని సమాధానము చెప్పినవారెవరో తెలుప మన్నాడు. వరాహుడు తన కోడలి విషయమంతా చెప్పాడు. రాజు ఆమెను ఆస్థానములో పదవ రత్నముగా నియమించదలిచినట్లు తెలిపాడు. అందుకు వరాహుడు సమ్మతించలేదు. ఆమె జిహ్వ కోసివేయవలసిందని కుమారుని కోరాడు. మిహిరుడు నిర్దయగా ఆమెనాలుకను కోసివేశాడు. ఖనా ప్రాణాలు విడిచింది. కాని ఆమెకీర్తి ఆర్యావర్తంలో చిరస్థాయిగా నిలిచిపోయింది.



ఇథియోపియా మంత్రివర్గ రాయబారి అటో ఇమ్మాన్యుయల్ అబ్రహాం అధ్యక్షులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ గారికి ఫిబ్రవరి 25 తేదీన తమ అధికారపత్రాలు దాఖలు చేశారు. ఆ సందర్భంలో అధ్యక్షులు ఆ రాయబారితో కరచాలనం చేస్తున్న దృశ్యం.



అంగారకుడు : ఇద్దరు చందమామలు

శ్రీ భైరభొట్ల రామబ్రహ్మశాస్త్రి

(గతసంచిక తరువాయి)

కుజలోకంలో, ఇక్కడ మనకుమాదిరిగానే, సూర్యుడు కనిపిస్తాడు. కాని చందమామలు మాత్రము ఇద్దరు కనిపిస్తారు. చందమామల సంగతి కాసేపుండి చెబుతాలే! సూర్యుడు మనకెంత పెద్దవాడుగా కనిపిస్తున్నాడో వాళ్లకు అంతవాడుగా కనిపించడు. మనకన్నా చిన్నసూర్యుడే కనిపిస్తాడు. మనకిక్కడ సూర్యుడు చంద్రుడు దాదాపు ఒకేసైజులో కనిపిస్తున్నట్లే, వాళ్లకుకూడా సూర్యుడు, ఒక చంద్రుడు దాదాపు సమానంగానే కనిపిస్తారు. వాళ్ల చంద్రుడింకా చాలా గమ్మత్తుగా తిరుగుతాడు. ఈయన సంగతంతా చివరికి చెబుతాలే!

మనకు మాదిరే కుజలోకంలో వాళ్లకు కూడా ప్రొద్దున్నపూట సామాన్యంగా 6 గంటలకుదయిస్తే సాయంత్రం దాదాపు 6 గంటలకస్తమిస్తాడు. అంటే మనకు మాదిరేవాళ్లకు కూడా రోజుకు 24 గంటలే దాదాపుగా. కాని వాళ్లకు ఒకసంవత్సరమంటే మనకు రెండుసంవత్సరాలన్నమాట. వాళ్లకు వర్షఋతువంటే మనమాదిరి రెండు మాసాలు కాకుండా నాలుగు మాసాలుంటుంది. అందుకని వాళ్లు వాళ్ల నెలకి 60 రోజులయినా పెట్టుకొనిఉండాలి, లేకపోతే వాళ్ల లెక్కకి సంవత్సరమంటే 24 నెలలైనా అయివుండాలి. ఇంకా సరిగ్గా చెప్పాలంటే, వాళ్ల సంవత్సరమంటే మనకు 22 నెలలు 16 రోజులు 19 గంటల 12 నిమిషాలన్నమాట.

మనకన్నా వాళ్ల ముక్కులు కొంచెం పెద్దవయిఉండాలి. వాళ్ల గాలిలో మన గాలిలోకన్న ప్రాణవాయువు కొంచెం తక్కువ. అందుకని వాళ్లువాళ్లకి కావలసినంత ప్రాణవాయువును పీల్చాలంటే, మనకన్నా ఎక్కువగాలిని పీల్చాలి. అందుకని కొంచెం పెద్ద ముక్కులుండాలి. మళ్లీ అందవిహీనులు కాకుండా ఉండాలంటే ముక్కుకుతగిన ఆకారం ఉండాలి. అందుకని, అయితే మనవాళ్లెవరు చూసిరాలేదుగాని - మనకన్నా వాళ్లు పెద్దఆకారాలు కలిగిఉండాలి. మనం ఆలోకానికి వెళ్లేటట్లయితే ఊపిరి పీల్చుకోటానికి కొద్దిగా యిబ్బందిపడతాము.

అయితే ఆలోకానికి పోయేటప్పటికి మన నెత్తిమీదనుండి ఏదో పెద్ద బరువు తీసేసినట్లుంటుంది. ఎందుకో తెలుసా! ఇక్కడ మనం పుట్టినప్పటినుంచి రాత్రింబగళ్లూ మనపైన ఉన్న గాలిని మన నెత్తిమీద పెట్టుకొని మోస్తున్నాము. పోనీ ఎందుకొచ్చిన పీడ యీగాలిని తీసిపారేద్దామా అంటే మనం పీల్చేందుకు ప్రాణవాయువుండదు. దాంతో పుటుక్కున ఛస్తాము. అందువల్ల మననెత్తిమీద గాలి ఉండక తప్పదు. మన నెత్తిమీద మనం నిత్యం మోసేబరువు అర్ధమణుగుంటుందిట. మనం ఇంతబరువును జన్మలో ఒక్కక్షణంగూడా నెత్తిమీదనుంచి క్రిందకు దింపటల్లేదు. కాబట్టి మనకసలు మోస్తున్నట్లే తెలియదు. ఇంతబరువును మోస్తూనే మనం అన్నిపనులూ చేస్తున్నాము. అడ్డులేకుండా తిరుగుతున్నాము, ఇంకా పైకి పెరుగుతున్నాము. అందుకనే అయివుంటుంది సన్నటివాళ్ళు మోసేది తక్కువ వాతావరణమే కాబట్టి వాళ్లు ఎక్కువ ఎత్తు పెరుగుతుంటారు. లావాటివాళ్ల దేహంమీద ఎక్కువయే మోయాలిసిన వాతావరణముంటుంది కాబట్టి అంతబరువు వీళ్లను క్రిందకు అదుముతుంటంచేత వీళ్ళు ఎక్కువఎత్తు పెరగలేరు. అదీకాక యింకా కుజలోకంలోకి పోతే మనం చాలా తేలికయిపోయినట్లు కనిపిస్తుంది. ఇక్కడ 150 పౌనులు బరువు తూగే పెద్దపెద్దమనుష్యులు అక్కడకుపోతే 57పౌనులే తూగుతారు. అంటే దాదాపు పన్నెండేళ్ల పిల్లలంత బరువే ఉంటారు. ఇక్కడ 50 పౌనులు తూగే కుఱ్ఱవాడు అక్కడ 18 పౌనుల పిట్టంతబరువే తూగుతాడు.

ఇదంతా ఎందువల్లనో తెలుసా! మన భూమికున్నంత గురుత్వాకర్షణశక్తి కుజలోకానికి లేదు. అందుకని ఇక్కడ నీవు నాలుగడుగుల యెత్తు ఎగరగలిగితే అక్కడ తేలికగా కళ్ళుమూసుకుని పదకొండడుగుల యెత్తు ఎగిరేస్తావు. ఇంకా అదుకు నెట్టేందుకుపైనా 14పౌనులగాలి బరువుగూడా ఉండదు కాబట్టి ఇంకా-అంతకన్నా-పదమూడు పధ్నాలుగడుగులుకూడా పైకెగరగలవు. పైన ఉండే వాతావరణం బరువుకూడా తక్కువకాబట్టి, ఆలోకంలో మనుష్యులు బాగా పొడుగాటి వాళ్ళూ గూడా అయివుండచ్చు. కాబట్టి12 కాక 13 అడుగులఎత్తు ఎగిరేపిల్లలు చిన్న చిన్న మరుగుజ్జులవక పొట్టిగిత్తలు కాకుండా, బొప్పాయి చెట్లంత ఎత్తుకూడా ఉంటారేమో! అంతంత ఎత్తులు ఎగిరేస్తారంటే ఆమాత్రమున్నా పొడుగుండద్దూ వాళ్ళు మరి! ఇక్కడ ఒక చిన్నపిట్టగోడ నెగురగల్గిన కుఱ్ఱాడు అక్కడ కోటబురుజులనే లెక్కచేయకుండా ఇటునుంచి అటు, అటునుంచి యిటు దూకేస్తాడు!

ఇవన్నీ వింటుంటే అంగారకలోకానికి ఎప్పుడెప్పుడు పోదామా అనుకుంటున్నావు కదూ! ఉండు తొందరపడకు. ఇంకా ముప్ఫయిసంవత్సరాల్లో అమెరికాదేశస్థులు జర్మన్‌రాకెట్టు విమానంలో రానూపోనూ నాలుగురోజుల్లో చంద్రలోకానికి ప్రయా

(31వ పేజీ చూడుడు)

రుద్రమదేవి

(12-వ పేజీతరువాయి)

నుండి వచ్చెను? ఎందు బోయెను? ఇప్పుడీయెడ గలడు? ఏమి మహత్త్వము! ఏమి మహత్త్వము!—మన కీనాటికి మరల దర్శన మగునా?—కొంతసేపు ఆశలేకుండ నిరీక్షించి యోగిని పరిపరివిధముల గీర్తించుచు ఎవరియిండ్లకు వారు వెడలిపోయిరి.

మరునాడు వసతికి జనులు పొరలబడి వచ్చిరి. కాని యానాడు వారికి సిద్ధుని దర్శనము కాలేదు. అట్లే మరికొన్నాళ్లును కాలేదు. కాని దశమినాడు మరల పూర్వమువలెనే ఆ యోగి భక్తులకు దర్శన మొసగెను!


ఇట్లు రెండుమారు లాతడు దర్శన మిచ్చెను. ఎందరో ఆతని జూచిరి. అయినను ఆతని రూపమునుగూర్చి ఒకరు చెప్పినట్లు మరియొకరు చెప్పరు. ఒకరు బాలునివలె నున్నాడందురు. ఒకరు ఒడలంతయు సడలిపోయి పండువృద్ధునవలె స్పష్టముగా గోచరించె నందురు. ఒకరు నిండుయౌవనములో నుండి సుందరరూపిగా కనబడె నందురు. ఒక రాతడు శ్వేతాంబరము ధరియించియుండె నందురు. ఒకడు, ఈ దిగంబరజైనుల వసతిలోనికి శ్వేతాంబరభిక్షు వెట్లు వచ్చును, దిగంబరుడుగనే కనిపించె' నని వాదించెను. ఒకడు 'శ్వేతాంబరుడు కాడు, దిగంబరుడు కాడు! అసలు భిక్షువే కాడు. శిరస్సుపై ధగధగలాడు సుశ్మీషమును దాని క్రింద నల్లని శిరోజములును పెద్దమీసమును స్పష్టముగా నేను చూచితి' నని నిష్కర్ష చేయును. ఒక రాతడు 'నల్లనివా' డనగా విని, 'అయ్యో, మీకు కన్ను లేమైనా జబ్బా? అంత ధగధగలాడుచు తెల్లగా నుండెనే!' అని ఇంకొక రందురు.

అందరును దూరమునుండి చూచినవారే! చీకటి వేళ చూచిన వారే! ఎవరి యూహామాత్రకారము వారికి ఆ మహాసిద్ధుని రూపము భాసించుటలో నాశ్చర్య మేమి!

అదియును గాక అర్హతులకు రూప మేమిటి? ఒక నిర్ణీతమైన రూపము సామాన్యమానవులకు గాని సిద్ధుల కట్టిదానితో నిమిత్త మేమి? అర్హతులు నిజముగా శరీరము లేనివారే! వారు నిర్జరులు! సామాన్యవ్యవహారదృష్టిచేమాత్రమే వారు శరీరము కలవారు. ఆ శరీరము 'ఔదారికమే' అది వేయిసూర్యుల కాంతి కలది. మన బోంట్లకు ఎన్నిరూపములతో నైన నది భాసింపవచ్చును—ఇట్లచ్చట చేరిన జైనవిద్వాంసు డొకడు స్వరూపనిష్కర్ష చేసి యందరకు సంశయనివృత్తి కావించెను.

దీనిచే ఆ జైనవసతిపై జనసమూహమున గౌరవాదరప్రపత్తులు విశేష మయ్యెను. అయితే దురదృష్టవశమున నాకాలముననే రాజపురుషుల దృష్టి యా వసతిలో కొన్ని భాగములపై కఠినముగా ప్రసరించెను. అందుకు కారణము వారికి ఆ సిద్ధునిపై గాని వసతిలోని ఇతరయతులపై గాని ఏలాటి సందేహమును గలిగి కాదు సుమా!

మరి యది యెట్లు సంభవించెను?



1951 జనాభా లెక్కలను గురించి, సర్దార్ పటేల్ జనాభా లెక్కల అజమాయిషీదార్ల సమావేశంలో ఫిబ్రవరి 23 వ తేదీన ప్రసంగించారు.

కార్యకారణాలు

(15 పేజీ తరువాయి)

అందులో చిన్నపిల్లల కేముంది, వాళ్ల ఊహాశక్తికి ఏమీ అడ్డుండదు ఏ పనికిరాని వస్తువిచ్చి, ఏమహావస్తువుగా భావించమన్నా భావించగలరు-మనం భావించమని అనక్కరలేదు. వాళ్ల భావనాశక్తిని మన యీ మహాసత్యమనుకొనే వాస్తవికజ్ఞానంతో అరికట్టకుండా ఉంటే చాలును; వాళ్ల ఆనందాన్ని వాళ్లే సృష్టించుకోగలరు. అయితే ఇప్పుడు నే నీకబుర్లన్నీ చెప్తున్నాను గాని, అప్పుడు నాకు వేరే ఉద్దేశం అంటూ ఏమీ ఉండేదికాదు. ఆ అమ్మాయి దగ్గరగా కూర్చొని, ఏవేవో అమాయికంగా కబుర్లు చెప్తూఉంటే, ఏవో ఆటలు కల్పిస్తూఉంటే ఎంతో సరదాగా ఉండేది. అంతే.

ఇక తను ఇంటికి వెళ్లిపోయేముందు ఒక రకం బేరం నడిచేది మా యిద్దరికీ నడుమ.

"రోజా మరి నీ ఫోటోయేనా? మరి మీ తమ్ముడి ఫోటో ఎప్పుడు తీయిస్తావు?" అని అడిగేవాణ్ణి, తానే వాళ్లింట్లో యజమాని అయినట్లుగా.

తాను కూడా తీసిపోకుండా, వాడింకా పెద్దవాడు కాందే! మరొక్క రెణ్ణెల్లుపోతే, అప్పుడుమా నాన్నగారూ, అమ్మ, తమ్ముడూ, నేనూ అందరం కలిసి తీయించుకొంటాము-అనేది.

"మరి నీ కిన్ని ఫోటో లున్నాయికదా, వాళ్లతో కలిసి ఎందుకూ?"

"మరి మా తమ్ముణ్ణి నేను ఎత్తుకోవద్దూ?"

"నువ్వెత్తుకోగలవూ? ఊహుం నే నన్నమ్మను."

"ఓ, ఎత్తుకోలేకేం, మా అమ్మ ఎప్పుడేనా పని తొందర్లో ఉన్నప్పుడు, రామిగాని రాకపోతే, మరి వాడేడుస్తూఉంటే"

"అబ్బ, అన్ని జరగాలన్నమాట, ఊఁ"

"నా ఒళ్లోనే తమ్ముణ్ణి కూర్చోబెడుతుంది. మరొక్క రెణ్ణెల్లుపోతే మా తమ్ముణ్ణి నేను ఎత్తుకోవచ్చునట! మాఅమ్మ చెప్పింది."

"మీ అమ్మ నిన్ను ఎత్తుకోనియ్యదులే, నువ్వు పెంకిపిల్లవిటకమూ?"

"లేదు తమ్ముడే పెంకివాడు. నేనే మంచిదాన్ని."

"మంచిదానివయితే, ఇవాళ పాఠం పూర్తిగా చదువుకొని, రేపు వేగం రావాలి. వెళ్లిపోతున్నావా? ఉండుండు. అటు తిరుగు. చేతు లిలా వెనక్కి పెట్టు. ఊఁ గట్టిగా ముయ్యి. ఇంటికి వెళ్లేవరకూ విప్పకు, జాగ్రత్తగా వెళ్లిపోతావుకదూ-" అని మెట్లు దింపి తిరిగి డాబాకెక్కి సందుమలుపు తిరిగే వరకూ కళ్లతో అనుసరిస్తూఉండేవాణ్ణి.

ఇది అసలు సామాన్యంగా జరిగే మా వీడ్కోలువైఖరి.

ఇల్లా మేమిద్దరం సరదాకి రోజా అను

కోగా అనగా ఒకనాడంతట నిజంగానే వచ్చింది వాళ్ల కుటుంబం అంతటికీ నేను ఫోటో తియ్యవలసినరోజు. అయితే అందువల్ల నాకుగాని సరోజకుగాని ఏమీ ఉత్సాహం కలగలేదంటే అందుకు తగిన కారణం లేకపోలేదు. వాళ్ల నాన్నగారికి ఆ వూరినుండి బదిలీఅయిపోయిందట. మరొక వారంరోజులలో బయలుదేరిపోతారట. ఏంచెయ్యగల్ను. ఎలాగూ తప్పేది కాదు. నేనే అదోగలాగుంటే ఆ అమ్మాయి కెల్లా ఉంటుంది. పోనీ, ఏవిధంగానయినా బదిలీతప్పిపోకూడదూ? ఆగితేమాత్రం, ఎప్పటికయినా ఈచిక్కు తప్పేది కాదు. అసలు పొరపాటంతా ఇంత తక్కువకాలంలో ఇంత గాఢంగా స్నేహం చెయ్యడంలోనే ఉందికాబోలు. ఇప్పుడయితే ఇన్నిమాటలు చెప్పగలుగుతున్నాను. అప్పుడేమిటో, మనస్సు ఒకక్రమాన్ని అనుసరించి ఆలోచిస్తేకదూ. ఎంతోకాలంనించి కూడబెట్టుకొని, ఇదే జీవితసర్వస్వమనుకొన్న నిధిని పోగొట్టుకొన్న మనిషిలాగ నేను అప్పట్లో ఎక్కువ మాట్లాడనూ ఆలోచించనూ కూడా అశక్తుణ్ణయేను.

ఆవేళసాయంత్రం నేను వాళ్లింటికి వెళ్లేసరికల్లా సరోజ గుమ్మంలో కనిపించి, నాన్నగారు ఇంట్లో లేరు, ఇప్పుడే వస్తారంది.

నేను మా నాఖాకుణ్ణవాణ్ణి అక్కడే గుమ్మంలో కూర్చోవని, ఆయన రాగానే వచ్చి చెప్తే వస్తానని చెప్పి, వెనక్కి తిరుగుతూఉండగా ఆవిడ వచ్చింది. "ఇప్పుడే వచ్చేస్తారు. వాళ్ల ఆఫీసరుగారు ఏదో ముఖ్యమయిన ఒక్కమాట చెప్పవలసి ఉందని కబురుచేసేరు–" అంది. ఇంకా ఆవిడ ఏమో అనదలచినట్లే ఉంది. కాని మాటలుమాత్రం అక్కడితో ఆగిపోయేయి-ఈవిడ మాయింటర్మీడియేటు స్నేహితురాలు సీతాదేవికదూ? అప్పుడు నాకు నాటకంలో నాయకిపాత్ర వేసినప్పుడు, ఈవిడేకదూ అడగ్గానే తన సిల్కుచీర ఇతరఅలంకారాలు ఇచ్చింది. ఇంతకాలం ఇంత దగ్గరలో ఉండి, ఒకరినొకరం తెలియకుండా ఎలా ఉండగలిగేమో? అప్పుడు నేను చదువుకొనే రోజుల్లో మామూలుఅర్థంలో ఆమెను ప్రేమించే నవడానికి వీల్లేకపోయినా దూరంనుండి ఆమెను ఆరాధించేవాళ్లలో నేనొకణ్ణవడానికి ఏమీ అభ్యంతరం లేదు. ఏమంటే నాది స్కాలర్‌షిప్పుల చదువు. బట్టలకి కూడా నానాతాపత్రయం పడవలసివచ్చేది. ఉన్న కొద్దిపాటి తీరికసమయమూ ట్యూషన్లతోనూ, ఒక ఉద్దేశమూ నిశ్చయమూ లేకుండా చేసే ఏవేవో అనువాదాలతోనూ గడచిపోతూఉండేది. ఆ వచ్చే కొద్దిపాటి రూపాయిలుకూడా ఎంతో విలువయినవిగా ఉండేవి ఆరోజుల్లో. ఇంతకీ అసలు చెప్పదలచిన సంగతేమిటీ అంటే, ఆరోజుల్లో నా దృష్టికి సీతాదేవి కేవలం పుస్తకాల్లో చదివిన వ్యక్తులంత తోచీతోచనట్లుగా కాకపోయినా, సినీమాలలో చూసిన వ్యక్తులంత దూరంగానూ కనిపించేది. ఎదురుగా మనిషి కనిపిస్తూనే ఉన్నా ఎప్పుడయినా మాట్లాడినా ఏమయినా ఆ మరుక్షణానే ఏదో స్వాప్నికజగతిలోని అనభవంవలే అనిపించేది ఆ సంఘటన.

అయితే సరోజ సీతాదేవికూతురన్నమాట. కాబట్టే నేను ఇంతగా ప్రేమించగలుగుతున్నానేమో – అహఁ అల్లా ఎల్లా కుదురుతుంది? ఈవిడ సీతాదేవి కాకపోతే మాత్రం సరోజకూ నాకూ నడుమ ఉండే స్నేహంలో పిసమంతయినా వార ఉండగలదా?

అలా నిలబడి ఏదో మాట్లాడాలని అనుకొంటూనే ఉన్నానుగాని, ఏమాటా నోట రాలేదు. ఏవేవో ఒక స్ఫుటమయిన రూపంచెందని అప్రస్తుతమయిన ఆలోచనలే అన్నీ.

చివరికి సీతాదేవే ఆరంభించింది. 'మీరేనా? అమ్మాయి రోజూ ఫోటోల పంతులుగారంటూఉంటే ఎవరో అనుకొన్నానే దాన్ని' అంది.

ఆతరువాత నన్ను వాళ్ల ఆయన వచ్చేవరకూ ఉండమని అట్టే బలవంతం చెయ్యనక్కరలేకపోయింది. ఆవిడ కాఫీ ఇస్తూంటే "ఎందుకు లెండి?" అన్నాను. "అహఁ, అల్లా అంటే ఎల్లా చెప్పండి? అప్పటి స్నేహంమాట మరచిపోయినా. అప్పటిఆకొద్దిపాటి పరిచయాన్ని ఆవిడ స్నేహంగా ఉటంకించడం నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. ఇప్పుడు మా అమ్మాయిగురించి రోజూ మీరు పడుతున్న తాపత్రయానికయినా......"

'అంత తాపత్రయమయితే నేను భరించలేకపోయేవాణ్ణి. అమ్మాయి దగ్గర ఉంటే అసలు నాకు కాలమానమే తెలీదు"

"దానికీ అంతే. ఒక్కక్షణం ఇంట్లో ఉండదు. అయితే మేము అర్నెల్లు తాపత్రయపడి దానికి అక్షరాలయినా సరిగా చెప్పలేకపోయేము. ఇప్పుడిప్పుడే అది దాని పుస్తకం చదువుకోగలుగుతూందంటే అది మీ ప్రభావమే."

'ఇందులో నా గొప్ప ఏముందిలెండి. కబుర్లూ కథలూ చెప్పుకొని, అలా కొంతకాలం గడపగా ఏమీ తోచక మార్పుకోసం అక్షరాలు చెప్పడం మొదలుపెట్టేను. అక్షరాలూ గుణింతంమాత్రమే నేను చెప్పినవి. తరవాత తక్కిన చదువుకోవడం అంతా తనే నేర్చుకుంది. "ఏం సరోజా! అంతేకదూ?"

'అదుగో చూసేరా? మీ రంతలా ముద్దుచెయ్యబట్టే మామాట వినకుండా తయారయింది.'

"నేనమ్మను. ప్రతిదానికీ అల్లా అయితే అమ్మకి ఇష్టం లేదు. ఇల్లా చేస్తే నాన్నగారికి కోపం వస్తుంది" అంటూ ఉంటుంది కదా అటువంటి అమ్మాయి మీ మాట వినకపోవడమేమిటి? అయినా మరి మీ కా భయం అక్కరలేదు. మీ అమ్మాయి నామాట విని చెడిపోకుండా మీరు మరొక ఊరు వెళ్ళిపోతున్నారుకదా?"

"ఏమిటోనండీ ఈ బదిలీలు. పిల్లి పిల్లలను ఏడిళ్ళకు తిప్పుతుందన్నట్లుగా ఎక్కడా స్థిరంగా ఒకచోట ఉండనియ్యరు. అయితే అదీ మంచి ఊరే, ప్రమోషనుమీద పంపిస్తున్నారుగాని, ఇక్కడ ఈ మూడేళ్లాయి ఉండిపోయేక కదలా లనిపించడంలేదు." అని ఆవిడ ఊరుకొంది నాకు మాటలాడ్డానికి వంతుయిచ్చి.

అయితే అంవరకు ఏమి మాట్లాడాలో అనుకోకపోవడంచేత నేను వెంటనే ఏమీ మాట్లాడలేకపోయేను.

ఆమె అదివరకల్లా అడగాలనుకొంటూ ఉన్న ప్రశ్న నే ఏదో హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్లుగా, "అయితే మీరు మా అమ్మాయినే ఇంతలా ముద్దుచేస్తున్నారు కదా, మీ అమ్మాయిల నెలా చూస్తున్నారో?" అంది.

నేను అవివాహితుణ్ణని తెలిసే ఆమె ఇల్లా

అడుగుతున్నా దేమో ననిపించింది అప్పు డెంచేతో.

"మా అమ్మాయిలనా? నేను చాలా హింసపెట్టే కఠినాత్మురాలిని పేరుపడ్డాను సుమండీ. అసలు మా శ్రీమతే నేనంటే గడగడలాడుతుంది. మా అమ్మాయిలు ఎప్పుడూ నాకంట పడనేపడరు. పడితే ఎందుకో ఒకందుకు చీవాట్లూ దెబ్బలూ తప్పవు. మధ్యలో అడ్డుకోబోతే వాళ్ళమ్మపనీ అంతే" - ఎంతో నిజంగా అన్నట్లు గంభీరంగా మొగం పెట్టి అన్నానేగాని, మాటంతా పూర్తి అయేకనవ్వకుండా ఉండలేకపోయేను.

ఆమెకూడా నవ్వుతూ "అబద్ధం ఆడడానికయినా అలవాటుండాలి. అయితే ఇంకా పిల్లలు లేరన్నమాట" - అంది.

"పిల్లలే కాదు...' అని ఆగిపోయేను.

'అయితే ఇంతవరకూ మీరు పెళ్ళే చేసుకోలేదంటారూ? నేనన్నమ్మను' అంది.

'అంత నమ్మకపోవలసినంత వైచిత్ర్యం ఇందులో ఏముందిగనక?' అన్నాను వీలయినంత సహజంగా.

'ఏమీ లేదులెండి' - అని ఆమె కావాలని విషయం మార్చి, 'అప్పుడు మనతో కలిసి చదివిన వెంకటశాస్త్రిగారు మొన్న కనిపించేరు' అంది.

"ఎవరు, వెంకటశాస్త్రి, ఆ పిలక, గాంధీటోపీ, అత్తాకోడళ్ళంచుల ఉత్తరీయమూ, వాడేనా?"

'ఆయనే, కాని, ఇప్పుడా వేషమంతా మారిపోయింది లెండి, కళ్ళజోడు, క్రాఫు, సూటు - సీతాదేవిగారూ అంటూ దగ్గరకు వస్తే నేను ఎవరో అనుకొన్నాను.

'ఏంచేస్తున్నాడేమిటి?'

'బియే అయింతర్వాత రెండేళ్లు ఏవేవో ఉద్యోగాలు చేసి, అప్పుడు యమ్. ఏ చదివి ఎక్కడో హైస్కూల్లో ఇంకా మాష్టరుగా ఉంటున్నారట. ఈ సంవత్సరం ఆఖరికి లెక్చరరుఘాన్సు రావచ్చునట'

"ఏదో పోనీండి, ఒక్కడున్నా ఉన్నాడే, అప్పటి మన బేచిలో చదివిన చదువుకు సార్థకపరచుకొనేవాడు."

ఆవిడకి ఈమాట ఎంతమాత్రమూ ఇష్టపడలేదు. 'మీరూ అదేమాట అన్నారు. చదివిన చదువుకు సార్థకపరచుకోవడం అంటే, ఆ పాతపాఠాలే మనకంటె నిరుత్సాహంగా బాధపడే కుఱ్ఱాళ్ళకు నూరిపొయ్యడమనేకదూ మీ అర్థం? ఏమో నామటుకు నేను, బి. యే. పూర్తి అయే లోపుని ఉత్సాహంగా చదివేనని చెప్పుకోదగినవి వేళ్ళమీద లెక్కించడానికికూడా చాలవు తరవాతే నిజంగా నే నేమయినా చదువుకొన్నది."

"మీరు ఒక్కరు అటువంటి వాళ్లుంటే ఉండవచ్చును. మరి మాలాటి నిత్య జీవితంలో పుస్తకంతో సంబంధంలేని వాళ్ళమాట?"

'ఏం మీరుమాత్రం, ఈ రకమయిన కళని అభివృద్ధి చేసేరుకదా! చదువుకోవాలంటే అందుకు తగిన తాహతు ఉన్నప్పుడు ఎప్పుడో చదివిన ఆ పాతపాఠాలను ఏకరవు పెట్టి చిన్నపిల్లల మనస్సులలో నూరిపోయకపోతే మాత్రం వచ్చే నష్టం ఏమిటి చెప్పండి?—

ఆవిడ ఈ ధోరణితో నా మనస్సుమీది ఎంతో బరువు తీసి వేసినట్లయింది. నాలోనూ ఇటువంటి వుద్దేశాలే వున్నా, ధైర్యంగా యెన్నడూ నాలో నే నయినా అనుకోలేకపోయేవాణ్ణి. ఈ వృత్తిలో ఉన్నానంటే, ఇది నా మనస్సుకి సంతృప్తి నిస్తున్నాదన్నా, తక్కిన కాలేజీ చదువును సార్థకపరిచే కృష్టులకన్నా కొద్దిగా ఎక్కువగానే డబ్బువస్తున్నాదన్నా అది సరైన కారణంగా ఒక్కడూ ఒప్పుకోడు. ఏదో ఎందుకూ పనికిరాక ఇందుకు సిద్ధపడ్డ బాపతు' అనుకొంటారు.

అనుకొంటే మీకేం నష్టంలెండి మీ చిత్తం వచ్చిననాడు పనిచేస్తారు. లేనినాడు శలవు పెట్టనక్కరలేదు. ఎక్కువ ఓపికఉండి అదృష్టం కలిసివస్తే పదివేలు ఆర్జించగలరు. ఉద్యోగం అని జీతం ఎంతవచ్చినా నెలాఖరువేళకు రోజులు లెక్కపెట్టక తప్పదు. స్వేచ్ఛ అసలే ఉండదు. 'అయితే, మరి మీరు మీ ఫస్టుక్లాసు, యూనివర్సిటీ ఫరుడు రేంకులో వచ్చిన డిగ్రీని, బొట్టు పెట్టెలో పెట్టి పూజ చేస్తున్నారన్నమాట?" అని అడిగేరు ఏదో మహాహాస్యరసభరితమయిన ప్రశ్నను అడిగినట్లుగా.

"మీరేమన్నారు?"

"ఏమనడానికి ఏముంది? చించి చిత్తు కాగితాలబుట్టలో పారెయ్యడానికి కూడా అభ్యంతరంలేదు. ఇప్పుడున్నట్టే పరిస్థితులుండి, కాలం గడిచిపోయేమాటైతే' అన్నాను. అని కొంచెం ఆగి, మీకూ నా సమాధానం ఇష్టపడినట్లు లేదే-'అంది.

"లేదు లేదు పూర్తిగా ఇష్టపడింది, అయితే మీవంటి తెలివయినవాళ్ళూ చాకచక్యం ఉన్నవాళ్లూ ఇలా మీ నైపుణ్యానికి తగినంత పనిలేకుండా ఇంటి నాలుగుగోడల మధ్యా బద్ధకంగా కూర్చోడం దేశానికి కొంచెం నష్టంచెయ్యడం అయితే అవుతుందేమో. అయితే వ్యక్తిగతంగా అది మంచిది కావచ్చునడానికి నాకూ అభ్యంతరం లేదు."

మీ మాట మరీ చిత్రంగా ఉందే. మీరు అవునంటున్నదీ కాదంటున్నదీ తెలియకుండా ఉంది. నేను పనీపాటూ లేకుండా బద్ధకంగా కూర్చుంటున్నాననేకదూ. అలాగే కనిపిస్తుంది లెండి. తీరా, నేను ఏదో నౌఖరీలో ప్రవేశించి మహా చెయ్యగలిగిన ఘనకార్యమేమిటో తెలియదు. ఇప్పటికే ఎక్కువగా ఉన్న నిరుద్యోగులయిన యువకులసంఖ్యకి మరొక అంకె చేర్పంచగలనంతే. అంతకంటే నాకేం ఆధిక్యం కనబడలేదు. అంతకంటె మా పిల్లలనుగురించి పడే ఈ తాపత్రయం చాలా విలువయినదిగా ఎక్కువ సంతోషాన్నిచ్చేదిగా ఉంది. నా యింటిని నేను చక్కదిద్దుకోవడం కూడా దేశంలో ఒక భాగాన్ని బాగుపరచడమే కదా. నేను చెయ్యలేని ఆ దేశాన్ని మరమ్మత్తు చెయ్యడం ఏదో మా పిల్లలు చెయ్యకపోరు' అంది ఆవిడ కొద్దిగా ఆవేశంతోనే.

అరరే అనవసరంగా ఆవిడమనస్సు నొప్పించానుకాబోలనిపించింద—"నిజమే, మీరన్నది. ఇటువంటి పిల్లల పురోభివృద్ధికి పరిశ్రమించడంకంటే, విలువయిన దేశసేవ అంటూ ఉండదు. కాని, పెళ్ళి చేసుకొన్నంతమాత్రంలో అందరికీ మీ సరోజలాటి అమ్మాయిలు కలిగితీరుతారని ఏమి నిశ్చయం లేదుకదా?" అన్నాడు

ఏమిటో మీ మాట నాకు సరిగా అర్థం కావడంలేదు. మా పిల్లలో ఉన్న విశేషమేమిటి? నల్లగా ఉంది. మీకంటే ఎందుకో దానిమీద అభిమానం కలిగిందిగాని, మా యిరుగు పొరుగులవారు దీన్ని రణపెంక, గాలుగాయి-అంటారు. ఇంతకీ, తమ పిల్లలు తమకే బాగుండని తల్లిదండ్రులు లెక్కడా ఉంటూరనకోను. నేను వెంటనే ఏదో తీవ్రమయిన సమాధానం చెప్తానేమో అన్నట్లుగా ఆమె నా మొగంలోకి చూసింది. అలా కొంచెంసేపు చూసి, "ఆఁ తెలిసిందిలెండి, నాకు మీ సంగతి. మీకు పెళ్ళీ పెళ్ళాంకూ ఈ బాదరబందీ అంతా లేకుండా పిల్లలుమాత్రం కావాలి. అంతేనా?" అంది.

అంత ఆత్మీయంగా మాట్లాడే ఆమె ముందు నిబ్బరంగా అబద్ధం ఆడే శక్తి

లేకపోయింది నాకు. "పిల్లలు కూడా కావాలని ఆమన్నను మీ అమ్మాయిని చూసేవరకూ తెలుసుకోలేకపోయేను" అన్నాను.

అంతలో వాళ్ళ ఆయన వచ్చేరు. మామూలు జగత్తులో పడ్డాము. ఫోటో తీయడం అయిపోయింది. తరవాత వారంరోజులూ వాళ్ళు వెళ్ళిపోయేవరకూ సరోజ సుమారు నాదగ్గరే ఉందని చెప్పవచ్చును. ఆ తరవాత ఒక వారంరోజులు స్టూడియో కట్టేసి,మా స్వంత ఊరు వెళ్ళి,అక్కడి శిథిలమయిన నా ఇంట్లో ఉంటూ, నావి కాని పొలాలూ తోటలూ చూడ్డంతోనూ,అందరికీ ఆత్మీయవలె కనిపించే ఏటి ఇసుకతిన్నెల సౌహార్దాన్ని చవిచూడ్డంతోనూ, నన్ను నేను మరిచిపోవాలని ప్రయత్నం చేసి చేసి విసిగి తిరిగివచ్చేను.

నిజంగా కాలమానంలో చూస్తే ఒక మూణ్ణెల్లకంటె ఎక్కువ గడవలేదు. కాని సరోజ ఎవరో నా చిన్నతనంలో ఆడుకొన్న అమ్మాయిలంత పెద్దదిగా అంత దూరంగా వెళ్ళిపోతూంది మనోయవనికమీద.

ఆరోజు మధ్యాహ్నం మూడుగంటలకి అప్పుడే నిద్రనుండి లేచేను. ఎదురుగా వెంకట్రామయ్యగారు (అప్పుడాయన పేరు నాకు తెలీదు) ప్రత్యక్షమైనారు. ఆయన నేను చూపిన కుర్చీలో కూర్చొని,అట్టే డొంకతిరుగుడు లేకుండా చెప్పుకుపోసాగేడు. "మా పొరుగు సబ్ రిజిస్ట్రారుగారివల్ల తెలిసింది. వారికీ మీకూ ఏదో దూరపు బాంధవ్యం కూడా ఉందిట. ఆయనభార్య సీతాదేవి చెప్పింది:—మా అమ్మాయికూడా స్కూలు ఫయినలు పాసయింది.పదహారేళ్ళుంటాయి. ప్రస్తుతం మాష్టరీ చేస్తూంది. అదివరకల్లా పెళ్ళిచేసుకోను. ఇంకా ఇలా మాష్టరీ చేస్తూనే,బి. యే. పూర్తిచేస్తానంటే. ఇప్పుడు ఆవిడ సీతాదేవి చెప్పినమీదట ఇష్టపడింది నాతోకూడా మీరు చూడ్డానికి అమ్మాయిని తీసుకోనేరావాలనుకొన్నాను,కాని, అంతకంటె నాతో కలిసి మీరే అక్కడికి రావాలని ప్రార్థన. అలా అయితే అందరూ చూడ్డం అయిపోతుంది. ఇది అమ్మాయి ఫోటో అని తన చేతిలోని భగవద్గీతలోంచి తీసియిచ్చి,'ఆవిడ సబ్ రిజిస్ట్రారు గారి భార్య, నేను చూస్తే అతను చూసినట్టే లెక్క అన్నారులెండి. ఏమంత కట్నం ఇచ్చుకోలేకపోయినా, ఆవిడ చెప్పిన ప్రకారమే లాంఛనాలూ అవీ అంతా జరిపిస్తాము' అని, ఇక నావంతుపాఠం అయిపోయిందన్నట్లుగా మెదలకుండా కూర్చున్నాడు ఆయన.

అంతవరకూ నా సలహాతో కాదు' నా యిష్టంతో కూడా సంబంధం లేకుండా జరిగిన వ్యవహారం అక్కడితో ఆగిపోతుందా?

ఆవేళ సారెగదిలో మా శాంతతో నేనన్న మొదటిమాట ఏదో జ్ఞాపకం లేదుగాని, తాను నాతో ఆడిన మొట్టమొదటిమాట మాత్రం ఎప్పటికీ మరపురాదు. 'అయితే మీరు సీతాదేవిగారూ, వాళ్ళమ్మాయి సరోజా చెప్పినంత మంచివారా?' అంది.

"సరోజవంటి పిల్ల ఉంటే అంతకంటె కూడా మంచివాణ్ణి కాగలను'అన్నాను నేను.

"అసలు ఆ అమ్మాయిని చూసేక నేను పెళ్ళిచేసుకోండికి ఇష్టపడ్డానంది"శాంత.

"భేష్ బాగుంది ఇద్దరం ఒక్కలాంటి వాళ్ళమే. నీకు నేనక్కర్లేదు, నాకు నువ్వక్కర్లేదు.అంటే కేవలం అక్కర్లేదని కాదుగాని, ఇద్దరికీ అంతకంటే ఎక్కువగా వాళ్ళమ్మాయివంటి అమ్మాయి కావాలనుంది. సహవాస్య, ఎంత చక్కగా కలిసేయి మన అభిరుచులు"అంటూ పరస్పరం అక్కరలేదని తుణంక్రితమే వాచ్యంగాకూడా అనుకొన్నమే మిద్దరమూ ఒక్కటయేము-

అయితే ఇదంతా జరిగి పదేళ్ళపైగా అయింది. వాళ్ళ సరోజకి గతసంవత్సరం పెళ్ళి అయి, అప్పుడే ఒక కొడుకుకూడా పుట్టడం జరిగింది. పోని మా భార్యాభర్తల కోరిక తీరని కోరికగానే ఉండిపోయింది. ఈ సంవత్సరాంతంవరకూ చూసి, ఎవరిపిల్లనయినా, తల్లిపాలు విడిచిపెట్టినవయస్సు వచ్చినదగ్గరనుండీ పెంచుకోవాలనుకొంటున్నాము నేనూ మా శాంతాను.

బాలవిజ్ఞానం

(28 వ పేజీ తరువాయి)

ణాలు కట్టేస్తారుట,; అప్పుడే కట్టేస్తున్నారుట కూడాను. ఈమధ్యలో మనకాళ్ళల్లో మనవాళ్ళు యుద్ధాలు చేసుకొని ఒకరి నొకరు నాశనం చేసుకోకుండా ఉంటే యింకో ముప్ఫయి సంవత్సరాల్లో కుజలోకానికి కూడా ప్రయాణాలు కట్టేస్తారు. ఇప్పుడు నీవంటి చిన్నపిల్లలంతా ముసలివాళ్ళయే టప్పటికి కుజలోకంలో సంగతులన్నీ ఉన్నవి ఉన్నట్లు ఊరూరా వింతలూ విశేషాల క్రింద చెప్పుకుంటారు. ఇంకా ఆ లోకంలో దొంగలభయం లేకుండా ఉండాలంటే చాలా పెద్దపెద్ద గోడలతో ఎన్నో అంతస్తులు కలిగిన భవనాలు కట్టుకోవాలి. ఇప్పుడు అమెరికాలో నాలుగైదు వందల అంతస్తుల మేడలున్నాయంటే ఇంక ఆలోకంలో ఎన్ని అంతస్తుల మేడలుండవచ్చో మనకు తెలియదు. ఆ భవనాల్లో, ఆపై అంతస్తుల్లో తూగుటుయ్యాలల మీద కూర్చొని అక్కడి పిల్లలు మనలోకంవైపు చూస్తుంటే ఇప్పుడు మనకు చాలా ఎక్కువ కాంతితో శుక్రగ్రహము ఎట్లా కనిపిస్తోందో, అట్లా వాళ్లకి కనిపిస్తుంది, మనలోకం. ఒక్కొక్కసారి మనభూమికి సగభాగమంతా వాళ్ళకు కనిపిస్తుంది. మనకు చంద్రపూర్ణిమలా గా వాళ్లు దాన్ని భూపూర్ణిమ అనుకుంటారేమో! కొన్నాళ్లపాటు భూమి వాళ్లకు అసలే కనిపించదుకూడా. అప్పుడు వాళ్లు భూమిని గురించి ఏమనుకుంటారో! భూమికి మూఢమి వచ్చిందనుకుంటారేమో!

మన కొకడే చందమామ ఉంటే ఆలోకంలో పిల్లాడుకు కేందుకు ఇద్దరు చందమామయ్యలున్నారు. అయితే వాళ్లల్లో ఒక చందమామ ఆలోకానికి దగ్గరగా ఉన్నాడు. ఇంకోఆయన (ఆ పిల్లలమీద కోపంవచ్చి) చాలాదూరానికి పోయినాడు. అందుకని యీదగ్గరి చందమామనే వాళ్ళు లెక్కలోకి తీసుకుంటారు గాని దూరపు చందమామను లెక్కచెయ్యరు. ఈ రెండో చంద్రుడు వాళ్లకొక పెద్ద నక్షత్రములాగా కనిపిస్తాడు, మన చందమామ మనకు చాలా దూరంలో ఉన్నాడు. ఈ దూరంతో పోల్చిచూస్తే వాళ్లచందమామ లిద్దరూ వాళ్లకు దగ్గరలోనే ఉన్నారు. మొదటి చందమామ ఆ లోకం పిల్లలకు 4, 000 మైళ్ళదూరాన ఉంటే, రెండవచందమామ 14, 600 మైళ్ళదూరాన ఉన్నాడు. మొదటి చందమామ వాళ్ళకు ప్రతిరోజూ రాత్రి దాదాపు నాలుగైదు గంటల సేపుమాత్రమే కనిపిస్తాడు. ఈ నాలుగైదు గంటల్లోనే శుక్ల పక్షకలలు, పూర్ణిమ, కృష్ణపక్షకలలుగూడా కనిపిస్తాయి. ఎందుకంటావేమో తమ్ముడూ! ఆచంద్రుడు చాలా ఎక్కువ వేగంతో, దాదాపు 8 గంటల్లో ఒకసారిచొప్పున కుజలోకంచుట్టూ ప్రదక్షిణం చేసేస్తాడు. ఈవిధంగా ఒకగ్రహంచుట్టూ తిరిగే చందమామలను వైజ్ఞానికులు ఆ లోకానికి "భటులు" లేక ఆంగ్లములో "శాటిలైట్సు" అని అంటారు. ఆ కుజలోకం చుట్టూ యీ చంద్రుడు రోజుకు మూడుసార్లు తిరిగివస్తాడు. ఈ చంద్రుడు అక్కడి పిల్లలకు ప్రతిరోజూ కనిపిస్తాడు. ఇంకో విశేషమిటంటే ఆ చంద్రుడు పడమటి దిక్కున ఉదయించి, తూర్పుదిక్కున అస్తమిస్తున్నట్లుగా కనిపిస్తాడు. ఇప్పుడు నిండుచంద్రుడు కనిపిస్తే యింకాస్సేపటికి కృష్ణపక్షపు అర్ధచంద్రు డౌతాడు. ఇంకా ఒకనాటిరాత్రి అక్కడి పిల్లలు పడుకోబోయే వేళకి అస్తమిస్తే తెల్లవారు ఝామున తొలి కోడికూసే టప్పటికల్లా, మళ్ళీ పడమట ఉదయించి బాగా తెల్లవారేసరికి యింకోసారి అస్తమిస్తాడు. అయితే ఈ చంద్రుడు మన చంద్రుడి కన్న చిన్నవాడు. అంగారకలోకంలోని పిల్లలకు ఆచంద్రుడు ఒక పెన్నిసుబంతి అంత కనిపిస్తాడు. ఆ చంద్రుడి వ్యాసము మన చందమామవ్యాసములో ఒక వందో వంతుమాత్రమే! రెండోచంద్రుడి వ్యాసముగూడా యింతే. కాని మొదటివానికన్నా చాలా దూరాన ఉండబట్టి, యీ చందమామ ఒక పెద్దనక్షత్రమువలె వాళ్ళకు కన్పిస్తాడు. ఈ చందమామ ఒకసారి ఒకదిక్కున ఉదయించి యింకోదిక్కున అస్తమించేలోపల రెండు పూర్ణిమలు, రెండు అమావాస్యలు వచ్చేస్తాయి. ఒకనాడు రాత్రి యెంత యెత్తులో కనిపిస్తాడో యింక ఆనాటిరాత్రి అల్లా అంతే ఎత్తులో ఉంటాడు కాని ఇటునుంచి అటు కదిలినట్లే ఉండడు. దాదాపు 60 గంటలసేపు ఆకాశంలో కనిపిస్తూనే ఉంటాడు. ఒక్కనాటిరాత్రే అర్ధచంద్రుడిని, పూర్ణచంద్రుడినీ కూడా చూడవచ్చు. గంట గంటకు చంద్రుడి కలలు మారిపోతూ ఉంటాయి. కుజలోకంలో పిల్లలకు 6 గంటలకు చీకటి పడేటప్పటికి యీ చంద్రుడికి కృష్ణపక్ష త్రయోదశి అయితే, నలువైపులా బాగా చీకటిపడిన కొద్దిసేపటికి అమావాస్యవచ్చేస్తుంది. ఇంకో గంటకు శుక్లపక్ష అష్టమి చంద్రుడివలె కొంత సేపు ప్రకాశిస్తాడు. తెల్లవారేటప్పటికి శుక్లపక్షదశమివలె చంద్రు డుంటాడు. అక్కడిపిల్లలు ఇవ్వాళ యీ చంద్రుడిని ఎన్ని గంటలకు ఎంతయెత్తులో చూస్తారో సరిగా 5రోజుల తర్వాతఅన్ని గంటలకే అంతే యెత్తులో చూస్తారు. తమ్ముడూ, మన ధ్రువనక్షత్రాన్ని ఎప్పుడైనా చూశావా! ఎప్పుడూ ఉత్తరదిక్కులోనే ఉంటుంది, కదలదు, మెదలదు-అంగారకలోకంలో పిల్లలకు ధ్రువనక్షత్రము తులారాశినక్షత్రంలో ఒకటయిఉంది. ధ్రువుడి చరిత్రగుర్తు కొచ్చిందా! నువుగూడా మంచివాడి వనిపించుకోవాలంటే ఎన్ని మంచిపనులు చేయాలో ఎన్ని గొప్ప విజయాలు సాధించాలో, ఎంత ధ్రువకీర్తి సంపాదించాలో మరి!!!

గొడుగు

(13-వ పేజీ తరువాయి)

కో:—శిరం నాగభూషణంగారి ఇంట్లో నేనా? యిప్పుడు వెనకభాగంలో మీరుంటున్నారా అండి. అదివరకు శర్మగారు ఉండేవారే, యిప్పుడు లేరా వారు?

రా:—యిపుడూ ఉన్నారండీ. ఒక గది కాళీగా ఉంటే యిచ్చారు. అందులో ఉంటున్నాను.

(వరాండాలో చాలామంది వెళ్ళిపోయినారు. చాదాపు అంతా ఖాళీ అయింది. శేషయ్య మాత్రం ఈవులిస్తున్నాడు)

కో:—ఎంతకీ తగ్గదేం పాడువర్షం? ఛ, ఛ, (కాళ్లు నేలకేసి కొడుతుంది)

సూ:—మనం తగ్గమన్నప్పుడు తగ్గుతుందా?

కో:—నిన్నెవ్వరు పలకరించారు?

సూ:—అబ్బే, చెబుతున్నానమ్మా.

కో:—అదే! నిన్నెవడు చెప్పమన్నాడు. నువ్వు నోరుముయ్యి.

సూ:—అబ్బో! (పక్కకి వెళ్లి శేషయ్య పక్కన నిలబడుతుంది)

కో:—మీరెవరికోసమో చూస్తున్నట్లుంది. గొడుగు ఉంచుకోని కూడా యిక్కడ ఎందుకు పడిఉండటం?

రా.—లేదండీ-యీగొడుగు మా స్నేహితుడిది. అతను ఏదో వాళ్ల బంధువుల యింటికి పోతూ నన్ను యిక్కడే పార్కులో ఉండమన్నాడు. గొడుగు నాదగ్గరే ఉండిపోయింది. యింతలో వర్షం ఒచ్చింది. నేను యిక్కడికి చేరుకున్నాను- (ఒంగి రోడ్డువంక చూస్తో) వస్తుండాలె.

కో:—ఎంతసేపయింది అతను వెళ్లి.

రా:—యిప్పుడేనండి. ఒక గంట అవుతుంది.

కో:—అబ్బో గంటయితే యింకే మొస్తాడు. యింకా యిప్పుడే అంటున్నారే- అయినా అతని గొడుగు రేపు యియ్యొచ్చుగా? (నవ్వుతుంది)

రా.—హె- హె - యియ్యొచ్చులెండి. దాందేముంది. కాని అతను ఒచ్చాడంటే యిబ్బందిపడతాడు.

కో:—యిబ్బంది!— యిబ్బంది ఎట్లా అయినా పడుతాడు. ఒకవేళ ఒచ్చినా మీరు యిక్కడ ఉన్నారని అతని కెట్లా తెలుస్తుంది- మీరయినా గంటసేపు వెయిట్ చేశారు. యింతకంటే ఏం చేస్తారు?

రా:—అవుననుకోండి- మీ యిల్లు ఎక్కడన్నారు? వస్తారా మీరుకూడా?

కో:—మీయింటికి ఒకఫర్లాంగుఅవతల లెండి. మీకయినా యిబ్బంది లేకుండా ఉంటే నే!

(శేషయ్యమాటలకు సూరమ్మ బిగ్గరగా నవ్వుతుంటుంది. యిద్దరూ ఉలిక్కిపడి వెనక్కి చూస్తారు. కొత్తామె చాలా తీక్ష్ణంగా చూస్తుంటుంది)

రా:—(గొడుగు తెరుస్తూ)- లేండి-ఏదో పాతదిలాగా ఉంది లెండి గొడుగు.

కా:—ఏదో ఒకటి-తడవకుండా ఉంటే చాలు.

(మెట్లు దిగుతారు.)

(సూరమ్మ:—తొందరగా వరాండా ముందుభాగంలోకి ఒచ్చి నుల్చుంటుంది. కాస్సేపు తటపటాయిస్తుంది. వారిద్దరూ రెండడుగులు వేస్తారు)

సూ:—నేనుకూడా రానాబాబూ?

(రామలింగం ఆగుతాడు)

కొ:—(వెనక్కి తిరిగి) యింతమందికి చోటెక్కడ ఉంది? ఆయనున్నా యింకెవర్నన్నా యిద్దర్నికూడా పిల్చుకురాక పోయినావా?

సూ:—ఆయన గొడుక్కు మన అధికార మేంటి లెండి!

రా:—(నవ్వి) పదండి.

(రామలింగం, కొత్తామె చీకట్లో కలిసిపోతారు.)

సూ:—యింటిచేత్తే యింకో సీర లేదు. యిది తడుస్తే, ఏంచేత్తాంలే. ఏదో సావెజ్జబుతాలే. (తలమీద చెంగు వేసుకుని వెళ్ళిపోతుంది.)

(శేషయ్య వెనక్కివెళ్ళి గోడకి ఆనుకుని ఉత్తరీయం కప్పుకుని పడుకున్నాడు) గాలి ఎక్కువై వీథిలో లైట్లు ఆరిపోతాయి)

[కాలేజీ కాంపస్. కాలం దాదాపు పదకొండున్నర; పగలే. రీసెస్ టైమ్. హేమలతా, శ్యామలా ఒకమూల నిల్చుని మాట్లాడుతున్నారు.]

హే:—నాకిందుకే వీళ్లను చూస్తే అసహ్యం. మన కాలేజీవాళ్లు మరీని. యింతకంటే పిచ్చిముండావాళ్లు యింకెక్కడా లేరు.

శ్యా:—అసలు యింతగా యీవూళ్ళోనే మెడ్రాసులో చదివేటప్పుడు యింత ఉండేది కాదు. మొన్నమటుకు మొన్న నేను యింటికి పోతూంటే ఎంతసేపణ్ణించి కాపేసుకూచున్నాడో- వాడెవడూ— వాడిపే రేదో ఉండాల్నే- శీతారామారావా? ఎవడు- వాడి నోట్సు తీసుకొచ్చి యిచ్చి, మొన్నే రెండురోజులు మీరు రాలేనట్టుంది కావాలండీ యిది తీసుకుని రాసుకోండి అన్నాడు. ఎవడడిగాడో, యీ పండితుడ్ని. యీబోడి నోట్సులేకపోతే యిక్కడ అందరూ చచ్చిపోయేటట్లు.

హే:—నెక్స్టుయియర్ మాత్రం యిక్కడ చదవను నేను. దరిద్రపు కాలేజీ, దరిద్రపు కథాను.

(రామలింగం ఒస్తాడు)

రా:—మీరు- అతను- ఆఁ పోనీండి అది దొరికిందా?

(యిద్దరూ అతనివంక విచిత్రంగా చూస్తున్నారు. అతనికి గాభరా ఎక్కువైంది)

హే:—ఆఁ దొరికింది, మా తమ్ముడు మేడమీద పెట్టి మరచిపోయినాడు. రేపు ఒచ్చి తీసుకుని వెళ్లండి.

రా:—సరే, సరే, క్షమించాలి(వెడతాడు)

హే:—ఆఁ క్షమించాం.

(యిద్దరూ విరగబడి నవ్వుతారు)

శ్యా:—ఎవడు వీడు.

హే:—(నవ్వుతుంది) వీడు—(ముఖం గంభీరం అవుతుంది) - మొన్న మీయింటికి ఒస్తున్నాను చూశావు - దార్లో వర్షం ఒచ్చింది- దగ్గర మున్సిపల్ ఆఫీసు వరండాలోకి వెళ్లాను. అక్కడ కనపడ్డాడు యీన.

శ్యా:—భలేవాడే నే- ఏమిటి దొరికిందా అంటాడు?

హే:—ఆఁ ఏం లేదు. ఒక చినిగిపోయిన గొడుగు యిచ్చాళ్లే అప్పుడు. అది కూడా యింకెందొరిదోట! అది- యింట్లో యెక్కడ పెట్టానో, కనిపించలేదు. దానికోసమే ఎక్కడపడితే అక్కడ అడుగుతాడు.

శ్యా:—నాకు తెలుసులే వీళ్ల సంగతి.

(గంట కొడతారు - యిద్దరూ వెడతారు)

[ఆనాడే సాయంకాలం ఆరుగంటలు, రామలింగంగది - రామలింగం రాఘవరావూ యిద్దరూ కూచునిఉన్నారు. గది చాలా చీదరగా ఉంది]

రామ:—నాగొడుగు నాకివ్వటానికి చస్తారేమిటి? ఆ గొడుగువంకపెట్టుకునీ వాళ్ల యింటికి తిరిగానంటారు పైగా. ఆగొడుగు యిటె పారేయమను. మనకిదే పనా?

రాఘు:—నాకు తెలుసు లేరా, నాకు తెల్సు.

రా:—ఏం తెలుసు నీకు నాబాధ? ఆ గొడుగే యియ్యమని వాడు పీక్కుతింటున్నాడు.

రాఘు:—అసలు నువ్వెందు కిచ్చావురా పిచ్చికాకపోతే? అసలు వీళ్లకి తమ ఆకర్షణలో చాలా నమ్మకం. రెండుసార్లు నువ్వు ఆ గొడుక్కోసం వెళ్తే ఏమవుతుంది చెప్పూ? నాకు తెలుసునాయనా యీ సంగతంతా. నువ్వుకూడా ఏదో పడుండక వేషాలు వెయ్యబోతావయ్యె- వెధవ్వేషాలు.

రామ:—ఛా నాకా ఉద్దేశం లేదురా.


రాఘు:—ఊరుకోరా ఎవరికి నువ్వు చెప్పేది. ఆ గొడుగే ఒక పనిమనిషి అడిగితే యిస్తావుట్రా.

(రామలింగం మొహం తెల్లతెలపోతుంది)

రామ:—అబ్బ చెప్పేది వినిపించుకోవేరా? ఏదో మర్యాదస్తులుకదా అని యిస్తాంరా. మళ్లీ యివ్వటానికి యింతరొద ఎందుకు?

రాఘు:—మర్యాదేమిట్రా మర్యాద? ధనవంతులైతే మర్యాదస్తులేనా. అప్పుడు నీదగ్గర ఎంతమర్యాదగా ప్రవర్తించిందో కొంచెం చెప్పునాయనా? కావాల్సిందేలేరా యిట్లా - మనలోఉన్న బహీనత అక్కడ- ఫలానా హేమలత నాకు గొడుగు యిచ్చానంటే పేరు- ఫలానా పాచిపని ఆమెకు యిచ్చానంటే ఏం గొప్పా? నీ పిచ్చి గాభరా చూసి ప్రతీవాళ్లూ అదే ఉద్దేశం అనుకుంటారు. పోతేపోయిందిలే గొడుగు- జాగ్రత్త. వాళ్లింటికిమాత్రం వెళ్టకు. తంతారు కూడాను- అబ్బో చీకటిపడిందే వెడతాను.

(రామలింగం మాట్లాడ్డు. రాఘవరావు వెళ్లిపోతాడు. రామలింగం అట్లాగే కూచుని జుట్టు పీక్కుంటున్నాడు)



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

౪౭

(సంపు. ౨ : పదం. ౩౦౨)

నాటరాగం - ఆదితాళం

[పల్లవి]

(౧) స రి గ మ ప ధ ని సఁ | ప ని సఁ రిఁ సాఁ ని ప | గ మ ప ని ప ని సాఁ | ని ప మ రి రి రి రి |
తె లి సి న దె లి యు డు తె లి య ని వా ర లు తొ ల గు డు బ్ర హ్మా దు లె యొ ఉం గు దు రు

(౨) స రి గ మ ప ధ ని స | సఁ ని సఁ రిఁ సఁ ని సఁ రిఁ సాఁ ని ప | గ మ ప ని ప ని రిఁ | సఁ ని ప మ
తె లి సి న దె లి యు డు తె లి య ని వా ర లు తొ ల గు డు బ్ర హ్మా దు లె యొ
గ మ ప ని ప మ రి రి |
ఉం గు దు రు

(౩) స మ మ రి రి గ మ ప ధ ప ని సాఁ | ప ని సఁ రిఁ రిఁ రిఁ రిఁ | సఁ ని రిఁ సఁ సఁ మఁ రిఁ
తె లి సి న దె లి యు డు తె లి య ని వా ర లు తొ ల గు డు బ్ర హ్మా
సఁ ని ప మ గ మ ప ని సఁ ని ప మ రిఁ || (తెలిసిన)
దు లె యొ ఉం గు దు రు

[చరణం]

ప ప ప మ గ మ రీ | స స స ని ధ ని స స
వ ర దు డ ఖి ల దే వ త ల కు వం ద్యు డు
స స రి స మ రి రి స | స రి గ మ పా , ,
క అ దు ట సు ర లు కు కం ట కు డు
గ మ పా ని పా సఁ ని సఁ ని రీఁ సఁ గఁ మఁ
ప ర మా త్ము డ బ్జ భ వ శి వా దు ల కు
రిఁ రిఁ సఁ సాఁ ని నీ సఁ ని ప మ గ మ ప మ రీ || (తెలిసిన)
ప రు ల కె ల్ల ము వ్వ రి లో నొ క డు

ఇట్లే క్రిందిచరణములు :

(౨) దేవుడు సనకా - ది మునులకును పర
దైవ మఖిల వే - దములకును ;
కైవల్య మొసగు ఘననిధి ; విధికి మ
హావిధి ; జడులకు యాదవకులుడు ॥ (తెలిసిన)

(3) అద్యు డచలుడు మ - హాభూత మిత డ
భేద్యు డసాధ్యు డ - భీకరుడు;
సద్యః ఫలదుడు - సకలమునులకును
వేద్యు డితడె పో - వేంకటవిభుడు. (తెలిసిన)

లఘుటీక : కలుదుటసురలు = దుర్విదగ్ధులైన శాత్రవులు ; విధికి మహావిధి = బ్రహ్మకు పెద్దబ్రహ్మ ; మహాభూతము = అన్నిభూతాలకు మూలమైన పెద్దభూతము. 'ఏకోవిష్ణు ర్మహద్భూతం' అన్నారు వ్యాసులు; అభీకరుడు = అభయమిచ్చువాడు ; సద్యఃఫలదుడు = కాలప్రతీక్ష లేక వెంటనే కోర్కెలు దీర్చువాడు ; వేద్యుడు = తెలియదగినవాడు.

ముద్రితపాఠములు : దెలియందు ; గరడుండ సురలకు ; డంబుజభవ ; అసాధ్యుడు భీకరుడు.

మనరాష్ట్రం; మనదేశం

(8 వ-పేజీ తరువాయి)

ఖర్చు హెచ్చించడానికి ప్రభుత్వం సంకోచించదు.

కార్మికుల సమస్య 1948-49 తో పోలిస్తే 1949-50 లో మేలుగా ఉన్నదన్నారు. కార్మికుల సమ్మెలు తగ్గినాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వాన్ని సాధించడానికిగాను తమవద్ద ధనాల్ని వినియోగించకుండా ఒకవిధంగా సమ్మెచేస్తున్నారనే నింద నిరాధారమైనదని చెప్పారు.

ఆహారంవిషయంలో అధికాహారోత్పత్తి ఉద్యమంవల్ల కొంత ఫలితం కలిగింది. 1950 లో 1949 లో కంటె ఆహారవస్తువుల ఉత్పత్తి 28 లక్షల టన్నులు వృద్ధికాగలదని అంచనావేశారు. 1949 లో 40 లక్షల టన్నుల ఆహారం విదేశాలనుంచి దిగుమతి చేసుకోవాలసివచ్చింది. 1950 లో 15 లక్షల టన్నులు దిగుమతిచేసుకుంటే చాలునని అంచనావేస్తున్నారు.

ఇందులో రెండులక్షల టన్నులు అవసర పరిస్థితుల నిమిత్తం నిధిగా నిలవచేస్తారు.

1949-50 బడ్జెట్ అంచనాలను వాస్తవంగా వచ్చిన ఆదాయాన్నిబట్టి చేసిన ఖర్చునుబట్టి సవరించగా రు 49 లక్షలు మిగులుండడానికి బదులు రు 3 కోట్ల 74 లక్షలు అదనంగా ఖర్చయిందని తేలింది. ఆదాయం అంచనా రు 323 కోట్ల 2 లక్షలు కాగా వాస్తవంగా వచ్చిన ఆదాయం రు 332 కోట్ల 36 లక్షలు. ఖర్చుఅంచనా రు 322 కోట్ల 53 లక్షలు కాగా వాస్తవంగా రు 336 కోట్ల 10 లక్షలు ఖర్చయింది. దీనికి ముఖ్యకారణం దేశరక్షణశాఖఖర్చు అధికం కావడమే.

ఈసంవత్సరంనుంచి దేశ ఆర్థికవ్యవహార నిర్వహణలో కొన్ని ముఖ్యమైన మార్పులు ప్రవేశపెట్టనున్నారు.

బడ్జెట్ సమయంలో ప్రభుత్వం ప్రతిపాదించిన రీతిని వివిధప్రభుత్వశాఖల ఆదాయం ఖర్చుల అంచనాలు సవ్యంగా నిర్ణయించబడినవో లేదో తనిఖీ చెయ్యడానికిగాను ఒక ఎస్టిమేట్స్ కమిటీని పార్లమెంటు ఎన్నుకుంటుంది. పార్లమెంటరీ పరిపాలనలో పార్లమెంటుకు తనిఖీచేసే అధికారం అవసరమనే అభిప్రాయం చాలనుండికి ఉన్నది. బ్రిటన్, అమెరికా మొదలైన దేశాల్లో - ఎస్టిమేట్స్ కమిటీలున్నాయి. అదేరీతిగ భారతరిపబ్లిక్‌లో కూడా పార్లమెంటు తనిఖీకి అవకాశం ఇవ్వడానికి ప్రభుత్వం నిశ్చయించింది.

ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ అధ్యక్షతక్రింద మొత్తం అయిదుగురు సభ్యుల్తో ప్లానింగ్ కమిషన్ నిర్మించబడింది.

సభ్యుల్లో నలుగురి పేర్లు ప్రకటించబడినాయి. వారు సర్ సి. డి. దేశముఖ్, శ్రీ జి. యల్. మెహతా (ఇండియన్ టారిఫ్‌బోర్డు అధ్యక్షులు), శ్రీ ఆర్. కె. పటేల్ (భారత ప్రభుత్వపు ఆహారశాఖా కమీషనర్).

ఈ కమిషన్‌ను బొంబాయికార్మికశాఖా మంత్రి శ్రీ గుల్జారీలాల్ నంద ఉపాధ్యక్షులుగా నియమితులైనారు. భారత రిపబ్లికన్ మంత్రివర్గకార్యదర్శి శ్రీ యన్. ఆర్. పిళ్లే కమిషన్‌కు కార్యదర్శిగానూ, ఆర్థిక శాఖకు చెందిన సర్దార్ త్రిలోకసింగ్, సహాయకార్యదర్శిగానూ నియమితులైనారు.

ఇటువంటి ప్లానింగ్ కమిషన్ సోవియట్ రష్యాలో ప్రప్రథమంగా స్థాపించబడింది. తరువాత తూర్పుయూరప్ రాజ్యాల్లో కూడా స్థాపించబడినాయి. అయితే ఈ దేశాలలో

ప్లానింగ్ కమిషన్‌కు అపారమైన అధికారాలివ్వబడినాయి. రష్యాలో ప్రభుత్వపరిపాలనావ్యవహారాలలో కెల్ల దేశ ఆర్థిక వ్యవస్థాపునర్నిర్మాణానికి ప్రథమ స్థానం ఇవ్వబడింది. రష్యాలోను తదితరదేశాల్లోను పంచవర్ష ప్రణాళికలను నిర్ణయించేవి ఈ ప్లానింగ్ కమిషన్లు.

అయితే మనదేశంలో భారతరిపబ్లిక్ ప్లానింగ్ కమిషన్ ఏరీతిగా నిర్వహిస్తుందో మున్ముందు చూడాలి. ప్లానింగ్ కమిషన్ నిర్మాణంతో మన ప్రభుత్వఆర్థికనిర్వహణలో అత్యంత ప్రధానమైన ఘట్టం ప్రారంభమయిందని చెప్పవచ్చును.

తరువాత చెప్పవలసిన ముఖ్యాంశం సంస్థానాల ఆర్థిక విలీనం.. భారతదేశచరిత్రలో ప్రప్రథమంగా ఆ సేతుహిమాచలం (పాకిస్తాన్ మినహా) భరతఖండానికి ఏకైక ఆర్థిక వ్యవస్థ నిర్మితమౌతున్నది. దీనితో జాతీయైక్యతకూ, రవాణాస్వేచ్ఛకూ, అపూర్వమైన అవకాశం లభిస్తున్నది.

ఈసంవత్సరం బడ్జెట్టులో వ్యాపారులు, పారిశ్రామికయజమానులు పెట్టుబడిదారులకు పన్నులభారం తగ్గించబడింది. ఇప్పటికైనా పెట్టుబడిదారులు లభించిన అవకాశాన్ని వినియోగపరిచి దేశంలో వస్తూత్పత్తిని వృద్ధిపరచడానికి కృషి చెయ్యగలరని ఆశించవచ్చును. ఉత్పత్తివృద్ధికీ, విదేశాలకు ఎగుమతులవృద్ధికీ ప్రభుత్వం తగిన అవకాశాలిచ్చింది. "వచ్చేసంవత్సరం బడ్జెట్ సమయానికి పారిశ్రామికవస్తూత్పత్తి వృద్ధి కాని పక్షంలో ఇంక భారతదేశంలో పెట్టుబడిదారులలో వ్యాపారోత్సాహం హరించిపోయిందని చెప్పవచ్చును. అప్పుడింక దేశాన్ని సోషలిస్టులకు ఒప్పగించడం తప్ప గత్యంతరం ఉండదు. (సీతారాం)

నేటిప్రపంచం

(24-పేజీ తరువాయి)

యూరప్‌లో సైన్యాల్నివృద్ధి పరచాలిగాని అ బాంబులవల్ల ప్రయోజనం ఉండదు అమెరికా తన సైనికనౌకావిమానబలాల్ని. వృద్ధిచేసి పశ్చిమయూరప్‌లో ముందుగా స్థావరాలు యేర్పరుచుకుంటేగాని ఏటం బాంబులూ హైడ్రోజన్ బాంబులూ వ్యర్థమే కాగలవు. ఇప్పుడు హైడ్రోజన్‌బాంబులూ ఏటంబాంబుల నుంచి ప్రజల్ని నగరాల్ని రక్షించుకునే సాధనాన్ని సృష్టించుకోవలసిన అగత్యం అధికంగా ఉంది కాని యుద్ధానికి హైడ్రోజన్‌బాంబులు ఏటం బాంబులకంటె గొప్పవి కావు. కాని అమెరికాలో హైడ్రోజన్‌బాంబు ప్రభావాన్ని గురించీ, అమెరికన్ నగరానికి రాగల ప్రమాదాల్నిగురించీ జరుగుతున్న ప్రచారం మాత్రం అనవసరంగా అధికంగా ఉంది.

ఆసియాలో కమ్యూనిస్టుముప్పు విపరీతంగా ఉన్నదని రోజు రోజూ ప్రచారంచేసి, ఆసియా దేశాన్ని రష్యా అమెరికాల మధ్య తగవుల్లో ఇరికించడానికి జరుగు యత్నాలు ఇదేరీతిగా ఉన్నాయి. కాని ఈ ఏటం బాంబులికీ హైడ్రోజన్ బాంబులికీ యూరప్ గురికాకుండా కాపాడ్డానికీ పశ్చిమయూరప్‌లో తమ స్థావరాల్ని స్థిరంగా నెలకొల్పుకోడానికి, అక్కడి సైనికబలాల్ని వృద్ధిపరచడానికీ అమెరికా తీవ్రకృషి చేస్తోంది. ఈ యత్నాలు కొనసాగించుకోడానికీ రష్యా దృష్టిని ఆసియావైపు మరలించడానికీ అమెరికా యత్నిస్తోంది. ఆసియాలో జాతీయవాదులికీ కమ్యూనిస్టులికీ మధ్య వైరాన్ని వృద్ధిపరిచి ఆసియా దేశాల్ని రణరంగంగా మార్చగలిగినట్లయితే యూరప్‌ని కాపాడుకోవచ్చును.

ఇటు అమెరికా యుద్ధోన్మాదప్రచారానికి తగినట్లుగా అటు రష్యా ప్రపంచశాంతి కోసమే యావచ్ఛక్తినీ వినియోగిస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. హైడ్రోజన్ బాంబుల తయారీకయే ఖర్చుకీ, యూరప్‌లో ఆర్థికసహాయానికీ, ఆసియాలో పోటీకీ తట్టుకోలేక అమెరికాఆర్థికవ్యవస్థ కూలిపోతుందని రష్యా ఆశిస్తోంది. ఆసియాలో ప్రజల ఆర్థికదుస్థితిని మరింత క్లిష్టపరచడం కమ్యూనిస్టుల కార్యక్రమం. మొత్తానికి ఉభయపక్షాలమధ్యనూ ఆసియా దేశాలు నలిగిపోయే ప్రమాదం ఉంది! ఉభయపక్షాల ఈయత్నాలకి వియట్‌నామ్ నాంది కావచ్చు.

[సూర్యనారాయణ]

లోటుబడ్జెట్


(18 వ- పేజీ తరువాయి)

లుగా జరుగుతున్నదే. ఇతని భూమి కొంత భాగాన్ని దౌర్జన్యంగా కలుపుకుందామని యితని దాయాదులు చూడ్డంలో, పంట కోతకు రాగానే యజమానికి కాక తమకే కోసుకోవడం, లేకపోతే యేగొడ్లనో తోలెయ్యడం వగైరాలు చేస్తూండడం జగద్విదితమే. మన సబు కరణాలకీ సంగతి చెప్పి యిద్దరేసి మనుష్యులను కాపలా పెట్టించాడు డబ్బిచ్చి గోపాలం. వాళ్ళు కాపలావాళ్ళని తంతే పోలీసు కాపలా కూడా పెట్టించాడు. ఏం చేసినా లాభం లేకపోయింది. పెద్దమనుష్యుల ద్వారా చెప్పిద్దామని ఎంతో ప్రయత్నిస్తే, అవతలవాళ్ళ భయంవల్ల వొక్కరూ వాళ్ళకి ప్రతికూలంగా చెప్పరే యితనికేగాని! ఈ విషయంలో చాలాసార్లు ఆఫీసుకి సెలవు పెట్టి వెళ్ళాడు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టాడు. ఇంకా సొమ్ము పట్టుకు రమ్మని స్నేహితుడు వ్రాశాడా వుత్తరం. ఇప్పుడు మంచున్నపళంగా కొంతసొమ్ము దక్కకపోతే వీలులేదు.


"అయ్యగారూ, పాదులకి పురుగడుతోంది. మందు తెప్పించి చల్లితే పోతాయి. మంచి బలమైన యెరువు తెచ్చివేస్తే బాగా కాస్తాయి. మన అబ్బాయిగారు చేతిగునపము, బాల్చీ ఆటల్లోకి పట్టికెళ్లి గునపము పారేశారుట. బాల్చీ తెచ్చారుగాని జల్లెడ లాగుందండి. నీళ్లు నిలవడం లేదు. అదీగాక నూతిలో చేదవేస్తే మట్టితేలుతోందండి. యెవరిచేతనైనా మట్టి తీయించి నుయ్యి బాగుచేయించాలండి. గునపమూ, బాల్చీ, మందూ, యెరువూ తెప్పించండి. పాదులు బాగా కాస్తాయి. లేకపోతే నావల్ల కాదు" అన్నాడు రంగయ్య.

ఎలక్ట్రిక్ డిపార్టుమెంటు బిల్లు, డాక్టరుబిల్లు కూడా రెండు నెలలక్రితమే వచ్చేశాయి. పాపం గోపాలంయేలాసర్దుకోగలడనన్నీ. ఏవైపు చూసినా ఖర్చు ఎక్కువ, రాబడి తక్కువ కనబడుతోంది. ఈసంగతి యెవరితో చెప్పుకుంటాడు? ఎవరితోనైనా చెప్పుకుంటే 'యింత చేతకానితనమా' అని హేళనచేస్తారని భయం. వచ్చే ఆదాయం చాలదని కాదు? తగ్గట్టుగా అన్నిఖర్చులూ సర్దుకుందామని అనుకోవడమే కాని అది క్రియారూపం దాల్చటం సాధ్యంలేదు. మానేస్తే నష్టం వచ్చే ఖర్చులు చేసుకోవాలి. నలుగురిలో తలవంపులు కాకుండా యివ్వవలసిన బాకీలు యిచ్చెయ్యాలి. ఇక యెవరడిగినది నాసొమ్ముదంకాదు సరేకానా తగ్గించినా కోపంతో ముఖం చిట్లించుకుంటారు. ఇక వీరికి ప్రయాణాలు చేయించవలసివస్తే యింక చెప్పనక్కర్లేదు. టిఫిన్లు, పేటాలూ భరించవలసిన గతే. ఇవన్నీ కాక పుట్టినరోజు పండుగలు, ఉత్సవాలు, బాధ్యతలకోసం చందాలు. కొత్తగా డబ్బు సంపాదించడానికి సాధనలేదు అప్పు. అన్నదమ్ములు పంచుకున్నప్పటినుండీ వచ్చే రాబడి, తన జీతం అతని మొత్తం రాబడి. ఎంత తంటాలు పడ్డా ఆదాయానికి, వ్యయానికి పొత్తుపెట్టలేకపోయాడు. అప్పుచేస్తే "చెల్లా తీరుస్తాడు" అని లోకం విమర్శిస్తుంది. పోనీ అని ఎల్లాగో సర్దుతున్నా మెచ్చుకుంటుందా? గౌరవం వుంటుందా? తెలివైనవాడు అని సంతోషిస్తుందా లోకం? వాళ్లలో వాళ్లు సర్దుబాటు చేసుకునే స్వభావం కలిగివుండడమే వుండదు. ఖర్మం చాలక సర్దుబాటు చేసుకున్నా లోకంమాత్రం యెందుకో అందుకు విమర్శించి నిందలు మోపక మానదు.

"ఈ లోటుబడ్జెట్‌తో వేగడం యెల్లాగ?" అని గోపాలం తలపట్టుకుని కూర్చున్నాడు.




భారతరిపబ్లిక్ అధ్యక్షులు శ్రీ బాబూ రాజేంద్రప్రసాద్ గారు, ప్రపంచ సౌమనస్య సంఘ సమావేశాలకు వచ్చిన ఫిలిప్పైన్ ప్రతినిధి లారెన్జో బాటిష్టాతో ముచ్చటించుచున్నారు.




ఆంధ్రసారస్వత పరిషత్సభకు వచ్చిన పెద్దలు.

ఆంధ్రసారస్వత పరిషత్ సభలు, మంచిర్యాల

శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు సభా ప్రారంభం చేసినారు.



ఆహార ప్రదర్శనాన్ని తిలకిస్తున్న సభాధ్యక్షులు శ్రీ ఇల్లిందల రామచంద్రరావుగారు



గృహపరిశ్రమల ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరిపిన శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారు.



Regd No. M. 4479

ఆంధ్రపత్రిక

★

ఉగాది సంచిక

★

ఆంధ్రపత్రిక వికృతి ఉగాది సంచిక సంవత్సరాదికి, అనగా 1950 మార్చి 19 వ తేదీకి వెలువడగలదని తెల్ప సంతసించుచున్నాము.

మనోజ్ఞమైన ముఖచిత్రము — వికృతిసంవత్సర పంచాంగము
విషయ సమగ్రమైన ప్రస్తావన — విజ్ఞానప్రదమైన వ్యాసములు
ఆధునిక కవుల పద్యరచనలు — రసవంతమైన కథలు

త్రివర్ణచిత్రములు — ఏకవర్ణచిత్రములు — ఛాయాపటములు

కలిగి, సంచిక సర్వాంగ సుందరముగ వెలువడుచున్నది.
డెమ్మీ క్వార్టో సైజున కనీసము 150 పుటలు కలిగియుండును.

వెల రు. 2 లు మాత్రమే.

మీ సమీపమున గల 'ఆంధ్రపత్రిక' ఏజంటువద్ద గాని మాకు వ్రాసిగాని వెంటనే మీ ప్రతిని రిజర్వు చేసికొనండి.

పోస్టుద్వారా పంపుటకు ప్యాకింగు, పోస్టేజిలకు అ. 8 లు అదనము.

మేనేజరు,
ఆంధ్రపత్రిక.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press 7. Thambu Chetty St., Madras